ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం : fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 56 పేజీలు: 8+16 వెల: 6.50


పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు 5లో

ప్రజాదరణలో ప్రధాని మోడీ ప్రపంచంలోనే టాప్

## భూతల దాడులకు సైనికులు రెడీ!



### అమెరికా సైనికులు 10వేలు..

### 10లక్షల సైన్యం సిద్ధమన్న ఇరాన్

### మరింత ముదిరిన వార్

**టెహ్రాన్, టెల్‌అవీవ్, వాషింగ్టన్; మార్చి 27:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింతగాపెరుగుతున్నాయి. ఓపక్క చర్చలని, సానుకూలంగా జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ప్రకటిస్తూనే మరోపక్క ఇరాన్‌కోసం 10వేల మంది పదాతిదళ సైనికులను మధ్యప్రాచ్యంలోని నౌకలపైకి చేరుస్తుండటంతో ఇరాన్‌సైతం ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. అంతేకాకుండా అమెరికా, ఇజ్రాయెల్‌లు భూతల దాడులకు సిద్ధం అయిన పక్షంలో ఎదుర్కొనేందుకు వీలుగా పదిలక్షలమందితో సైన్యాన్ని సిద్ధం చేసినట్లు ఇరాన్‌ప్రకటించింది. అంతేకాకుండా ఇప్పటివరకూ యుద్ధంలో 1900 మంది ఇరానీయులు మృతిచెందారని ప్రకటించిన ఇరాన్ అందుకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించింది. ఖర్గ్ దీవులను స్వాధీనంచేసుకునే యత్నాలు విరమించుకోవాలని చెపుతున్న ఇరాన్ అందుకు పటిష్టమైన మందుపాతరలను ఏర్పాటుచేస్తోంది. కాగా ప్రస్తుత యుద్ధంలో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌దేశాల్లో 20 మందికిపైగా మృతిచెందారు. అమెరికా సైనికులు కూడా 13 మందికిపైగా మృతులున్నారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో 100 మందికిపైగా మృతిచెందారు. ఇరాక్‌లో జరిగిన దాడుల్లో 80 మంది చనిపోయినట్లు ఆదేశాలుప్రకటించాయి. ఇదిలా ఉంటే ఖర్గ్‌నుంచి ఖెష్మ్ వరకూ ఆరు ఇరాన్ దీవులపైనే ట్రంప్ ఫోకస్‌పెట్టారు. ఈ దీవులపై దాడులుచేస్తే ఇరాన్ ఆయువుపట్టు >>2



శుక్రవారం న్యూఢిల్లీ నుంచి సిఎంలతో వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## ఇది సంక్షోభమే.. గట్టెక్కుదాం

### సమష్టి కృషితో టీమిండియా ఈ సమస్యను అధిగమించాలి

### బ్లాక్ మార్కెటీర్లపై కొరడా ఝుళిపించండి

### ఆర్థికస్థిరత్వం, ఇంధన భద్రతకు ప్రాధాన్యం

### సంక్షోభ పరిష్కారానికి ఐఎంజి ఏర్పాటు

### సిఎంలతో వర్చువల్‌గా చర్చించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,మార్చి 27:** ఆర్థికస్థిరత్వం, ఇంధనభద్రత ప్రధాన లక్ష్యాలుగా పరిగణించాలని ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రాలసీఎంలకు సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంనుంచి టీమిండియా తక్షణమే అధిగమిస్తుందని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం ఎన్నికలు జరిగే రాష్ట్రాలుమినహా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వర్చువల్‌గా భేటీ అయిన ప్రధాని నరేంద్రమోడీ బ్లాక్‌మార్కెటింగ్‌పైనా, ధరలను పెంచేందుకునిల్వలను బ్లాక్‌చేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని >>2

### పరిస్థితుల పర్యవేక్షణకు సిఎస్ ఆధ్వర్యంలో కమిటీ

రాష్ట్రంలో సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా: సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి27:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పరిస్థితుల నేప >>2



నప్రధానితో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం భద్రాచలంలో సీతారాముల కళ్యాణానికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సిఎం రేవంత్ రెడ్డి దంపతులు. చిత్రంలో మంత్రులు డి.సిఎం భట్టి, తుమ్మల , సురేఖ తదితరులు

## కమనీయం.. కల్యాణం

### భద్రాచలంలో వైభవంగా సీతారాముల పరిణయ మహోత్సవం

### పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్ రెడ్డి దంపతులు

### డి.సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, తుమ్మల, వాకిటి శ్రీహరి, సీతక్క హాజరు

### రూ.351కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### నేడు పట్టాభిషేకం, హాజరు కానున్న గవర్నర్

2లో



అయోధ్యలో బాలరాముడి నుదుట సూర్యతిలకం

### బాలరాముని నుదుట 'సూర్య తిలకం'

అపురూప దృశ్యాన్ని తిలకించేందుకు లక్షలాదిగా అయోధ్యకు తరలి వచ్చిన భక్తులు 2లో



శుక్రవారం నిజామాబాద్‌లో మీడియాతో కవిత

## ఏప్రిల్ 25న కవిత కొత్తపార్టీ

### మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద జెండాను ఆవిష్కరిస్తాం: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి27:** నూతన రాజకీయ పార్టీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కవిత >>2

## భారీ జిఎస్టీ స్కామ్

### రూ.217 కోట్ల మేర తెలంగాణ, ఎపిలో వెలుగుచూసిన వైనం




### హైదరాబాద్ కేంద్రంగా నకిలీ లావాదేవీలు

### షెల్ కంపెనీలతో రూ.1,472 కోట్ల మేర ఇన్వాయిస్‌లు

### రాష్ట్రంలో పలుచోట్ల ఇంటెలిజెన్స్ దాడులు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ జీఎస్టీ స్కామ్ వెలుగు చూసింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు ఈ కుంభకోణాన్ని బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై పక్కా సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించిన అధికారులు, ఏకంగా రూ.217కోట్ల మేర పన్ను ఎగవేసినట్లుగా జరిగినట్లు గుర్తించారు. నకిలీ లావాదేవీలతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని ఎగ్గొట్టడమే కాకుండా, తప్పుడు పద్ధతిలో రూ.217 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ మేరకు హైదరాబాద్లోని ప్రధాన కార్యాలయాలతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో డీజీజీఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న సుమారు 72 షెల్ కంపెనీల నెట్‌వర్క్ విచారణలో బట్టబయలైంది. ఎలాంటి ఎటువంటి వస్తువుల సరఫరా, సర్వీసు లేకుండా కేవలం ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలను సృష్టించినట్లుగా తెలుస్తోంది. ఇద్దరు కీలక వ్యక్తులు సిద్దగోని ప్రభాకర్, రమావత్ నాగరాజు నాయక్‌లను అధికారులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న దంట్ల ఆదిరెడ్డి అలియాస్ అంజిరెడ్డి ఈ నెట్‌వర్క్‌కు సూత్రధారిగా ఉన్నట్లు విచారణలో తేలింది. డీజీజీఐ అధికారులు ప్రకారం, అసాధారణమైన జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, రుణాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా ఈ కేసు వెలుగులోకి వచ్చింది. డేటా విశ్లేషణ, రిస్క్ ప్రొఫైలింగ్, క్షేత్రస్థాయి పరిశీలనను ఉపయోగించారు. వాస్తవానికి వ్యాపార కార్యకలాపాలు లేకపోయినా తతభారీ స్థాయిలో ఇన్‌వాయిస్‌లను జారీ చేస్తూ, ఏటీసీ క్లెయిమ్‌లు చేస్తున్న అనేక సంస్థలను గుర్తించారు. నకిలీ ఐటీసీని సృష్టించి, పంపిణీ చేయడం కోసమే షెల్ సంస్థలను ఏర్పాటు చేసిన ఒక సిండికేట్‌ను అధికారులు గుర్తించారు. అమాయక వ్యక్తుల ఆధార్,పాన్ వివరాలను యజమానులుగా చూపి 72షెల్‌కంపెనీల >>2



## 33 రోజుల తర్వాత భవితవ్యం!

### అజారుద్దీన్ మంత్రి పదవిపై అందరిలో ఉత్కంఠ

**హైదరాబాద్, మార్చి22,ప్రభాతవార్త:** అజారుద్దీన్ మంత్రిత్వం భారత, పాకిస్తాన్ క్రికెట్ ఆట మాదిరిగా ఉత్కంఠత రేపుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి మండలి జట్టులో కొనసాగుతున్న అజారుద్దీన్‌కు 33 బంతులలో 799 పరుగులు చేయాల్సిన లక్ష్యంగా మారింది. 2028 డిసెంబరు వరకు మంత్రి మండలిలో కొనసాగుతాడా లేక పెవిలియన్‌వైపు దారిపడుతాడా అని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. అజారుద్దీన్ అసెంబ్లీలోని ఉభయ సభలలో సభ్యత్వం లేకపోయినా అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణాస్వీకారం చేశారు. ప్రస్తుతం అజారోద్దీన్ కేబినెట్‌లో కొనసాగాలంటే 33 రోజుల్లో శాసనసభ నుంచి గానీ, శాసనమండలి నుంచిగానీ ఎన్నిక కావాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్‌లను శాసనమండలికి నామినేట్ చేసి గవర్నర్‌కు సిఫార్సు చేసినా గవర్నర్ ఆమోదించలేదు. ఏప్రిల్ 30తో అజారుద్దీన్‌కు శాసనమండలిలో సభ్యత్వం లభించకపోతే ఆయన రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఎదురుకాబోతున్నాయి. అధికార పార్టీ ఆశలన్నీ గవర్నర్ నిర్ణయంపైనే ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎలాగైనా బిఆర్‌ఎస్‌ను ఓడించాలనే లక్ష్యంతో అజారుద్దీన్‌ను మంత్రి మండలిలోకి తీసుకొచ్చారు. అజారుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకోకముందే ప్రొ.కోదండరామ్, అమీర్ అలీఖాన్ పేర్లను ప్రభుత్వం ఎమ్మెల్సీగా నామినేట్ చేసింది. వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసినా కోర్టుకేసుల నేపథ్యంలో సుప్రీంకోర్టు వారిని పదవీచ్యుతులను చేసింది. తిరిగి నామినేట్ చేసుకునే అవకాశం ప్రభుత్వానికి కోర్టు కల్పించింది. అమీర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్ నామినేటెడ్ చేశారు. ఐదు నెలలు గడుస్తున్నా పెద్దలసభలో ఆయనకు ప్రవేశం లభించడకపోవడంతో ఇప్పుడు మంత్రిగా ఆయన భవిష్యత్ ఏంటో అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీలో సభ్యత్వం లేని అజారుద్దీన్ >>2

## 10% పైగా పెరిగిన ధరలు



### మూతపడుతున్న సమోసా, మిఠాయి కేంద్రాలు

### కార్మికుల తొలగింపు, పనిగంటలు కుదింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి27:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రతి అంశంపై పడుతోంది. ఈ కారణంగా ఆయిల్ ధరలు పెరుగుదల,గ్యాస్,సిఎన్‌జీ కొరతతో అనే వర్గాలు నష్టపోతున్నాయి. గ్యాస్ ఆధారిత పరిశ్రమలు, హోటళ్లు, బేకరీలు, కర్రీపాయింట్లు, ఇతర వృత్తులు మూసివేసే పరిస్థితులు వచ్చాయి. అనేక చోట్ల గ్యాస్ ఖర్చును వినియోగదారులపైనే మోపాల్సిన పరిస్థితి వచ్చింది. కార్మికులకు చేతి నిండా పని కల్పించలేకపోవడం, లక్ష్యం మేర ఉత్పత్తి చేపట్టలేకపోవడంతో కుటీర పరిశ్రమలు కుదేలవుతున్నాయి. వాణిజ్య సిలిండర్ వాస్తవ ధరకు 2,3 రెట్లు అదనంగా పెట్టినా ఎక్కడా దొరకడం లేదని హోటల్ యజమానులు వాపోతున్నారు. మౌలిక వసతుల నిర్మాణం, రోడ్లు, ప్రాజెక్టులు వంటి పనులు చేసే పెద్ద సంస్థలపై 5 నుంచి 6 శాతం అదనపు భారం ఉంటుందని కొందరు అంచనా వేస్తున్నారు. అయితే బల్క్‌గా డీజిల్ కొనేవారికి 20శాతం వరకు అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. ఇద్దరి నుంచి ఐదుగురికి పనికల్పించే ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఆర్టీసీ క్రాస్‌రోడ్, పంజాగుట్ట, బేగంపేట, పాతబస్తీ, కూకట్‌పల్లి, నాంపల్లి, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట, బంజారాహిల్స్, సికింద్రాబాద్, తార్నాక, లక్డీకాపూల్ ప్రాంతాల్లో ఒక్కోచోట వందల్లో ఉన్నాయి. వీటిలో సుమారు >>2

## ఫీజుల భారం..ఘోరం!

### ప్రైవేటు స్కూళ్ల ఫీజు నియంత్రణ చట్టంపై పూర్తికాని మార్గదర్శకాలు

### బడ్జెట్ సమావేశాల్లో బిల్లుపెట్టే అవకాశం నిల్

### ప్రతి రెండేళ్లకు 8 శాతం పెంచుకోవచ్చనే ప్రతిపాదనలు పంపిన విద్యాశాఖ

### పూర్తిస్థాయి మార్గదర్శకాల రూపకల్పనలో రాష్ట్ర సర్కార్

### విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి చట్టం వచ్చే అవకాశం లేనట్టే!



**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 27:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చట్టం 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి వచ్చేలా కనిపించడం లేదు. బిల్లుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇప్పటి వరకు సిద్ధం కానట్టు తెలుస్తోంది. చట్టం చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు సిద్ధంగా ఉండి ఉంటే ఈ నెల 16 నుంచి ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల్లో ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశ పెడతామనే విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు చెప్పి ఉండేవి. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఫీజునియంత్రణ చట్టం బిల్లుపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. అంటే 2026-27 విద్యా సంవత్సరంలో కూడా ఫీజు నియంత్రణ చట్టం వచ్చే అవకాశం లేనట్టు తెలుస్తోంది. ఫీజుల నియంత్రణ చట్టం రాకపోతే ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని సుమారు 11వేల ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థులు తిరిగి లక్షల్లో ఫీజులను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల వసూలులో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ తరువాత ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లకు లక్షల్లో డొనేషన్లను వసూలు చేస్తుండటమే కాకుండా ఏడాది ఫీజు సైతం లక్షల్లో ఉంటుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఉద్యోగస్తులు తాము సంపాదిస్తున్నదాంటో సగం వారి పిల్లల ఫీజులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకోసం 2017లో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. తిరుపతి రావు కమిటీ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. వాటిల్లో 10శాతంలోపు ఫీజులను యాజమాన్యాలు పెంచుకోవడానికి ప్రతి పాదించగా 15 శాతం కంటే ఎక్కువ అయితే ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంటుందని ప్రతిపాదిస్తూ కమిటీతన నివేదికను 2020లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనలపై అప్పటి ప్రభుత్వం ఎటువంటి >>2

## ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్సీ గడువు పెంపు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతాల పెంపు కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) పదవీ కాలాన్ని ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ప్రభుత్వ ఉద్యోగుల సవరించిన వేతన సేళ్ల 2020 ప్రకారం పెండింగ్‌లో ఉన్న పే ఫిక్సేషన్లను పూర్తి చేయడానికి పొడిగించింది. వివిధ కారణాలతో పీఆర్సీ 2020 పే ఫిక్సేషన్ చేసుకోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వ అనుమతితో కాకుండా హెచ్‌వోడీ ద్వారా చేసుకొనేందుకు వీలు కల్పించింది. ఆరు నెలల పాటు అంటే సెప్టెంబర్ 30 వరకు ఈ గడువును పెంచింది. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అంతర్గత ఉత్తర్వులను జారీ చేశారు. కాగా మొదటి పీఆర్సీ పదవీ కాలం 2023, జూన్ 30తో ముగిసింది. దీంతో ఉద్యోగులకు కొత్త వేతనాలను స్థిరీకరించడానికి అప్పటి ప్రభుత్వం అదే ఏడాది అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్‌గా, మరో రిటైర్డు ఐఏఎస్ బి.రామయ్య సభ్యుడిగా ద్విసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది.ఆరు నెలల్లోగా >>2



శుక్రవారం భద్రాచలంలో సీతారాముల కళ్యాణోత్సవ ఘట్టం



వేడుకలను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డి.సిఎం భట్టి, మంత్రి పొంగులేటి దంపతులు, మంత్రులు కొండాసురేఖ, సీతక్క

# కమనీయం.. కళ్యాణం

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాభద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం శుక్రవారం భూలోక వైకుంఠంగా మారింది. ఆకాశమంత పందిరి, భూమంత మండపం, వేదఘోషల పరిమళాలు, 'శ్రీరామ జయరామ' నినాదాలతో మార్మోగిన ఆ క్షేత్రం యథార్థంగా దక్షి ణ అయోధ్యను తలపించింది. జగదభిరాముడైన శ్రీరాముడు, జనకనందిని సీతమ్మవారిని అభిజిత్ లగ్నంలో పరిణయం చేసుకున్న ఈ దివ్య ఘట్టం భక్తుల హృదయాలను పరవశింపజేసింది. ఈనెల 19వ తేదీ నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘటమైన శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి శాస్త్రోక్తంగా సాగిన దివ్య తంతు ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవలతో ప్రారంభమైన కార్యక్రమం, అభిషేకాలు, నివేదనలు, ధృవమూర్తుల ఏకాంత కళ్యాణంతో ఆరంభమైంది. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకి ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకు వచ్చారు. వేదమంత్రాల నడుమ తిరుకళ్యాణ సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం ఘనంగా నిర్వహించబడింది. సీతమ్మవారి నడుముకు దర్భతాడు బిగించడం, రక్షాసూత్రాలు ధరింపజేయడం, సువర్ణ యజ్ఞోపవీతం సమర్పించడం వంటి ప్రతి తంతు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్రబెల్లం తంతు అనంతరం మూడు మంగళసూత్రాలతో మాంగల్యధారణ జరగడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి పరవశంలో భద్రగిరి దేశ నలుమూలల నుండి తరలివచ్చిన భక్తజనం భద్రగిరిని నిండుగా కమ్మేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి దంపతులు ఈ మహోత్సవంలో పాల్గొనడం వేడుకకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ తరఫున భక్తి వాటారు.అంతేకాకుండా రూ.351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భద్రాద్రి అభివృద్ధికి నూతన దిశను సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమిషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, లక్షలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా నేడు రామయ్యకు పట్టాభిషేకం జరగనుండగా, రాష్ట్రగవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరుకానున్నారు.

# బాలరాముని నుదుట 'సూర్య తిలకం'

**అయోధ్య, మార్చి 27:** అయోధ్య రామమందిరంలో శ్రీరామనవమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. నూతన ఆలయ ప్రతిష్ఠాపన తర్వాత ఇది రెండవ శ్రీరామనవమి కాగా, ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా సూర్య తిలకం నిలిచింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరించి, అద్భుతమైన తిలకంగా మారాయి. దాదాపు 4 నిమిషాల పాటు ఈ దివ్యమైన దృశ్యం ఆవిష్కృతమవ్వడంతో గర్భగుడి మొత్తం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ అద్భుత ఘట్టం వెనుక ఆధునిక విజ్ఞానశాస్త్రం ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రత్యేకమైన అద్దాలు, కటకాల వ్యవస్థ ద్వారా సూర్యకిరణాలను ఆలయం పై అంతస్తు నుంచి నేరుగా గర్భగుడిలోని విగ్రహంపైకి మళ్లించారు. శ్రీరాముడు సూర్య వంశస్థుడు కావడంతో, ఆయన జన్మదినాన సాక్షాత్తు సూర్యభగవానుడే తిలకం దిద్దినట్లుగా భక్తులు ఈ ఘట్టాన్ని భావిస్తారు. ఈ అద్భుతాన్ని కనులారా వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు అయోధ్యకు తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆలయ అధికారులు నగరం అంతటా పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా బాలరాముడికి 56 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది వీఐపీ దర్శనాలను రద్దు చేసి, సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. ఈ సూర్య తిలకం వేడుక కేవలం ఆధ్యాత్మిక ఘట్టంగానే కాకుండా, భారత శాస్త్రీయ సాంకేతిక ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.

# ఏప్రిల్ 25న కవిత కొత్తపార్టీ

>> పిలుపునిచ్చారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఓ మహిళగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. నేను నిజామాబాద్ బిడ్డను. ఈ మట్టి మనిషిని. ఇక్కడి నుంచి నేను తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయిందని అన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఉన్నప్పుడు నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజు ప్రజా అవస్థలు చూశామని,అందుకోసమే ఓ కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా కొత్త పార్టీ రాబోతోంది. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా అని కవిత స్పష్టం చేశారు. జాగృతి సంస్థ ద్వారా రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల కోసం ఉద్యమించామన్నారు. పార్టీ ప్రారంభించినప్పుడే అజెండాతో పాటు, లక్ష్యాలను ప్రకటిస్తానని, డాడీ, మోడీ, చిన్న మోడీపై తన పోరాటం ఉంటుందని ప్రకటించారు. సామాజిక తెలంగాణ ధ్యేయంతో సర్వోదయ తెలంగాణ దిశగా ముందుకెళ్తామని, గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నామని కవిత గతంలో తెలిపారు.

# ఫీజుల భారం..ఘోరం!

>> నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ పార్టీ 2023 డిసెం బర్‌లో అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజులు భారీగా ఉన్నాయని వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. ఫీజుల నియంత్రణ అంశంపై 2024 జూలైలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. కమిటీ సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం తెలంగాణ విద్యా కమిషన్ తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు-2025ను ప్రభుత్వానికి సమర్పించింది. ఫీజు నియంత్రణ కోసం విద్యా శాఖ కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. రెండేళ్లకోసారి 8 శాతం ఫీజులను పెంచుకోవడానికి స్కూల్ యాజమాన్యాలకు అనుమతి ఉండాలని.. అంతకంటే ఎక్కువగా 9 శాతం అంతకంటే ఎక్కువగా ఫీజులను పెంచుకోవాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం ఉండాలని ప్రతిపాదించింది. ఫీజుల నిర్ధారణలోనూ పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపాదనల్లో విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న పాఠశాలలను బట్టి ఫీజుల నిర్ణయం ఉండాలని సూచించింది. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేయాలని, శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియకి విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూల్‌లో ఎంత ఫీజు ఉంది? ఏ ఏ క్లాసులకు ఎంతెంత ఫీజు తీసుకుంటున్నారు? అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేసిక్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు.

విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియ జరిగి ఫీజుల నియంత్రణ చట్టం చేయాలంటే నేటి నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టకపోతే 2026-27 విద్యా సంవత్సరంలో చట్టం రూపొందే అవకాశాలు తక్కువగా ఉంటాయనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. రాష్ట్రంలో త్వరగా చట్టం తీసుకొచ్చి ఫీజుల భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాలు కోరుతున్నాయి.

# 33 రోజుల తర్వాత భవితవ్యం!

>> మంత్రిగా ప్రమాణం చేసిన ఆరు నెలల్లోపు ఏదో ఒక సభకు ప్రాతినిథ్యం వహించాల్సి ఉండగా ఆ గడువు ఏప్రిల్ ఆఖరుతో ముగియబోతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ళకు ముస్లిం మైనార్టీలకు మంత్రి మండలిలో జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల పుణ్యమా అని అజారుద్దీన్ రూపంలో చోటు లభించింది.అజారుద్దీన్‌ను చట్టసభలకు పంపించే విషయంలో అనేక ప్రత్యామ్నాయ అంశాలను వెతుకుతున్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో రాజీనామా చేయించి అజారుద్దీన్‌కు చట్టసభల్లోకి మార్గం చూపుతారని ఇన్నాళ్ళు చేసిన ప్రచారం ఆయనకు విప్‌గా ఇవ్వడంతో వదంతిగా తేలిపోయింది. టిపిసిసి మహేశ్ కుమార్ గౌడ్ 2024 జనవరి 23న ఎమ్మెల్యే కోటాలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికైనారు. టిపిసిసి చీఫ్‌కావడంతో పార్టీ ప్రభుత్వం పరువుకాపాడుకోవడానికి ఆయనతో రాజీనామా చేయించి ఆ స్థానానికి అజారుద్దీన్‌ను పంపించే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతూ వస్తోంది. మహేశ్ కుమార్‌గౌడ్ ఎమ్మెల్సీ పదవి కాలం21నవంబరు 2027తో ముగియనున్నది. అజారుద్దీన్ కోసం ఎమ్మెల్సీ విజయశాంతిని రాజీనామా చేయిస్తారనీ తాజాగా వదంతులు బయలుదేరాయి.గత కొద్దిరోజులుగా గాంధీభవన్‌కు ఆమె దూరంగా ఉంటున్నారని పార్టీనేతలు అంటున్నారు. ముఖ్యమంత్రితో కూడా వైరుధ్యాలున్నాయని కాంగ్రెస్‌శ్రేణులు చెప్పుకొంటున్నారు.దీనితో ఆమె రాజీనామా అంశం చర్చగా మారింది.

# భారీ జిఎస్టీ స్కామ్

>> ద్వారా ఈ దందా చేశారు. ఈ నకిలీ కంపెనీలు ఎలాంటి వస్తువులూ సరఫరా చేయకుండానే కాగితాలపై రూ.1,472 కోట్ల విలువైన లావాదేవీలు సృష్టించారు.సామాన్యుల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి తప్పుడు పత్రాలతో ఫోర్జరీ రిజిస్ట్రేషన్లు చేసి నకిలీ సంస్థలను నడిపారు. ఈ కేసులో సిద్ధగోని ప్రభాకర్ టెక్నికల్ పనులు చూస్తుండగా,నాగరాజు నాయక్ తప్పుడు పత్రాలను తయారుచేసేవాడని అధికారులు తెలిపారు. ఈ భారీ జీఎస్టీ కుంభకోణానికి మెయిన్ వ్యక్తి ఆదిరెడ్డి డీజీజీఐ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నిందితులపై సీజీఎస్టీ చట్టం 2017ప్రకారం నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. అత్యాధునిక డేటా అనలిటిక్స్ సాయంతో ఏటీసీ స్కామ్‌ను అధికారులు బయటపెట్టారు.

## ఉద్యోగుల పిఆర్సీ గడువు పెంపు

>> నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అదే సంవత్సరం డిసెంబరులో కాంగ్రెస్ పార్టీ అధికా రం లోకి వచ్చింది. ఆ తర్వాత నుంచి కమిషన్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ వస్తోంది. ఈ నెల 31తో కమిషన్ పొడిగింపు కాలం ముగియ నుండడంతో మరో ఆరు నెలల పాటు పొడిగించింది.

# ఇది సంక్షోభమే.. గట్టెక్కుదాం

>> కోరారు. ఆర్థికపటిష్టతతోపాటు వాణిజ్యస్థిరత్వం, ఇంధన భద్రత, పౌరుల సంక్షేమమే ముఖ్యంగా ముందుకుపోదామని ప్రధాని దిశా నిర్దేశంచేసారు. సంక్షోభపరిష్కారంకోసం అంతర్ మంత్రిత్వశాఖల గ్రూప్ ఐఎంజిని ఏర్పాటుచేసామని, ఈనెల 3వ తేదీనుంచి ఈ మంత్రుల బృందం పర్యవేక్షణ సాగుతోందని చెప్పారు. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన అంతర్‌మంత్రిత్వశాఖల గ్రూప్‌పనిచేస్తోంది. రాష్ట్ర స్థాయిలోను, జిల్లాస్థాయిల్లోను కంట్రోల్‌రూమ్‌లు మరిన్ని ఏర్పాటుచేయాలని ఎలాటి అడ్డంకులు, అంతరాయం లేకుండా నిరంతర సరఫరా అయ్యేట్లు అధికారులను అప్రమత్తంచేయాలని సూచించారు. సమన్వయంతో ముం దుకువెళ్లాల్సిన తరుణం ఇదేనని, అన్ని స్థాయిల్లోను ప్రభుత్వ యంత్రాంగాన్ని యాక్టివేట్ చేయాలన్నారు. సరిహద్దు, తీరప్రాంత వచ్చే ఖరీఫ్‌సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇప్పటినుంచే ఎరువుల నిల్వలు, పంపిణీ వ్యవస్థలను పర్యవేక్షించాలనిసూచించారు. రాష్ట్రాలు సవాళ్లకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇక షిప్పింగ్ రంగం, అత్యవసరాల సరఫరా, మారిటైమ్ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. ప్రజల్లో అపోహలను తొలగించాలని, కొంతమేర అవాస్తవాలు ప్రచారం ఎక్కువయిందని, సహేతుకమైన సమాచారం అందించి ప్రజల్లో నెలకొన్న అపోహలు, ఆందోళనను తగ్గించాలని ప్రధాని సూచించారు. సమావేశంలో కొందరుముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లోని పరిస్థితిని వివరించారు. మొత్తంగా పరిస్థితులు అన్నీ అదుపులోనే ఉన్నాయని, పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ తగినంత నిల్వలు కొనసాగిస్తున్నామన్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు జరుగుతున్నాయని, బ్లాక్‌మార్కెటీర్లు, ధరలు పెంచేందుకు నిల్వలను దాచిపెట్టడం వంటి వాటిని సమూలంగా అరికట్టామని కొందరు ముఖ్యమంత్రులు తెలిపారు. అలాగే పెట్రోలు,డీజిల్‌పై కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రధానిని అభినందించారు. పశ్చిమాసియా సంక్షోభం అధిగమించడంలోప్రధానిమోడీ నాయకత్వంలో సమిష్టికృషితోముందుకు పోదామని సూచించారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభం అయిన తర్వాత మొట్టమొదటిసారి ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,యుపి సీఎం యోగి ఆదిత్యనాథ్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్; జమ్ముకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖు, అరుణాచల్‌సీఎం పెమాఖండు తదితరులున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్; హోంమంత్రి అమిత్‌షాలుకూడా ఈ సమావేశంలో ఉన్నారు. ఎన్నికలు జరిగే తమిళనాడు,పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించలేదు. తర్వాత ఆయా రాష్ట్రాలప్రధానకార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీసమీక్షచేస్తారని సమావేశం తర్వాత వెల్లడించారు.



శుక్రవారం అయోధ్య బాలరాముడి నుదుట సూర్యకిరణాలు తాకిన సందర్భాన్ని టివిలో చూసి అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# 10% పైగా పెరిగిన ధరలు

>> 25శాతం వరకు మూతపడగా మిగతావి అరకొరగా నడుస్తున్నాయి. రోజువారీ చీటీలు తదితర కిస్తీలకు రూ.200 నుంచి రూ.వెయ్యి వరకు చేయాల్సిన చెల్లింపులు ఆగిపోయే పరిస్థితులు తలెత్తాయని, కుటుంబ పోషణకు భారమవుతోందని వారంతా అవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరత, కట్టెల వినియోగం, అధిక ధరకు కొనుగోళ్ల కారణంగా వస్తువుల ఉత్పత్తి ధరలు పెరుగుతున్నాయి. మిఠాయిలపై పదిశాతం ధరలు పెంచినట్లు అనేక చోట్ల దుకాణ యజమానులు బోర్డులు పెడుతున్నారు. బేకరీ, సమోసా, పానిపూరీ, మిర్చి బండ్లు, ఛాట్ తదితర పదార్థాలు తయారు చేసే కేంద్రాల్లో ప్రతి ఉత్పత్తిపై కనీసం రూ.10 మొత్తాన్ని పెంచారు. ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది కార్మికులు నగరంలోని ఎక్కువగా మిఠాయిల తయారీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, సమోసా, మిర్చి షాపుల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్యాస్ కొరత రావడంతో ముగ్గురు పని చేయాల్సిన ప్రాంతంలో ఒక్కరిని మాత్రమే పనికి పిలుస్తున్నారు. లేదంటే ఉదయం ఒకరు, మధ్యాహ్నం ఒకరు, రాత్రికి ఒకరు రావాలని చెబుతున్నారు. వేతనం కూడా సగం కోతపెడుతున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నాలుగు రోజులు వర్షాలు: పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తదుపరి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముందని స్పష్టం చేసింది. పలు జిల్లాల్లో వడగండ్ల వానలు పడతాయని, హైదరాబాద్‌లోనూ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మేడ్చల్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నాగర్ కర్నూల్, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాలకు వర్షసూచన జారీ చేసింది. పలు ప్రాంతాల్లో పిడుగులు పడతాయని, అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఇదే సమయంలో ఈదురు గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని పేర్కొంది. ఇక తెలంగాణలో గత కొద్దిరోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది.ఇప్పుడు వర్షాలతో ఎండ ప్రభావం నుంచి కాస్త ఉపశమనం లభించనుంది.

# కేరళ, అసోం, పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి27:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ, కేరళ, అసోం, పుదుచ్చేరిలలో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. గోవాలోని పోండా ఉప ఎన్నిక క్యాంపెయినర్ల జాబితాలోనూ ఆయన పేరు ప్రకటించారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో చేర్చారు. కేరళ, అసోం, పుదుచ్చేరిలకు 40 మంది చొప్పున స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించింది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల పేర్లు ఉన్నాయి. స్టార్ క్యాంపెయినర్లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు.

## వారం - వర్జ్యం

28-03-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
దశమి ఉ.8.47
పుష్యమి మ.2.52
వర్జ్యం : రా.3.34-తె.5.09
దు.ఉ.6.05-ఉ.7.42
శుభసమయం : ఉ.8.00-ఉ.8.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వారఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో విభేదాలు రావచ్చు. తగు జాగ్రత్తలు పాటించండి. ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది.

**వృషభం:** స్నేహితుల సహకారం వలన కార్యలాభం కలుగుతుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** మీకు అత్యంత సన్నిహితులకు సమయానికి సహాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది.ఆరోగ్య మెళకువలుఅవసరం.

**కర్కాటకం:** మధ్యలో ముఖ్యమైన వ్యవహారాలను వాయిదా వేయక తప్పదు. ఇతరుల విషయంలో జోక్యం తగదు.

**సింహం:** విలువైన పత్రములు, డాక్యుమెంట్స్ మొదలగు వాటి విషయములలో జాగ్రత్తలను వహించండి

**కన్య :** మాట్లాడే ధోరణిలో జాగ్రత్త వహించవలసి ఉంటుంది. సంతాన విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**తుల :** దూర ప్రాంతాలకు సంబంధించి, విదేశీయానానికి సంబంధించి మీరు చేసే ప్రయత్నాలు సానుకూలమవుతాయి.

**వృశ్చికం:** వినూత్నమైన కార్యక్రమాలు, సరికొత్త వ్యాపారాలు చేసేవారు మీకు సన్నిహితం అవుతారు. వస్త్రలాభం కలదు.

**ధనుస్సు:** రాజకీయ నాయకులతో సంబంధాలు బలపడతాయి. ఉద్యోగంలో స్థాన మార్పునకు అవకాశం ఉంది.

**మకరం :** వర్గ సమీకరణకు పూనుకుంటారు. మీ జీవిత భాగస్వామి ఆరోగ్య విషయమై శ్రద్ధ వహించవలసి వస్తుంది.

**కుంభం:** కోర్టు తీర్పులు మీకు అనుకూలంగా వస్తాయి. మధ్యవర్తి పరిష్కారాల వలన లాభపడతారు.

**మీనం:** ఆర్థికపరమైన వాయిదాలు చెల్లించడంలో కొంత జాప్యం చేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పరిస్థితుల పర్యవేక్షణకు సిఎస్ ఆధ్వర్యంలో కమిటీ

>> థ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షి స్తోందని ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లారు.33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయని, బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రతి బంక్‌లో స్టాక్ ఎంత ఉంది, ఎంత వినియోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. తెలం గాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, పునరుత్పాక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్స హిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పీఎం మోదీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యేల క్రీడా పోటీలు
## హాజరు కానున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి27:** నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్-2026 నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శని,ఆదివారాల్లో ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు:** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు.

శనివారం సాయంత్రం 3.30 గంటలకు ఎల్‌బి స్టేడియంలో ప్రారంభమయ్యే ఎమ్మెల్యేల క్రీడా పోటీలకు సిఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు.

# భూతల దాడులకు సైనికులు రెడీ!

>> సడలుతుందని అంచనావేసారే కానీ, ఇరాన్ చేస్తున్న యుద్ధవైఖరి ఇప్పటికీ అటు ఇజ్రాయెల్‌కుకానీ, ఇటు ఇరాన్‌కు గానీ అంతుబట్టకుండా ఉంది. అలాగే ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాగ్చితోపాటు ఇరాన్ స్పీకర్‌నుమట్టుబెడితే ఇరాన్ అగ్రనాయత్వం తుడిచిపెట్టినట్లవుతుందని భావిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి ఇరాన్ ఫిర్యాదులుచేసింది. ఇరాన్‌పై దాడులను మరిన్ని పెంచుతామని ఇజ్రాయెల్‌ప్రకటించిన తరుణంలో ఇజ్రాయెల్ అణుస్థావరాలే తమ టార్గెట్ అని ఇరాన్‌ప్రకటించింది. ఇరాన్‌దాడులకు భయపడి అమెరికా సైనికులు హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లలో తలదాచుకుంటున్నారని, అలాచేస్తే ఆ దేశంలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లపైనాదాడులు తప్పవని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా సైనికులు,స్థావరాలు ఎక్కడ ఉన్నా ధ్వంసం చేస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి ప్రకటించడంతోఇపుడు గల్ఫ్‌దేశాల్లో ఆందోళన పెరి గింది. ఏప్రిల్‌ఆరవ తేదీ వరకూ తాముచేసేదాడులు నిలిపివేస్తామని ట్రంప్‌చేసిన ప్రకటన కేవలం ఇరాన్‌తోమైండ్‌గేమ్‌కోసమేనన్న భావన వ్యక్తం అవుతోంది.

## ఉత్తర తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

### రికార్డు స్థాయిలో 6,574 మెగావాట్ల వినియోగం

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ వినియోగం క్రమేపీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో రికార్డు స్థాయికి వినియోగం చేరుకుంది. ఈ సంస్థ పరిధిలో శుక్రవారం 6574 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు కావడంతో విద్యుత్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటి వరకు నమోదైన అత్యధిక గరిష్ట డిమాండ్ ఇదేకావడం విశేషం. సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతూ కొత్త రికార్డులను సృష్టిస్తోందని సంస్థ అధికారులు వెల్లడించారు. ఈ నెల 26న నమోదైన 6457 మెగావాట్ల రికార్డు డిమాండ్‌ను, శుక్రవారం మరింత పెరిగి 6,574 మెగావాట్లకు చేరుకుందని తెలిపారు.



హిజ్రాలు పెళ్లి చేసుకుంటున్న దృశ్యం

## శ్రీరాముడి కళ్యాణ మండపంలో హిజ్రాల పెళ్లి వేడుకలు

**వంగూరు, మార్చి 27 ప్రభాతవార్త:** శిరసనగండ్ల సీతారామచంద్రస్వామి గుట్టపై శుక్రవారం సీతారాముల కళ్యాణం నిర్వహిస్తుండగా మరో పక్క కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్త సందోహ మధ్య హిజ్రాలు పెళ్లి వేడుకలను నిర్వహించి రెండు జంటలు వివాహం చేసుకున్నారు. సీతారాముల కళ్యాణం తిలకిస్తూనే భక్తులు హిజ్రాల పెళ్లి తంతును ఆసక్తిగా తిలకించారు.

## భర్తను చంపేసి.. ఇంటి ముందే పాతిపెట్టేసింది!

- అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఘటన
- నాలుగు నెలల కిందటే కిరాతక హత్య
- అదృశమయ్యాడంటూ నాటకం
- కుమార్తె ప్రేమ వ్యవహారంతో వెలుగులోకి
- పోలీసులకు లొంగిపోయిన నిందితురాలు

అనంతపురం (క్రైమ్), మార్చి 27 ప్రభాతవార్త: మానవత్వం మంటగలిసింది... అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్తను సుమారు నాలుగు నెలల కిందట హత్య చేసింది. ఆపై గుట్టు చప్పుడు కాకుండా ఇంటి ఆవరణలోనే భర్త డెడ్ బాడీని పాతి పెట్టింది. ఆపై ఏమీ తెలియని అమాయకంగా జీవనం కొనసాగించింది. ఏ ఒక్కరికీ తనపై అను మానం రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. అయితే తాజాగా తన కుమార్తె ప్రేమ వ్యవహారంలో తల్లీ కూతురు ఇద్దరూ గొడవపడ్డారు. ఆమె ప్రేమ వ్యవహారంలో అడ్డు తగలడంతో హత్య ఉదంతం వెలుగు చూసింది. ఈ హృదయ విదారక సంఘ టనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం మండలం పాతచెరువు గ్రామంలో ఘటన చోటుచేసుకుంది. భర్తను హత్య చేసి ఇంటి ముందే పాతిపెట్టిన ఘటన శుక్రవారం బయటపడింది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం మృతుడు హనుమంతు (35)కు సుకన్యతో 2009లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. హనుమంతు స్వస్థలం బెలుగుప్ప మండలంలోని హనుమరెడ్డి పల్లి. ఇదిలావుండగా వివాహానంతరం పాతచెరువులో నివసిస్తోంది. నాలుగు నెలల క్రితం హనుమంతు అదృష్టమయ్యాడని కథ అల్లింది. భర్త కనిపించడం లేదంటూ సుకన్య కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సుకన్య ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అప్పటినుండి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే గురువారం సుకన్య, ఆమె కుమార్తె అమృత మధ్య జరిగిన గొడవతో అసలు విషయం బయటపడింది. కూతురు ప్రేమ వ్యవహారంపై తల్లి అడ్డుపడటంతో జరిగిన వాగ్వా దంలో, తండ్రిని తల్లే హత్య చేసిందని కుమార్తె వెల్లడించినట్లు గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. దీంతో విషయం బయటకు వచ్చి తన బండారం బయటపడిందని తెలుసుకున్న నిందితురాలు సుకన్య శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు లొంగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే హత్యకు దారితీసిన కారణాలపై నిందితురాలు నుండి పోలీసులు సమాచారాన్ని రాబడుతున్నారు.



## డిప్యూటీ స్పీకర్‌పై దాడిని ఖండించిన ఏపి సిఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్తప్రతినిధి:** ఉండి నియోవర్గం ఆకివీడు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామనవమి సందర్భంగా అక్కడ ఉన్న పురాతన ఆలయానికి పూజకు వెళ్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై, కూటమి నాయకులపై కొందరు దాడి చేయడాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శక్రవారం రాత్రి సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది"దశాబ్దాలుగా నిరాదరణకు గురైన రామాలయ పునరుద్ధరణకు పూనుకున్న డిప్యూటీ స్పీకర్ పూజలకు వెళ్లిన సమయంలో, బయటి వ్యక్తులతో కలిసి కొంతమంది ఆయుధాలతో దాడికి తెగబడటం గర్హనీయం. భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాల్సిన పవిత్ర సమయంలో ఇటువంటి సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదు. ఈ రోజు జరిగిన దాడిలో కొందరు గాయపడి ఆసుపత్రి పాలవ్వడం దురదృష్టకరం.




రజినీని చికిత్స కోసం తరలిస్తున్న సిబ్బంది

## ఆస్పత్రిలో వేధింపులు తాళలేక ఎఎన్‌ఎం ఆత్మహత్యాయత్నం

**వెల్దుర్తి. మార్చి 27, ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వప్రాథమిక ఆరో గ్య కేంద్రంలో శుక్ర వారం మహిళా వైద్యా ధికారుల వేధింపులు తాళలేక ఓ మహిళ ఏఎన్‌ఎం ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఆసుపత్రిలో పనిచేస్తున్న స్థానిక ఆసుపత్రిలో సౌజన్య. శిరీష. విధులు నిర్వహిస్తున్నారు. సెకం డ్ ఏఎన్‌ఎంగా పని చేస్తున్న రజిని మధ్యాహ్నాం వరకు విధులు నిర్వహించగా యుడిసి శ్రీలత మాసాయిపేట బి సబ్‌సెంటర్‌లో తక్ష ణమే అక్కడికి వెళ్లాలని ఆదేశించారన్న రూ. ఇప్పటివరకు విధులు నిర్వ హించిన తనకే మళ్లీ విధులు నిర్వహించాలని చెప్పడంతో ఒత్తిడికి. వేధిం పులకు మనస్తాపం చెందిన ఏఎన్‌ఎం రజిని ఆత్మహత్యానికి పాల్పడ్డారు. 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఎంబిసిలకు రూపాయి కూడా ఖర్చు చేయలేదు!

**2025-26లో బడ్జెట్ కేటాయింపు రూ. 400 కోట్లు**

**విడుదల రూ. 100 కోట్లు.. ఖర్చు నిల్**

**2026-27లో రూ. 402.35 కోట్లు కేటాయింపు**

**రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేసిన ఖర్చు రూ. 20.99 కోట్లు**

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబీసీ)కి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ.. వాటిలో ఎంబీసీలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఎంబీసీలో 36 సంచార జాతుల కులాలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పడిన జూన్ 2, 2024 తరువాత ఎంబీసీల అభివృద్ధికి కోసం అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ మార్చి 23, 2017లో జీవో ఎంఎస్ నంబర్ 6ను ఆ తరువాత ఏప్రిల్ 15, 2017న జీవో ఎంఎస్ నంబర్ 7ను జారీ చేసింది. బీసీల్లో అత్యంత వెనుకబడిన తర గతుల సాంఘిక, విద్యా, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం కోసం ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు.

అనంతరం బీసీల్లోని 36 సం చార జాతులను ఎంబీసీలో చేర్చుతూ జులై 26, 2018లో జీవో ఎంఎస్ నంబర్ 16ను జారీ చేసింది. అప్పటి నుంచి బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖ తరపున ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఎంబీసీ కార్పొరేషన్‌కి నిధు లను కేటాయిస్తూ వస్తున్నారు. అయితే గత ఏడాది 2025-26లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కేటాయించిన రూ. 11వేల కోట్ల బడ్జెట్‌లో ఎంబీసీ కార్పొరేషన్‌కి రూ. 400 కోట్లను కేటాయించింది. కేటాయించిన నిధుల్లో రూ. 100 కోట్లను విడుదల చేసింది. కానీ అందులో రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

ఎంబీసీలో ఉన్న వేలాది కుటుంబాల్లోని లక్షల మందిల్లో ఒక్కరికి కూడా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఎంబీసీలో ఉన్న 36 సంచార జాతులన్నీ కూడా బీసీ ఏలో ఉన్న కులాలే. ఈ ఏడాది ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖకు రూ. 12,511 కోట్లను కేటాయించింది. అందులో ఎంబీసీ కార్పొరేషన్‌కి రూ. 402.35 కోట్లను కేటాయించింది. అందులో రూ.2.35 కోట్లను నిర్వహణ పద్దుకి కేటాయించగా.. రూ. 400 కోట్లను ప్రగతిపద్దుకి కేటాయించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి నేటి వరకు రూ. 4900 కోట్లను కేటాయించింది. వాటిలో రూ. 601.50 కోట్లను విడుదల చేశారు. విడుదల చేసిన నిధుల్లో కేవలం రూ. 20.99 కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. రాష్ట్రంలోని ఎంబీసీల్లో కేవలం 2763 మంది లబ్ధిదారులకు రూ. 20.99 కోట్లను ఖర్చు చేశారు. ఈ ఏడాది అయినా ఎంబీసీల్లోని సంచార జాతులకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయాలని కోరుకుంటున్నారు.

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

**ఆలస్యంగా తీసుకొన్న నిర్ణయం**

**పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ**

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** పెట్రోల్ డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్నీ లీటరుకు రూ.10 చొప్పున తగ్గించే నిర్ణయం కేంద్రప్రభుత్వం ఆలస్యంగా తీసుకొందని అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు భారం మోపారని ఇప్పుడు ఎక్సైజ్ సుంకం తగ్గించినా ఆ ఫలితాలు అందు కోలేని పరిస్థితి సామాన్యులకు ఏర్పడిందని పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ విమర్శించారు. స్పెషల్ అదనపు ఎక్సైజ్ డ్యూటీ పెట్రోల్‌కు లీటరుకు రూ.13నుంచి 3రూపాయలకు డీజిల్‌కు రూ.10 నుంచి సున్నాకు తగ్గిం చామని వివరించారు. పది సంవత్సరాలుగా అత్యధిక పన్ను ప్రజల ముక్కు పిండి వసూలు చేసి ఇప్పుడు ఏదో ప్రజలకు లబ్ధి చేస్తున్నట్లు విన్యాసాలు చేస్తున్నదని ఎద్దేవా చేశారు. గత పది సంవత్సరాలు చమురు బ్యారెల్‌కు రూ. 50నుంచిరూ. 60కి మధ్యలో ధర ఉండేదని ఐనా లీటరు పెట్రోల్ ధరను 100కుపైగా పెంచివిక్రయించిందని ఆయన విమర్శించారు. సామాన్యుడి నుంచి దాదాపు 25 లక్షల నుంచి 30 కోట్లు పన్నురూపంలో దండుకొందని ఆవేదన చెందారు. ప్రజలపై భారం వేసి పిండుకొన్న 25నుంచి 30లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి పోయాయో తెల పాలని ఆయన డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావర్ణంతో ఎల్‌పిజి కొరత ఉందని కేవలం నెలరోజుల స్టాక్ మాత్రమే గ్యాస్ దేశంలో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. మోడీ కరోనాతో పోల్చి బయపెట్టడంతో దేశంలో పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు లైన్లు కట్టిఇ నిలుచున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో కూడా ప్రజలు ఇంధనం, ఎల్‌పిజి కోసం భయపడుతూ అధిక కొనుగోళ్లు చేస్తున్నారని ఆయన తెలిపారు. పార్లమెంట్‌లో మోడీ ప్రసంగం ప్రజలను భయాందోళనకు గురిచేసిందని విమర్శించారు.

## ఎల్పీజి నౌకలొచ్చేశాయి!

**42 వేల టన్నుల గ్యాస్‌తో గుజరాత్ తీరానికి జగ్ వసంత్**

**విశాఖ తీరానికి మరో ఎల్‌పిజి నౌక**

**30న విశాఖ పోర్టుకు మరో రెండు నౌకలు**

**న్యూఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారత్‌కు రెండు ఎల్‌పిజి ట్యాంకర్లు సురక్షితంగా చేరుకున్నాయి. 'జగ్ వసంత్' అనే పేరు నౌక, 42,000 టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి)తో శుక్రవారం గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవుకు వచ్చింది. అలాగే బిడబ్ల్యు బిర్చ్ అనే పేరు గల మరో ఎల్‌పిజి నౌక విశాఖ నౌకాశ్రయానికి చేరుకుంది. హర్మూజ్ జలసంధి మూసివేత భయాల నడుమ ఈ నౌకలు తమ ప్రయాణ మార్గంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం.సోమవారం పైన్ గ్యాస్ అనే మరో ట్యాంకర్‌తో కలిసి ప్రయాణం ప్రారంభించిన ఖిజగ్ వసంత్‌ఖి.. సంప్రదాయ మార్గానికి బదులుగా ఖేష్మ్‌లారక్ ఛానెల్ ద్వారా హర్మూజ్ జలసంధిని దాటింది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు తమను స్పష్టంగా భారతీయ నౌకలుగా గుర్తించేందుకు "ఇండి షిప్ అండ్ క్రూ", "జగ్‌వసత్‌ఇండ్‌షిప్‌ఇండ్‌క్రూ" వంటి సందేశాలను ప్రసారం చేశాయి. ఇరాన్ అధికారుల నుంచి ముందస్తు అనుమతితోనే ఈ నౌకలు ఇలా ప్రయాణించి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో భారత్‌కు సురక్షి తంగా చేరుకున్న మూడో ఎల్‌పిజి ట్యాంకర్ జగ్ వసంత్ కాగా, ఇప్పటికే శివాలిక్, నందా దేవి అనే మరో రెండు నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, వాడినార్ ఓడరేవులకు చేరుకున్నాయి. ఆ రెండు నౌకలు కలిపి 92,000 టన్నులకు పైగా ఎల్‌పిజిని తీసుకొచ్చాయి. జగ్ వసంత్ హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటిందని నౌకాయాన మంత్రిత్వ




శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ముందే వెల్లడించారు. ప్రస్తుతం కాండ్లా పోర్టుకు చేరిన ఈ నౌక నుంచి ఎల్‌పిజి బదిలీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.

విశాఖ పోర్టుకు మొత్తం మూడు 72 వేల టన్నులతో నిండిన ఎల్‌పిజి నౌకలు రానుండగా, అందులో ఒకటి బిడబ్ల్యు బిర్చ్ అనే నౌక శుక్రవారం పోర్టుకు చేరింది. మరో రెండు నౌకలు హెల్లాస్ గ్లాడియేటర్, గ్యాస్ జూపిటర్ ఈ నెల 30న విశాఖ తీరానికి చేరుకోనున్నాయి. హెల్లాస్ గ్లాడియేటర్ నెదర్లాండ్స్ నుంచి రానుండగా, గ్యాస్ జూపిటర్ యునైటెడ్ స్టేట్‌ను ఎల్‌పిజి నౌక రానుంది.

ఇదిలా ఉండగా, 136,728 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ నౌక 'ఎంటి జంబో' రష్యా నుంచి శుక్రవారం భారత్ చేరింది. అలాగే 96.542 మె.ట చమురు నౌక 'ఎంటి పాండేయ' ఏప్రిల్ 2న భారత్ రానుంది.

99,898 మెట్రిక్ టన్నుల చమురు నౌక 'దేశ్ గౌరవ్' ఏప్రిల్ 5న ముంద్రా పోర్టును చేరునుందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి.

## ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలు!

**ముగిసిన మూల్యాంకనం ప్రక్రియ**

**ప్రారంభమైన మూల్యాంకనానంతర పనులు**

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి ఈ నెల 18 వరకు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 6న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ఈ నెల 25తో ముగిసింది. మూల్యాంకనానంతర పనులను ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రారంభించింది. ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఒకసారి ఫలితాలను ఇంటర్ బోర్డు అధికారులు క్రాస్ చెక్ చేసుకోనున్నారు. ఫలితాలను క్రాస్‌చెక్ చేసుకున్న అనంతరం ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలను విడుదల చేయడానికి బోర్డు అధికారులు సిద్ధమైనట్టు తెలిసింది. ఇంటర్మీ డియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభమై.. ఈ నెల 18తో ముగిసిన నేపథ్యంలో ఫలితాలను త్వరగా విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు ప్లాన్ చేసింది. ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలను విడుదల చేసి మే మొదటి వారంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించి నెలాఖరు నాటికి వాటి ఫలితాలను కూడా ఇవ్వాలనే యోచనలో ఇంటర్ బోర్డు పక్కా ప్లానింగ్ చేసుకుంది.

ఈ యేడాది 9,97,075 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించారు. వారిలో పరీక్షలకు సుమారు 95 శాతం మంది హాజరయ్యారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,949 మంది పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు క్లాసులను ప్రారంభించేలా ప్రణాళికను రూపొందించుకున్నారు. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా.. ఈ నెల 13తో ప్రధాన పరీక్షలు ముగిశాయి. ఇంటిగ్రేటెడ్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఇంటర్ వార్షిక పరీక్షలు ముగియక ముందే.. ఈ నెల 4 నుంచే సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించారు. మూడు విడతల్లో ఇంటర్ మూల్యాంకనం చేపట్టాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. అందులో భాగంగా ఇంటర్ ప్రధాన పరీక్షలు ముగిసిన తరువాత ఈ నెల 15న మొదటి విడత స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభించగా.. మొత్తం ఇంటర్ పరీక్షలు ముగిసిన 18న రెండో విడత మూల్యాంకనాన్ని, ఈ నెల 20న మూడో విడత మూల్యాంకనం ప్రారంభమైంది. ఈ నెల 15న మొదటి విడతలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్ జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. ఈ నెల 18 నుంచి ఫిజికల్ సైన్స్, ఎకనామిక్స్, కెమిస్ట్రీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కాగా, మూడో విడత మూల్యాంకనం ఈ నెల 20 నుంచి బోటనీ, జువాలజీ, కామర్స్, హిస్టరీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. రాష్ట్రంలో 16 ఎవల్యూయేషన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. గత ఏడాది వరకు మైనర్ మీడియంతోపాటు, ఒకేషనల్ విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు పక్కన గల ఎంఏఎం కాలేజీలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ఎంఏఎంలో కేవలం ఒకేషనల్ విద్యార్థుల మూల్యాంకనాన్ని కొనసాగిస్తూ.. మైనర్ మీడియం విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మహబూబియా కాలేజీలో నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి ఏడాది ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే రెండు, మూడో వారంలో నిర్వహిస్తూ.. జూన్ మొదటి, రెండో వారంలో ఫలితాలను విడుదల చేసేవారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు క్లాసులు ఆలస్యమయ్యేవి. కానీ ఈ ఏడాది నుంచి అలా కాకుండా ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలను విడుదల చేసి, మే మొదటి వారంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించి మే నెలాఖరు నాటికి ఫలితాలను కూడా ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో జూన్ 1 నుంచి కాలేజీలు ప్రారంభం కాగానే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లు అందరూ అందుబాటులో ఉంటూ క్లాసులను రెగ్యులర్‌గా తీసుకునే అవకాశం ఏర్పడనుంది.

## ఎస్-400 క్షిపణి వ్యవస్థలను మరిన్ని కొనుగోలు చేయనున్న భారత్!

**న్యూఢిల్లీ, మార్చి 27:** ఆపరేషన్ సిందూర్‌లో గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 సత్తా చాటిన విషయం తెలిసిందే. దీంతో వీటిని మరిన్ని కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నేడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగే సమావే శంలో కీలక ప్రతిపాదనలను సమీ క్షించి, పలు పెద్ద ప్రాజెక్ట్ లకు క్లియరెన్స్ ఇచ్చే అవకాశం ఉంది. వీటిలో అయిదు ఎస్-400 క్షిపణి వ్యవస్థలతో పాటు 60 మధ్యశ్రేణి రవాణా విమానాలు కూడా ఉన్నాయి.



త్రివిధ దళాల్లో ఆయుధ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్యలు తీసుకుం టున్నట్లు తెలుస్తోంది. భారత వైమానిక దళం కోసం నాలుగు స్క్వాడ్రన్ల రిమోట్లీ పైలట్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, 800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేధించగలిగే బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన రక్షణ సేకరణ మండలి వెల్లడించింది. ఆధునిక యుద్ధంలో విరివిగా డ్రోన్ల వినియోగిస్తుండడంతో భారత పదాతిదళ విభాగాలలో ప్రత్యేక డ్రోన్ రెజిమెంట్లు, ప్రత్యేక క్షిపణి దళాల ఏర్పాటు గురించి కూడా చర్చించనున్నారు.

## వేడి గంజిలో పడి మూడేళ్ల చిన్నారి మృతి

**కృష్ణ, మార్చి 27, ప్రభాతవార్త :** వేడి గంజిలో పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గుడేబల్లూర్ గ్రామానికి చెందిన బొల్ల సుధాబాయి (25) భర్త నర్సిములు, వీరిది వ్యవసాయ కుటుంబం వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక బాబు అందులో చిన్న కుమార్తె నందిని(3) ఇంటి ముందు ఆడుకుంటుండగా ప్రమాదవ శాత్తు వేడి గంజిలో పడింది. వెంటనే పీహెచ్ సి ఆసుపత్రికి తరలించగా ఫలితం లేకపోగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం రాయచూరులో రిమ్స్ ఆస్పత్రికి తరలిం చారు.



నందిని (ఫైల్)

పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ చిన్నారి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందిందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. ఈ ఘటన పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగినదిగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు లేవని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భారీగా తగ్గిన కూరగాయల ధరలు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూరగాయల ధరలు తగ్గడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. కొన్ని రకాల కూరగాయల ధరలు భారీగా తగ్గగా, మరికొన్ని పెరిగాయి. ప్రధానంగా టమాటా, వంకాయ ధరలు పడిపోగా, బీరకాయ, పచ్చిమిర్చి ధరలు పెరగ్గా, టమాటా, వంకాయ ధరలు గత కొద్ది రోజులుగా భారీగా తగ్గుతున్నాయి. అదే బాటలో ఇప్పుడు మరింతగా తగ్గుముఖం పట్టాయి. అటు గత కొద్దిరోజులుగా పచ్చిమిర్చి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం కిలో టమాటా రూ.10కే లభిస్తుండగా, వంకాయ రూ.15కి రైతు మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఇక బెండకాయ రూ.28కి అమ్ముడవుతోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో దాదాపు ధరలు ఇలాగే ఉన్నాయి. కాగా కూకట్ పల్లి రైతు బజార్‌లో కేజీ టమాటా రూ.10, వంకాయ రూ.15, బెండకాయ రూ.28, పచ్చిమిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.20, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.12, బీన్స్ రూ.40, క్యారెట్ రూ.18, గోబి పువ్వు రూ.25, దొండకాయ రూ.35, చిక్కుడుకాయ రూ.40, గోరు చిక్కుడు రూ.25, బీట్ రూట్ రూ.18, క్యాప్సికం రూ.35, ఆలుగడ్డ రూ.18కి దొరుకుతున్నాయి. కిలో కీర రూ.14, దోసకాయ రూ.13, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.20, కంద రూ.35, ఉల్లపొరక రూ.25, ఉల్లిగడ్డ రూ.18, చామగడ్డ రూ.30, చిలకడదుంప రూ.25, ఎండుమిర్చి రూ.240, పుట్టగొడుగులు రూ.45, పండుమిర్చి రూ.80, పల్లికాయ రూ.50 వద్ద ఉంది.

## 127 మందితో అన్నాడిఎంకె రెండో జాబితా విడుదల

**చెన్నై, మార్చి 27:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులతో రెండవ జాబితాను అన్నాడీఎంకే శుక్రవారంనాడు ప్రకటించింది. ఈ జాబితాలో 127 మంది అభ్యర్థులు ఉన్నారు. దీనికి ముందు 23 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదలైంది. రెండవ జాబితా కూడా విడుదల కావడంతో ఇంతవరకూ ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య 150కి చేరింది. తాజా జాబితాలో పలువురు సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు చోటు లభించింది. తిరువళ్లూరు నుంచి బీవీ రమణ, పొల్లాచి నుంచి పొల్లాచి వి.జయరామన్, మదురాంతకం నుంచి మరగదం కుమారవేల్, కుంబకోణం నుంచి వి.సత్యనారాయణ, పెన్నేరి నుంచి పి.బలరామన్, తిరుత్తణి నుంచి కె.తిరుత్తణి, మాధవరం నుంచి వి.మూర్తి, తిరువొట్టియూరు నుంచి కె.కుప్పన్, చెంగల్పట్టు నుచి ఎం.రాజా అలియాస్ కె.రాజేంద్రన్ పోటీలో ఉన్నారు. మరోపక్క సీట్ల పంపకాలకు సంబంధించి ఎన్డీయే భాగస్వాముల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం అన్నాడీఎంకే 169 సీట్లలో పోటీ చేస్తోంది. తమది విజయవంతమైన కాంబినేషన్ అని, 210 సీట్లలో ఎన్డీయే గెలుపు ఖాయమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఎన్డీయే భాగస్వాములైన బీజేపీ 27 సీట్లలో పోటీ చేయనుండగా, అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పీఎంకే 18 నియోజకవర్గాల్లో, టీటీవీ దినకర్ సారథ్యంలోని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) 11 సీట్లలో పోటీ చేయనుంది. తక్కిన తమిళ మానిల కాంగ్రెస్, ఐజేకే, పీబీకే, పీఎన్‌కే, టీఎంఎంకే, ఎస్ఐఎఫ్‌బీ పార్టీలు అన్నాడీఎంకే గుర్తుపై కానీ బీజేపీ గుర్తుపై కానీ పోటీ చేయనున్నాయి. 243 మంది సభ్యుల తమిళ అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.



ఐడిబిఐ బ్యాంక్
CIN No. L65190MH2004GOI148838
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టర్డ్ ఆఫీస్: ఐడిబిఐ టవర్, డబ్ల్యుటిసి కాంప్లెక్స్, కఫ్ పరేడ్, ముంబయి-400005.
టెండరు ప్రకటన
NIT No.04/Admin & IMD /In-house catering and hostel housekeeping services/2025-26
హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల IDBI సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ICBF)లో ఇన్-హౌస్ క్యాటరింగ్ మరియు హాస్టల్ హౌస్‌కీపింగ్ సేవలకు టెండరు.
IDBI బ్యాంక్ లిమిటెడ్ యొక్క అపెక్స్ శిక్షణా కేంద్రమైన ICBF, హైదరాబాద్‌లో ఇన్-హౌస్ క్యాటరింగ్ మరియు హాస్టల్ హౌస్‌కీపింగ్ సేవల కోసం సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది.
టెండర్ సమర్పించడానికి చివరి తేదీ: ఏప్రిల్ 20, 2026 - 15:00 గం.ల వరకు (మ. 3:00 గం.లు)
వివరాల కొరకు బ్యాంక్ వెబ్‌సైట్: www.idbibank.in ను దర్శించండి.
గమనిక: పైన పేర్కొన్న టెండర్లకు సంబంధించి ఏవైనా తదుపరి అనుబంధాలు/ సవరణలు/ తేదీల పొడిగింపు/ స్పష్టీకరణలు/ బిడ్డర్ల ప్రశ్నలకు ప్రతిస్పందనలు మొదలైనవి బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే పోస్ట్ చేయబడతాయి. ప్రెస్‌లో ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయబడదు.
తేది: 28-03-2026 సం/- జనరల్ మేనేజర్, అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఐసిబిఎఫ్, హైదరాబాద్


వార్త

గొప్పవారి గొప్పతనం వారు తమకంటె తక్కువ వారితో వ్యవహరించే తీరును బట్టి తెలుస్తుంది.

- కార్లయల్

# నిర్లక్ష్యానికి మూల్యం

మానవ హృదయాలను కదిలించే మరో హృదయ విదారక రోడ్డు ప్రమాదం 14 మందిని కబళించింది. ఈ మధ్యకాలంలో ఇలాంటి ప్రమాదం ఇది రెండోది. రాత్రిపూట ఎంతో సంతోషంగా గమ్యం చేరేందుకు వీలుగా బస్సెక్కి ప్రయాణించేవారు తెల్లారేసరికి విగత జీవులుగా మారిపోవడం ఎంతో విషాదాన్ని నింపుతోంది. మార్కాపురం జిల్లాలో రాయపూర్ పరిసరాల్లో టిప్పర్‌ను ప్రయివేటు బస్సొకటి ఢీకొనగా గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 సజీవ దహనమవగా మరో 11 మంది చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. రోడ్డు ప్రమాదాలన్నీ డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాలు కండిషన్‌లో లేకపోవడం వంటి కారణాలతోనే జరుగుతుంటాయని గత సంఘటనలు తేల్చిచెప్పాయి. మార్గమధ్యంలో ప్రయాణికులు బస్సు కండిషన్‌పై ఆందోళన వ్యక్తం చేసి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో బస్సు సిబ్బంది ఎర్రగొండ పాలెం వద్ద దాదాపు గంటసేపు బస్సును నిలిపి ఉంచి మరమ్మతులు చేశారు. రోడ్డుకు ఎడమ వైపుగా వెళ్లాల్సిన బస్ డ్రైవర్ మూలమలుపు దగ్గర ఎదురుగా వచ్చే టిప్పర్‌ను అంచనా వేసుకోలేక ఢీ కొనడంతో డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. కొందరు అద్దాలు పగులగొట్టి బయటకురాగా మరికొంత మంది డ్రైవర్ సీట్లోంచి బయటకు వెళ్లబోయి మంటలకు ఆహుతయ్యారు. సజీవదహనమైన వారెవరి మృతదేహాలు గుర్తు పట్టేందుకు లేదు. వారి బంధువుల డిఎన్ఎ పరీక్షలతో పాటే అది సాధ్యమౌతుంది. తొలుత బస్ డ్రైవర్‌ను అధికారులు ప్రశ్నించినప్పుడు 'స్టీరింగ్ స్టక్' అయిందనే మాట వినవచ్చింది. కానీ ప్రమాదం జరిగినతర్వాత అధికారుల పరిశీలనలో తేలిందేమిటంటే డ్రైవర్ మానవ తప్పిదం వల్లనే ఇలా జరిగిందని స్పష్టం చేశారు. బస్సు కండిషన్ బాగుండకపోవడం, చాలా కాలంగా మరమ్మత్తులకు నోచుకోకపోవడం, డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోవడం వంటి ఎన్నో కారణాలను పరిశీలించి ప్రమాద కారణం విశ్లేషించే ప్రధాన బాధ్యత వాహన యాజమాన్యం, రవాణా అధికారులది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో రాజుకున్న మంటల్లో వారి ప్రాణాలు సజీవ దహనమయ్యాయి. వారి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. బస్సులో చెలరేగిన మంటల్లోంచి బయటికి వచ్చేందుకు ప్రయాణికులకు వేరే దారిలేకపోయింది. ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సులోని ప్రయాణికులంతా తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి సొంత ఊళ్లకు వస్తున్నారు. ముందు భాగంలో ఉన్న వారంతా వేముల, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారే ఉన్నారు. ఒకే ఘటన ఒక్కసారిగా ఇంత మందిని పొట్టనపెట్టుకోవడం కలచివేస్తోంది. సంఘటనఅనంతరం బస్సులోని 41 మంది ప్రయాణికుల్లో 28 మంది తీవ్ర గాయాలతో వివిధ ఆసుపత్రులకు తరలించారు. సజీవ దహన మృతుల్లో మహిళలు, వృద్ధులు, చిన్నారులుఉన్నారు. రెండు నెలల క్రితం కర్నూలు జిల్లాలో ఇలాంటి ప్రమాదమే జరిగింది. ముందున్న తలుపు తెరుచుకోగా బస్సంతా మంటలు దావానలంలో వ్యాపించాయి. వెనుక అద్దాల తలుపు బద్దలు కొట్టి బయటకు వచ్చినవారేబతికి బయటపడ్డారు. తాజా ప్రమాదంలో కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఆయిల్ ట్యాంకర్‌ను బస్సు ముందు భాగం ఢీకొనగా ట్యాంకర్ పగిలి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వింజమూరు ప్రాంతంలోని వారు కొద్ది రోజుల క్రితం ఉపాధి కోసం తెలంగాణలోని ప్రాంతానికి వలసవెళ్లారు. జగిత్యాలలో బుధవారం సాయంత్రం 5 గంటలకు బయటు దేరిన ఈ ప్రయివేటు బస్సు ఉదయానికి కలిగిరి చేరాలి. వాళ్లంతా శ్రీరామ నవమి వేడుకలకు తిరిగొస్తున్నారు. వీటికి కారకులెవరో కారణమెవరో విశ్లేషిస్తే చివరకు తేలేది మానవవ తప్పిదమే. కానీ సజీవ దహనానికి గురైన వారి కుటుంబాల వేదన తీర్చేదెవరు? 'స్టీరింగ్ స్టక్' అయినందునే అని సాంకేతికకారణం చూపినా దానికి బాధ్యత వహించాల్సింది. డ్రైవరు, అది బాగు చేయించి బయలుదేరాక మళ్లీ ఏమైందో ఏమోకానీ బస్సు వేగంగా వెళ్లి టిప్పర్‌ను ఢీకొంది. 'స్టీరింగ్ స్టక్' అనేది యాంత్రిక కారణమైనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసిన అధికారుల బాధ్యతారహితంగా వ్యవహరించాలనుకోవాలి. ఏతావాతా రవాణా శాఖ నిర్లక్ష్యమూ కన్పడ్తోంది. గత యేడాది అక్టోబరు నెలలో కర్నూలు జిల్లాలో ఓ ప్రైవేట్ బస్సు ఇలాంటిప్రమాదానికి గురైతే 19మంది దుర్మరణం చెందారు. భారీగా అధికార యంత్రాంగం ఎంతో హడావుడి చేసింది. ఇకపై ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తామన్న నేతలు ఇప్పుడేం చెబుతారు. బస్సుల ఫిట్‌నెస్, కండక్టర్, బస్సు కండిషన్ వంటి అంశాలపై రవాణా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉంటే మరో ప్రమాదం జరిగి ఉండేది కాదు. ప్రతిరోజూ అన్ని బస్సులూ తనిఖీ చేయాల్సిన బాధ్యత నుంచి రవాణా అధికారులు తప్పించుకో జాలరు. జాతీయ రహదారుల్లో జరిగేప్రమాదాలు మానవ తప్పిదంవైపేవేళ్లు చూపిస్తున్నాయి. అతిసాధారణ ప్రయాణం అదుపుతప్పితే సామూహిక మరణాల అగ్నిగుండంగా మారిపోవటాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. డ్రైవర్లకు తగినశిక్షణ, విశ్రాంతి నియమాలు, ఎమెర్జెన్సీ భద్రతా ప్రమాణాలు, ప్రైవేట్ వాహనాల ప్రయాణాలపై నిరంతర తనిఖీలున్ననాడు ప్రమాదాల సంఖ్య తగ్గిపోయే అవకాశంఉంటుంది. ఇటీవల కర్నూలు బస్సు అగ్నికి ఆహుతైన సంఘటనలో 19 మంది చేవెళ్ల బస్సులారీ ప్రమాదం అనంతరం మరో ప్రమాదం ఆపలేకపోవడం విచారకరం.



తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం ఎలాగో తెలియచేసేదే నాగరికత.

మహాత్మాగాంధీ



ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణుకువతో మెలగాలి.

ఎమర్సన్

# 'మత్తు'ను ఉపేక్షిస్తే ఉపద్రవమే

**ఎన్నో దేశాలు రకరకాల వ్యూహాలతో ఈ మత్తుపై యుద్ధాన్నే ప్రకటిస్తుంటే మనదేశంలో ఏదో ప్రకటనలు, నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్నారు. ఉన్న చట్టాలను కూడా సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారు. ఫలితంగా ఈ మత్తువ్యాపారం అంతకంతకు పెరిగిపోతున్నది. ఈ మత్తుమందుల మైకంలో యువత చేయరాని, చేయకూడని పనులకు కూడా ఎగబడుతున్నది. నేరాలు పెరిగిపోతున్నాయి. యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఈ మాదకద్రవ్యాల సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన తరుణమిది. మాటలతోకాకుండా చేతలతో చూపించాల్సిన సమయమిది. ప్రభుత్వంపైనే పూర్తి బాధ్యత వదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, అందరూ కలిసికట్టుగా త్రికరణశుద్ధిగా మాదకద్రవ్యాల నిర్మూలన యజ్ఞంలో పాల్గొంటే తప్ప ఈ ముప్పుతప్పే అవకాశాలు లేవు.**

దామెర్ల సాయిబాబ

రాజకీయ నాయకులు వచ్చే ఎన్నికల గురించి ఆలోచిస్తుంటే రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్ గురించి మదన పడుతుంటారని పెద్దలు అంటారు. కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులు, అవసరాలను ఎదుర్కొని పరిష్కారంవైపు ఎలా అడుగులు వేయాలన్నది రాజనీతిజ్ఞులు ఆలోచిస్తుంటే పరిష్కారంవైపు చూస్తూనే రాజకీయంగా ప్రయోజనం ఎలా పొందాలనేదే రాజకీయ నాయకులు ఆరాటపడుతుంటారు. అందుకు అనుగుణంగానే చర్యలు చేపడుతుంటారు. ఇదేదో ఇప్పటికిప్పుడు ప్రారంభ మైందని చెప్పడం లేదు. ఏనాటి నుంచో ఉన్నా తమ వ్యూహాలు, అభిప్రాయాలను ఆనాటి రాజకీయ నాయకులు తమ అంతరంగాల్లోనే ఉంచుకొని విశాల హృదయంతో సమాజంలో సమస్యల పరిష్కారంవైపు అడుగులు వేస్తున్నట్లు కన్పించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఏ అవకాశం, సమస్యలు వచ్చినా అధికారంలో ఉన్నవారిని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం, వీరిని ఇబ్బందులపాలు చేసేందుకు అధికారపక్షం ఉపయోగించుకుంటూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్న మాట వాస్తవమే. కానీ ఇదేదో తెలంగాణలో మొన్నటి టిఆర్‌ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కానీ, లేక ప్రస్తుత కూటమి ప్రభుత్వ కాలంలో కానీ ప్రారంభం కాలేదు. దశాబ్దాల తరబడి కొనసాగుతున్నది. మారిన పరిస్థితులు, అలవాట్లకు అనుగుణంగా కొందరు స్మగ్లర్లు సొమ్ము చేసుకునేందుకు ఈ వ్యాపారం విస్తరిస్తున్న మాట వాస్తవం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలరహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పదేపదే ప్రకటిస్తున్నారు. ప్రత్యేకంగా 'ఈగల్' విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంలో దృఢసంకల్పంతో ఉన్నారు. ఈ మహమ్మారిని తుదముట్టించేందుకు రాజీలేని పోరాటం చేస్తున్నామని ప్రకటిస్తూనే ఉన్నారు. అయినా ఈ మహమ్మారి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా కూడా విస్తరిస్తూనే ఉన్నది. మెక్సికో కేంద్రంగా రకరకాల మార్గాల్లో అనేక దేశాల్లో ప్రవేశిస్తున్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు దాదాపు వెయ్యి టన్నులకు పైగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాలను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. తెలుగు రాష్ట్రాల్లోకూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. తాజాగా గతవారంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సంబంధించిన మొయినాబాద్‌లో ఉన్నఫామ్‌హౌస్‌పై 'ఈగల్' టీమ్ జరిపిన దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు లోతుకు వెళ్లేకొద్దీ రకరకాల మలుపులు తిరుగుతున్నాయి. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఒక డాక్టరుతోపాటు మరో ముగ్గురిని దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆ ఫామ్‌హౌస్‌లో గత నాలుగేళ్లుగా ఈతంతు జరుగుతున్నదనే ప్రాథమిక సమాచారం మేరకు దర్యాప్తు అధికారులు చేస్తున్న విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. నిందితుల సంఖ్య ఇప్పటికే పదిహేనుకుపైగా చేరింది. నేరస్తులు ఏ పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని రుజువులతో సహా న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్ష వేయిస్తామని

## ఒక్క మాట

పాలక పెద్దలు చెబుతున్నారు. ఇలా పట్టుబడినప్పుడు గత పాలకులు కూడా ఇలాంటి ప్రకటనలే చేశారు. కానీ నిర్దిష్టమైన చర్యలుతీసుకున్న దాఖలాలు లేవనే చెప్పొచ్చు. గతంలో ఒకసారి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఏకంగా విలేకరుల సమావేశం పెట్టి డ్రగ్స్ వినియోగం వ్యాపారానికి సంబంధించి కొందరినిఅరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టుకు సిద్ధం చేసామని ప్రకటించారు. దర్యాప్తు కొనసాగుతున్నదికనుక వారి పేర్లువెల్లడించలేమని ఆధారాలు లభించగానే అన్ని వివరాలు ప్రకటిస్తామని ఎంతటి పెద్దవారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదనిప్రకటించారు. అప్పట్లో చాలా మంది రాజకీయ నాయకుల పుత్రరత్నాల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆ తర్వాత ఆ కేసు ఏమైందో ఇప్పటికీ వెలుగు చూడలేదనే చెప్పొచ్చు. ఇకపోతే మొన్నటి టిఆర్‌ఎస్‌ప్రభుత్వ హయాంలో కూడా భారీ డ్రగ్స్‌కుంభకోణం వెలుగు చూసింది. పలువురు సినీప్రముఖుల పేర్లు మళ్లీ ప్రచారంలోకి వచ్చాయి. ఈ వ్యాపారం, వినియోగంలో ఊహించని పేర్లుకూడా తెరపైకి తెచ్చారు. విచారణ పేరుతో పెద్దఎత్తున ప్రచారం చేసి భారీ చర్యలు ఉండబోతున్నట్లుగా చెప్పుకున్నారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయినట్లు కొన్నేళ్ల తర్వాత దాదాపు అందరికీ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇవేకాదు గత పదేళ్లుగా దేశవ్యాప్తంగా లక్షలాదికోట్ల విలువైన హెరాయిన్, కొకైన్ లాంటి మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. అందుకే ఎవరెన్ని చెప్పినా, ఎన్ని చట్టాలు తెచ్చినా, డ్రగ్స్ వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. 2004-14 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా మూడు లక్షల అరవైమూడు వేల కిలోల మత్తుమందుపట్టుకోగా 2014-24 మధ్య అది ఇరవైనాలుగు లక్షలకిలోలకు చేరిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గత యేడాది ప్రకటించారు. కానీ అధికారుల కళ్లు గప్పి రకరకాల మార్గాల్లో పోతున్నవి ఇంతకు ఎన్నోరెట్లు ఎక్కువ ఉండవచ్చునని అనధికార అంచనా. హుక్కా కేంద్రాలు, మరిన్ని వ్యాయామశాలలు, ఇంకొన్నిరెస్టారెంట్లు, విద్యాలయాలు, ప్రయాణ ప్రాంగణాలు, నగరాల శివార్లలోనూ పారిశ్రామిక వాడలదాకా వ్యాపించిన ఈ దుసంస్కృతి జాతి భవితను ప్రశ్నార్థకం చేస్తున్నది. ఎవరెన్ని కేకలు వేసినా, హెచ్చరికలు జారీ చేసినా దీనిని నిరోధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. పట్టుబడిన కేసుల్లో కూడా తొంభైశాతానికి పైగా న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. అందుకే పట్టుబడి జైళ్లకు వెళ్లి వచ్చినవారు సైతం మళ్లీ అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. పోలీసులన్నా, నార్కోటిక్ విభాగం అధికారులన్నా ఈ మత్తుమందు వ్యాపారుల్లో భయభక్తులు లేవు. తిరుగులేని సాక్ష్యాలతో న్యాయస్థానాల ముందు రుజువుచేసి నిందితులకు శిక్షలు వేయించడంలో అధికారగణం విఫలమవుతున్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే చార్జ్‌షీట్ పకడ్బందీగా ఉండాలి. న్యాయస్థానాల ఎదుట నిరూపించదగిన సాక్ష్యాలు సేకరించాలి. అందులో విఫలమవుతున్నారనేది రికార్డులే వెల్లడిస్తున్నాయి. యువతను నిర్వీర్యం చేసి జాతి ప్రయోజనాన్ని దెబ్బతీసి ఈ మత్తుమందును నిర్మూలించేందుకు ఎన్నో దేశాలు పకడ్బందీ వ్యూహాలతో పదునైన చట్టాలతో అడుగులు ముందుకు వేస్తున్నాయి. చైనా, వియత్నాం, ఇరాన్, థాయిలాండ్ సౌదీ అరేబియా, కాంబోడియా, ఇండోనేషియా, ఉత్తరకొరియా, కొలంబో తదితర దేశాలు మత్తుమందుల నేరాలలో మరణ శిక్షలు విధిస్తున్నాయి. ఫిలిప్పీన్స్‌లో అయితే ఆ పాలకులు మరో అడుగు ముందుకు వేసి ఈ మత్తుమందుల వ్యాపారంలో భాగస్వాములైన వందలాది మందిని గతంలో కాల్చి చంపింది. అమెరికా లాంటి దేశాలు మత్తుమందుల నియంత్రణ, నిరోధానికి యేటా వేలాదికోట్లు ఖర్చుపెడుతున్నాయి. ఇలా ఎన్నో దేశాలు రకరకాల వ్యూహాలతో ఈ మత్తుపై యుద్ధాన్నే ప్రకటిస్తుంటే మనదేశంలో ఏదో ప్రకటనలు, నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్నారు. ఉన్న చట్టాలను కూడా సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారు. ఫలితంగా ఈ మత్తువ్యాపారం అంతకంతకు పెరిగిపోతున్నది. మొయినాబాద్ ఫామ్‌హౌస్, కాల్పులు, డ్రగ్స్ కేసును పాతవాటి మాదిరిగానే నీరుగార్చేందుకు కొందరు రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఈ మాదకద్రవ్యాల సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన తరుణమిది. మాటలతోకాకుండా చేతలతో చూపించాల్సిన సమయమిది. ప్రభుత్వంపైనే పూర్తిబాధ్యత వదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, అందరూ కలిసికట్టుగా త్రికరణశుద్ధిగా మాదకద్రవ్యాల నిర్మూలన యజ్ఞంలో పాల్గొంటే తప్ప ఈ ముప్పు తప్పే అవకాశాలు లేవు. ●

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంధన పరీక్ష

ఈ. శ్రీనివాస్ రావు

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ ఘర్షణలు నేడు ప్రతి దేశపువంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో సింహభాగం సాగే హర్మూజ్ మార్గం నేడు యుద్ధ నీడలో చిక్కుకుంది. ఒకప్పుడు రోజుకు వందకు పైగా నౌకలతో కళకళలాడే ఈ జలసంధిలో, ప్రస్తుతం ఆ సంఖ్య ఒక అంకెకు పడిపోవడం సరఫరా గొలుసు ఎంతలా దెబ్బతిన్నదో అద్దం పడుతోంది. నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో సహజ వాయువు, చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లోఒక్కసారిగా ఎగబాకాయి. బ్రెంట్ క్రూడ్ ధర 100 డాలర్ల మార్కును దాటడం భవిష్యత్తులో రాబోయే భారీ ద్రవ్యోల్బణానికి సంకేతంగా కనిపిస్తోంది. ఈసంక్షోభ ప్రభావం కేవలంపేద దేశాలకే పరిమితం కాలేదు. ఆస్ట్రేలియా, అమెరికా, సింగపూర్ వంటి సంపన్న దేశాల్లో సైతం పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారాయి. డీజిల్ ధరలు పెరగడం అంటే అది కేవలం రవాణా ఖర్చు పెరగడం మాత్రమే కాదు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటడమే. గ్రీస్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో ఎల్పీజీ ధరల పెరుగుదల గ్లోబల్ మార్కెట్‌లోని అసమానతలను మరోసారి బయటపెట్టింది. విమాన ఇంధన ధరల పెరుగుదలతో ప్రయాణ రంగం కూడా అదనపు సర్చార్జీల భారంతో కునారిల్లుతోంది. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పెరుగుదల వల్ల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచాల్సి రావడం సామాన్య వినియోగదారునిపై భారం మోపింది. ప్రస్తుతానికి పరిస్థితి కొంత నియంత్రణలో ఉన్నట్లు కనిపిస్తున్నా, యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే అది దేశీయ ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ సంక్షోభం ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన హెచ్చరికను జారీ చేస్తోంది. ఇంధనం కోసం కేవలం శిలాజ ఇంధనాలపై, అది కూడా ఒకే ప్రాంతంపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఇప్పుడు అర్థమవుతోంది. సౌర, వాయు వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లడం ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదు. సంక్షోభ సమయాల్లో దేశ అవసరాలను కనీసం కొన్ని నెలల పాటు తీర్చగలిగేలా భారీ ఇంధన నిల్వలను ఏర్పాటు చేసుకోవడం ప్రతి దేశానికి రక్షణ కవచంవంటిది. పరిశ్రమలు, రవాణా రంగాల్లో ఇంధన పొదుపు చర్యలను ప్రోత్సహించడం, ప్రజల్లో అవగాహన పెంచడం తక్షణ అవసరం. ప్రపంచం ఒకే ఆర్థిక గ్రామంగా మారిన ఈ తరుణంలో, ఎక్కడో ఒక మూల తలెత్తే అశాంతి ప్రతి ఇంటి గడపనూ తాకుతుంది. దీనికి ఇంధనస్వయంసమృద్ధి సాధించడమే దీర్ఘకాలిక పరిష్కారం. దేశాలు కేవలం తాత్కాలిక ధరల నియంత్రణతో సరిపెట్టుకోకుండా, సమగ్రమైన ఇంధన భద్రతా వ్యూహాలను రూపొందించుకోవాలి. లేని పక్షంలో, ఇలాంటి ప్రాంతీయ ఘర్షణలు ప్రపంచ శాంతిని, స్థిరత్వాన్ని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ●




# ఉగ్ర భావజాల విషకౌగిలిలో యువత

ముద్దం నరసింహ స్వామి

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల వెలుగు చూస్తున్న ఉగ్రవాద మూలాలు అంతర్గత భద్రతకు పొంచి ఉన్న ముప్పును మరోసారి చాటి చెబుతున్నాయి. విజయనగరం నుంచి విజయవాడ వరకు, సికింద్రాబాద్ నుంచి హైదరాబాద్ వరకు విస్తరిస్తున్న ఈ నెట్‌వర్క్ కేవలం భౌతిక దాడులకే పరిమితం కాలేదు. ఇది అంతకంటే ప్రమాదకరమైన 'భావజాల యుద్ధం'గా రూపాంతరం చెందుతోంది. సాంకేతికతను ఆయుధంగా చేసుకుని, సోషల్ మీడియా వేదికగా యువతను తప్పుదోవ పట్టిస్తున్న ఈ పరిణామాలు సమాజానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. విజయవాడలోమహ్మద్ రహ్మాతుల్లా షరీఫ్, మీర్జా సొహైల్ బేగ్, మహ్మద్ డానిష్‌ల అరెస్టు కేవలం ముగ్గురు వ్యక్తుల అరెస్టు మాత్రమే కాదు. ఇది అంతర్జాతీయ హ్యాండ్లర్లతో ముడిపడి ఉన్న ఒక లోతైన కుట్రలో భాగం. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉండటం, విదేశీ నిధులు అందుతుండటం గమనార్హం. ఇక్కడ గమనించాల్సిన మరో కీలక అంశం 'రాడికలైజేషన్'. ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన యువకులను లక్ష్యంగా చేసుకుని, వారిలో మత ఛాందసవాదాన్ని నూరిపోసి, వారిని జిహాద్ వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన సయీదా బేగం అరెస్టుతో ఈ నెట్‌వర్క్‌లో మహిళల ప్రమేయం కూడా వెలుగులోకి వచ్చింది. గతంలో ఉగ్రవాదం అంటే సరిహద్దుల వద్ద చొరబాట్లు, బాంబు పేలుళ్లుగా మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు మన మధ్యేఉంటూ, మన భాషలోనే మాట్లాడుతూ, డిజిటల్ తెరల వెనుక ఉగ్రవాద బీజాలు నాటడం నిఘా వర్గాలకు పెద్ద సవాలుగా మారింది. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితిని గమనిస్తే, ఉగ్రవాదం రూపం మారుస్తోందే తప్ప అంతమవ్వడం లేదు. 2026 గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ ప్రకారం గత ఏడాది 3,000 దాడులు నమోదు కావడం ఆందోళనకరం. అయితే, భారతదేశం విషయంలో ఒక ఆశాజనకమైన మార్పు కనిపిస్తోంది. 2024తో పోలిస్తే ఉగ్రవాద ఘటనలు 43శాతం తగ్గడం మన భద్రతా దళాల అప్రమత్తతకు నిదర్శనం కానీ, ఘటనలు తగ్గడం అంటే ముప్పు తొలిగిపోయినట్లు కాదు. ఉగ్రవాదం ఇప్పుడు 'లోన్ ఉల్ఫ్' (ఒంటరిగా దాడి చేయడం) దాడులకు, ఆన్‌లైన్ ప్రచారానికి ప్రాధాన్యతనిస్తోం ది. క్షేత్రస్థాయిలో దాడులు చేసే సామర్థ్యం తగ్గడంతో, విదేశీ ముష్కర శక్తులు ఇప్పుడు యువత మెదళ్లను కలుషి తం చేయడంపై దృష్టి సారించాయి. నేటిఉగ్రవాదంతుపాకీల కంటే టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను ఎక్కువగా వాడుతోంది. యువతలో అసహనం, నిరుద్యోగం, సామాజిక వివక్ష వంటి అంశాలను ఆసరాగా చేసుకుని వారిని బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. నిధుల బదిలీ కోసం



క్రిప్టో కరెన్సీని, సమాచార మార్పిడికి డార్క్‌వెబ్‌ను వాడుతుండటం వల్ల వీరిని గుర్తించడం కష్టతరమవుతోంది. వైమానిక దళ ఉద్యోగి సమాచారాన్ని లీక్ చేసిన ఉదంతం చూస్తే, సోషల్ మీడియా ద్వారా వ్యక్తులను ఎలా బుట్టలో వేసుకుంటున్నారో అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రహార్ వ్యూహ పత్రం ఈ సమస్యకు సమగ్ర పరిష్కారాన్ని సూచిస్తోంది. కేవలం తుపాకీతో ఉగ్రవాదాన్ని అణచలేమని, దానికి సామాజిక విరుగుడు అవసరమని ఇది స్పష్టం చేస్తోంది. యువతలో విరక్తి కలగకుండా విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. స్థానిక ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థల్లో అనుమానాస్పద కదలికలను గుర్తించడంలో ప్రజలను భాగస్వాములను చేయాలి. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులను, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతను నిఘా వ్యవస్థలు వాడాలి. ముఖ్యంగా, ఈ భావజాల వ్యాప్తిని అడ్డుకోవడంలో మీడియా, విద్యాసంస్థల పాత్ర వెలకట్టలేనిది. వార్తలను కేవలం సంచలనం కోసం కాకుండా, సమాజాన్ని చైతన్యపరిచే దిశగా ప్రసారం చేయాలి. ఉగ్రవాద మూలాలు బయటపడినప్పుడు ఆయా వర్గాలను కించపరచకుండా, తప్పు చేసిన వ్యక్తుల వెనుక ఉన్న కుట్రలను బట్టబయలు చేయాలి. తద్వారా సామాన్యుల్లో అపోహలు తొలగి, వ్యవస్థల పట్ల నమ్మకం పెరుగుతుంది. యువతలో దేశభక్తిని, సహనశీలతను పెంపొందించేలా పాఠ్యాంశాల్లో మార్పులు రావాలి. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్న విద్యార్థి ఏనాటికీ ఇటువంటి మత ఛాందసవాద సిద్ధాంతాలకు బలికాడనే సత్యాన్ని మనం గుర్తించాలి. చివరగా, అంతర్గత భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడూ ఒక 'అదృశ్య సైనికుడిలా' వ్యవహరించాలి. పొరుగున జరుగుతున్న అనుమానాస్పద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా పెను ప్రమాదాలను ముందే నివారించవచ్చు. సాంకేతికత ఇస్తున్న సవాలును అదే సాంకేతికతతో ఎదుర్కొంటూ, పటిష్టమైన నిఘా వ్యవస్థలను నిర్మించుకోవాలి. తెలుగు రాష్ట్రాల ప్రశాంతతను దెబ్బతీయాలని చూస్తున్న ముష్కర శక్తులకు ప్రభుత్వాల దృఢ సంకల్పం, ప్రజల సమైక్యత మాత్రమే సరైన సమాధానం కాగలవు. అప్రమత్తతతో కూడిన ఐకమత్యమే మన దేశ రక్షణకు అసలైన పునాది. ఉగ్రవాదం ఏ మతానికో, వర్గానికో చెందింది కాదు, అది మానవత్వానికిశత్రువు. తల్లిదండ్రులు తమ పిల్లల సోషల్ మీడియా అలవాట్లపై నిఘా ఉంచాలి. విద్యాసంస్థలు కేవలం మార్కుల కోసం కాకుండా, విమర్శనాత్మక ఆలోచనా ధోరణిని పెంపొందించేలా బోధించాలి. భావజాల పరంగా జరుగుతున్న ఈ యుద్ధంలో గెలవాలంటే ప్రభుత్వం, మీడియా, పౌరసమాజం ఏకతాటిపైకి రావాలి. అప్రమత్తతే మన దేశానికి అసలైన కవచం. ●

# ప్రజావాక్కు

### ప్రకటనలు పేపర్లవరకే పరిమితమా!

**మొన్న** ముఖ్యమంత్రి గారు భూములు ఆక్రమిస్తే జైలు తప్పదు అన్నాడు. సంతోషమేకానీఆచరణలో అది కనిపించటం లేదు. దాదాపు 25సంవత్సరాల నుండి రాష్ట్రంలో దొంగబాబాలు చెరువు పోరంబోకు భూములు, అటవీ భూములనుఆక్రమించిఆశ్రమాలపేరుతో మోసం చేస్తుంటే ఏమి చేస్తుంది ప్రభుత్వం? ఒక పేదవాడు నివసించడానికి ప్రభుత్వ స్థలంలో చిన్నగుడిసె వేసుకుంటే మరుక్షణమే కూల్చివేసే అధికారులు దొంగస్వాములపట్ల ఆవిధంగా ఎందుకు ప్రవర్తించరు? జిల్లా అధికారులు దొంగస్వాముల ప్రలోభాలకు, వత్తిళ్లకు లోంగిమెతకవైఖరి అవలంభిస్తుంటే పైఅధికారులుఏమిచేస్తున్నారు? మంత్రులు ఏమిచేస్తున్నారు? ప్రజాప్రతినిధులు ఏమిచేస్తున్నారు? ఈమధ్య ముఖ్యమంత్రిగారు శాసనసభ్యుల పనితీరుపై ఆరాతీస్తున్నారు. ఈశాసనసభ్యులపని తీరుపైకూడా దృష్టిపెట్టండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### వ్యర్థాల నిర్వహణ పెద్ద సవాల్

**ప్రపంచవ్యాప్తంగా** పట్టణీకరణ పెరుగుతున్నకొద్దీ వ్యర్థాల నిర్వహణ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. పునర్వినియోగానికి వీలుకాని వ్యర్థ పదార్థాలను ఉపయోగపడే ఇంధనంగా, ప్రధానంగా వేడి లేదా విద్యుత్తుగా మార్చే ప్రక్రియనే వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి అంటారు. ఇది కేవలం చెత్తను నిర్మూలించడమే కాకుండా, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి ఒక ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి వివిధ పద్ధతులున్నాయి. అంతేకాకుండా చెత్త కుప్పల సమస్య తగ్గడమే జలాలు కలుషితం కావు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రులు - మన బాధ్యత

మన జీవితానికి మొదటి గురువులు తల్లిదండ్రులు. మన కోసం వారు తమ కష్టాలను మరిచి, నిద్రలేని రాత్రులు గడిపారు. ఈరోజు విద్య, ఉద్యోగాల పేరుతో అనేక మంది పిల్లలు ఇతరరాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. అది తప్పుకాదు. కానీ ఆప్రయాణంలో మన జన్మకు కారణమైన తల్లిదండ్రులను విస్మరించడం మాత్రం అన్యాయం. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు డబ్బు కన్నా ఎక్కువగా కావలసింది ప్రేమ, సంరక్షణ, మన ఉనికి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### అసత్య ప్రచారానికి అంతం లేదా?

**ఎందుకనో** ఈ మధ్య కాలంలో కొన్ని వార్త పత్రికలు, టీవీ ఛానళ్ళు, సోషల్ మీడియా సంస్థలు తమ రేటింగ్‌ను పెంచుకోవడమేలక్ష్యంగా తప్పుడు కథనలు ప్రచురిస్తూ, అసత్య ప్రచారానికి కేంద్రబిందువుగా నిలుస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత దురదృష్టకరమైన విషయం. ఎందుకంటే ప్రజలకు మంచి ఏదో, చెడుఏదో తెలియజేసి, ఈ సమాజంలోనిత్యంజరిగే పలుఅవినీతి బాగోతాలను, ఆరాచకాలను, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకుచేరవేసి వారిని చైతన్య పరచాల్సినకొన్నివార్తపత్రికలు, టీవీఛానళ్ళు, మీడియా సంస్థలు వక్ర మార్గానపయనం సాగిస్తూవున్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చూపడమే కాదు ఒక్కొక్కసారి బతికున్న మనుషులను కూడా చనిపోయినట్లుగా చూపే అబద్ధపు, దగా కోరు ప్రచారానికి నడుం బిగిస్తుండటం ఈదేశ ప్రజానీకాన్ని తీవ్ర గందరగోళానికి గురిచేయడమే కాదు వారిని అశాంతి పూరితమైన వాతావరణానికి తీసుకెళ్లే చర్యలకు తెగబడుతున్నారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### ప్రజల సమస్యలు పట్టించుకోండి

**రాజకీయ** నాయకులకు ఓమంచిగుణం ఉంది. ఏది అడిగినానో అని చెప్పరు. కానీ ఆ అడిగినదాన్ని జన్మలో చేయరు. ఇది పెద్ద చెత్తప్రవృత్తి. గతదశాబ్దంపైగా ఇ.పి.ఎస్. ఫించను దారులకు వెయ్యి రూపాయల నుంచి కనీసం 7500కు పెంచమని అర్థిస్తున్నా ప్రభుత్వం అయ్యో అలాగా తప్పక చూస్తామని అంటున్నారు. బడ్జెట్‌కు ముందుగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌గారికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీగారికి మెయిల్స్, లేఖలు అనేకం పంపినా, ప్రభుత్వంలో చలనం శూన్యం. ఇంకెవరి కాళ్ళు, చేతులు పట్టుకోవాలి? వయసుడిగి ఇప్పటికే లక్షల మంది ఈ భూమిని వదలిపోయారు.

- ఆర్.మూర్తి, సికింద్రాబాద్

### దోమల బెడదను నివారించాలి

**రాష్ట్రంలో** దోమలు అధికంగా విహరిస్తూ ఉన్నాయి. దీంతో ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం వేళ బయట వాకింగ్ చేస్తున్న పెద్దలు, బయట ఆడుతున్న పిల్లలు విపరీతమైన దోమలతో ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వంచర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలి. వేసవి కాలం వేడి నుండి ఉపశమనానికై ఆరు బయటకు వస్తారు కావునా దోమల భారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## హెచ్-1బిలో కొత్త నిబంధనలు..
# కనీస వేతనం 14 వేల డాలర్ల పెంపునకు యుఎస్ యోచన




**వాషింగ్టన్, మార్చి 27:** టెక్ కంపెనీల్లో విదేశీయులను తగ్గించి అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అగ్రరాజ్యం మరో కీలక చర్యకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే హెచ్-1బి వీసాదారుల వేతనాలను పెంచేలా అమెరికా కార్మిక శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. ఇవి అమలులోకి వస్తే విదేశీ ఉద్యోగుల వార్షిక వేతనం 14 వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. అమెరికన్లతో పోలిస్తే విదేశీ ఉద్యోగులకు వేతనం విషయంలో భారీ వ్యత్యాసం ఉంటోందని, దీనివల్ల చౌకగా లభించే ఉద్యోగులకు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయని సుదీర్ఘంగా ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్య అధికారులు తాజా ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ప్రస్తుతం అమెరికాలో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే హెచ్-1బి వీసాదారులు సగటున 10,191 డాలర్లు తక్కువగా వార్షిక వేతనం అందుకుంటున్నారు. కంప్యూటర్ ఆధారిత వృత్తుల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటోంది. వాస్తవానికి ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం హెచ్-1బి వీసా ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చారు. కానీ, అందుకు భిన్నంగా కొన్ని కంపెనీలు ఈ వీసాను దుర్వినియోగం చేసి తక్కువ వేతనం తీసుకునే ఉద్యోగులను విదేశాల నుంచి నియమించుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన హెచ్-1బిల్లో 63 శాతం ఎంట్రీ లెవల్ ఉద్యోగస్థులే ఉన్నట్లు కార్మిక శాఖ గణాంకాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే వేతన పెంపు ప్రతిపాదనలు చేసినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. అధ్యక్షుడి సంతకం తర్వాత ఈ ప్రతిపాదనలు అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. కార్మిక శాఖ ప్రతిపాదనల ప్రకారం.. నాలుగంచెల వేతన వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు కనీస వేతనం 34 శాతం, లెవల్ 2 వారికి 52 శాతం, లెవల్ 3 ఉద్యోగులకు 70 శాతం, లెవల్ 4 ఉద్యోగులకు 88 శాతం మేర పెంచాలని అగ్రరాజ్యం భావిస్తోంది. ఈ ప్రతిపాదనలతో హెచ్-1బి వీసాదారుల సగటు వార్షిక వేతనం 14 వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. దీంతో విదేశీ ఉద్యోగులను నియించే కంపెనీలు యేటా 6.56 బిలియన్ డాలర్ల వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది.



# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

### వినియోగదారులకు కాదు, కంపెనీలకే: కేంద్రం స్పష్టీకరణ
### ఇంధన ఎగుమతులపై కేంద్రం పన్ను విధింపు: కేంద్ర మంత్రులు హార్దీప్ సింగ్ పూరి, నిర్మలా సీతారామన్
### ఎటువంటి ఉపయోగంలేదు: కాంగ్రెస్ పెదవి విరుపు

**న్యూఢిల్లీ, మార్చి 27:** పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీని రూ.10 చొప్పున తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పెట్రోల్‌పై గతంలో రూ.13 ఉన్న ఎక్సైజ్ డ్యూటీ రూ.3కు చేరింది. డీజిల్‌పై రూ.10 ఉంటే, ఇప్పుడు సున్నాకు తగ్గించినట్లు వెల్లడించింది. అయితే, ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు చేరదని, రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న భారీ నష్టాలను భర్తీ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సామాన్యుల కోసమే: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గత నెల రోజుల్లోనే అంతర్జాతీయంగా ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు (దాదాపు 75 శాతం పెరుగుదల) పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇంధన ధరలు 20 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగినా, భారత్‌లో మాత్రం ధరలను స్థిరంగా ఉంచామని పేర్కొంది. సామాన్య పౌరులను కాపాడేందుకే ప్రధాని మోడీ ప్రభుత్వ ఆదాయాన్ని వదులుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరి అన్నారు. ఇదే సమయంలో, డీజెల్ ఎగుమతులపై ప్రభుత్వం కొత్తగా సుంకాన్ని విధించింది. డీజెల్‌పై లీటర్‌కు రూ.21.5, విమాన ఇంధనం ఎటిఎఫ్‌పై లీటర్‌కు రూ.29.5కు ట్యాక్స్ పెరిగింది. అంతర్జాతీయంగా ధరలు పెరిగిన నేపథ్యంలో, ఎగుమతులను నిరుత్సాహపరిచి, దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రపంచ ఇంధన పరిస్థితిని నిశితంగా గమనిస్తూ, వినియోగదారులకు సరఫరా, ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది. అందుకే ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం: ధరల పెరుగుదల నుంచి వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే డీజెల్ ఎగుమతులపై లీటర్‌కు రూ.21.5, జెట్ ఫ్యూయల్ ఎగుమతులపై లీటర్‌కు రూ.29.5 చొప్పున సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. దీని వల్ల చమురు కంపెనీలు తమ ఉత్పత్తిని అంతర్జాతీయ మార్కెట్‌కు అమ్ముకోకుండా దేశీయ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తాయని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పెదవి విరుపు: చమురు సంస్థల నష్టాలను మాత్రమే ప్రభుత్వం చూస్తోంది తప్ప, సామాన్య ప్రజలు పడే ఇబ్బందులను మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ మండిపడింది.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు పవన్ ఖేరా, మాణిక్కం ఠాగూర్ వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ, పెట్రోల్, డీజెల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వం చర్య సంక్షోభ సమయంలోనూ చమురు సంస్థలకు లాభాలు చేకూర్చేలా చర్యలు చేపట్టిందని దుయ్యబట్టారు.

ఆ ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు కల్గిస్తే, సామాన్యులకు కొంతలో కొంత ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు.

## ప్రజాదరణలో ప్రధాని మోడీ
# ప్రపంచంలోనే టాప్



### 68 శాతం ఆమోద రేటింగ్
### ట్రంప్‌కు 39 శాతం మాత్రమే

**న్యూఢిల్లీ, మార్చి 27:** ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి రికార్డులకెక్కారు. విశ్వ గురువుగా పేరు నరేంద్రమోడీ రికార్డు సాధించారు. అమెరికన్ డేటా అనలిటిక్స్ సంస్థ మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం, ప్రధానమంత్రి మోడీ 68 శాతం అద్భుతమైన ఆమోద రేటింగ్ ను పొందారు. ఈ అఖండ మద్దతుతో ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నాయకులను అధిగమించి ప్రపంచ నాయకుల జాబితాలో అగ్రస్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. వరుసగా మూడోసారి అధికారంలో ఉన్నప్పటికీ ఈ అప్రూవల్ రేటింగ్ వెనక్కి తగ్గలేదు. ఇది బలమైన నాయకత్వం, ప్రపంచవ్యాప్తంగా ఆయనకున్న విస్తృత ఆమోదాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. సర్వే డేటా ప్రకారం కేవలం 26 శాతం మంది మాత్రమే మోడీకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, 6 శాతం మందికి ఎటువంటి అభిప్రాయాన్ని తెలుపలేదు. మార్చి 2 నుంచి 8 మధ్య మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన ఈ సర్వే, ఇతర ప్రపంచ నాయకుల స్థానాన్ని సైతం వెల్లడించింది. స్విట్జర్లాండ్‌కు చెందిన గై పార్మెలిన్, దక్షిణ కొరియాకు చెందిన లీ జేమ్యుంగ్ చెరో 62 శాతం ఆమోద రేటింగ్‌లతో రెండవ స్థానంలో నిలిచారు. వారి తర్వాత చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఆండ్రెజ్ బాబిస్ 57 శాతం మద్దతుతో, అర్జెంటీనాకు చెందిన జేవియర్ మెల్లి 56 శాతం మద్దతుతో నిలిచారు. అలాగే జపాన్‌కు చెందిన సనాయ్ టకైచి, కెనడాకు చెందిన మార్క్ కార్నీ చెరో 56 శాతం ఆమోద రేటింగ్‌లను పొందారు. మరోవైపు, పాశ్చాత్య దేశాలలోని అనేక ప్రముఖ నాయకులు చాలా బలహీనమైన స్థితిలో ఉన్నారని ఈ సర్వే చూపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ జాబితాలోని టాప్ 10లో కూడా చోటు సంపాదించలేకపోయారు. ట్రంప్‌కు కేవలం 39 శాతం ఆమోదం లభించగా, 55 శాతం మంది ఆయనను వ్యతిరేకించారు. అదే సమయంలో బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌కు కేవలం 24 శాతం మద్దతు లభించగా, జర్మనీకి చెందిన ఫ్రెడ్రిక్ మెర్జ్‌కు 20 శాతం మద్దతు లభించింది. ఈ జాబితాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అత్యంత పేలవమైన ప్రదర్శన కనబరిచారు. ఆయనకు కేవలం 17 శాతం ఆమోదం, 75 శాతం వ్యతిరేకత నమోదైంది. పూర్తి లిస్ట్ ఈ కింద ఇవ్వబడింది.

# వాణిజ్య సిలిండర్లు 70శాతం పెంపు

### - గ్యాస్ సరఫరాపై కేంద్రం శుభవార్త - విదేశాల నుంచి గ్యాస్ నౌకలు రాక - ఇంధన కొరత నుంచి కాస్త ఉపశమనం



**న్యూఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దిగుమతులకు అంతరాయం కలగడంతో ఏర్పడిన గ్యాస్ కొరత నేపథ్యంలో, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు కేంద్రం ఉపశమనం కల్పించింది. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల కేటాయింపును అవసరమైన డిమాండ్‌లో ఇంతకుముందున్న 50శాతం నుంచి 70శాతానికి పెంచుతూ కేంద్రం ఉత్తర్వులిచ్చింది. ఉక్కు, ఆటోమొబైల్స్, వస్త్రాలు, రంగులు, రసాయనాలు, ప్లాస్టిక్స్ వంటి కార్మిక ఆధారిత రంగాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది, ఎందుకంటే అవి ఇతర అవసరమైన పరిశ్రమలకు కూడా మద్దతు ఇస్తాయి. ఈ రంగాలలో, ప్రాసెస్ పరిశ్రమలకు లేదా సహజ వాయువుతో ప్రత్యామ్నాయం లేని ప్రత్యేక తాపన ప్రయోజనాల కోసం ఎల్‌పిజి అవసరమయ్యే వాటికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రస్తుతం చేస్తున్న 50 శాతం కేటాయింపునకు అదనంగా, మరో 20 శాతాన్ని ప్రతిపాదించినట్లు, దీనితో మొత్తం వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపు సంక్షోభానికి ముందున్న ప్యాక్డ్ నాన్‌డొమెస్టిక్ ఎల్‌పిజి స్థాయిలో 70 శాతానికి చేరుకుంటుందని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొంది. అయితే, అదనపు 20 శాతం కేటాయింపును పొందాలంటే, వాణిజ్య, పారిశ్రామిక ఎల్‌పిజి వినియోగదారు లందరూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలలో నమోదు చేసుకోవాలని, అలాగే తమ నగరాల్లోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఎంటిటీ వద్ద పిఎన్‌జి కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ లేఖలు రాసింది. "పరిశ్రమలలో (ఉక్కు, ఆటోమొబైల్, వస్త్ర, రంగుల, రసాయనాలు, ప్లాస్టిక్‌లు), ప్రక్రియలో సహజ వాయువుతో ప్రత్యామ్నాయం చేయలేని ప్రత్యేక ప్రయోజనాల కోసం ఎల్‌పిజిని ఉపయోగిస్తే, అటువంటి అవసరం నుండి మినహాయింపు ఉంటుంది," అని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇప్పటికే వినియో గించుకోని పక్షంలో, 10 శాతం సంస్కరణల ఆధారిత కేటాయింపును వెంటనే వినియోగించుకోవాలని ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కోరింది. "దీనితో, వాణిజ్య/ పారిశ్రామిక ఎల్‌పిజి కేటాయింపు 70 శాతానికి (10 శాతం సంస్కరణల ఆధారిత కేటాయింపుతో) పెరుగుతుంది. రాష్ట్రంలోని పారిశ్రామిక కార్యకలాపాలకు ఉపశమనం కలిగిస్తుంది," అని ఉత్తర్వు వివరిస్తుంది. మార్చి 21న జారీ చేసిన మునుపటి అదనపు 20 శాతం కేటాయింపులో, రెస్టారెంట్లు, ధాబాలు, హోటళ్లు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఆహార ప్రాసెసింగ్/ పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలచే నడపబడే రాయితీ క్యాంటీన్లు/ అవుట్‌లెట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, అలాగే వలస కార్మికుల కోసం 5 కేజీల (ఫ్రీ ట్రేడ్ ఎల్‌పిజి) ఎఫ్‌టిఎల్ వంటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా సమాచారం ప్రకారం, మార్చి 25 నాటికి, 37,000కు పైగా 5 కేజీల ఎఫ్‌టిఎల్ సిలిండర్లను వలస కార్మికులకు విక్రయించారు. ఈ ఎల్‌పిజి సిలిండర్లను రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారులు, ప్రాధాన్యతా రంగాలు లేదా వినియోగదారులను బట్టి వారి అంచనా ఆధారంగా పంపిణీ చేస్తారు. ఇదిలా ఉండగా, ఎల్‌పిజిని తీసుకువెళ్లే మరిన్ని భారతీయ నౌకలను హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించడానికి అనుమతిస్తామని ఇరాన్ సూచించింది. ఈ విషయంపై భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో చర్చలు జరిపిందిజ

# ట్రంప్ సంతకంతో డాలర్ కరెన్సీ నోట్లు!

### అమెరికా కరెన్సీ చరిత్రలోనే తొలిసారి అధ్యక్షుడి సంతకం

**వాషింగ్టన్, మార్చి 27:** అమెరికా చరిత్రలో మునుపెన్నడూ లేని రికార్డుకు అధ్యక్షుడు ట్రంప్ బీజం వేస్తున్నారు. ట్రంప్ సంతకం ఉన్న డాలర్ నోట్లను విడుదల చేస్తామని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ తెలిపారు. అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న వ్యక్తి సంతకంతో కరెన్సీ నోట్లను ముద్రించడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. కొత్తగా ముంద్రించే అమెరికా కరెన్సీ నోట్లపై ట్రంప్ సంతకంతోపాటు ఆ దేశ ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ సంతకం కూడా ఉండనుంది. ఈ మార్పులతో వచ్చే జూన్‌లో మొదటగా 100 డాలర్ల నోటును విడుదల చేయనున్నట్టు బెసెంట్ తెలిపారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ట్రంప్ సంతకంతో డాలర్ నోట్లను విడుదల చేస్తాం. ఈ ఏడాది అమెరికా జరుపుకోనున్న 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ చరిత్రాత్మక విజయాలను స్మరించుకునేందుకు ఇదో అద్భుత మార్గం అని బెసెంట్ చెప్పారు. అమెరికా ట్రెజరర్ బ్రాండెన్ బీచ్ కూడా ఈ కొత్త విధానానికి మద్దతు పలికారు. ట్రంప్ ఈ గౌరవానికి పూర్తిగా అర్హులని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా ట్రెజరర్, ట్రెజరీ సెక్రెటరీల సంతకాలతో కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నారు. 1861 నుంచి ఈ విధానం కొనసాగుతోంది. ఇక ఈ ఏడాది జూలై 4న అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ట్రంప్ చిత్రం ఉన్న 24 క్యారెట్ల బంగారు నాణేన్ని కూడా విడుదల చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు గత నెలలోనే ఫెడరల్ ఆర్ట్స్ కమిషన్ ఆమోదం తెలిపింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ మిసైల్ మ్యాన్ హాసన్ తెహ్రానీ మొఘద్దం!



**టెహ్రాన్, మార్చి 27:** శక్తివంతమైన అమెరికాతో గత నాలుగు వారాలుగా ఇరాన్ సాగిస్తున్న పోరు ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తోంది. తాము యుద్ధాన్ని ప్రారంభించలేదని, కానీ ఆపే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెబుతోంది. అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో విరుచుకుపడుతున్నాయి. అసలు అంతర్జాతీయ ఆంక్షలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇరాన్ ఇంతటి క్షిపణి వ్యవస్థను ఎలా నిర్మించగలిగిందనేది ఆసక్తిగా మారింది. ఇరాన్ క్షిపణి పితామహుడు హాసన్ తెహ్రానీ మొఘద్దం భారతదేశానికి అబ్దుల్ కలాం ఎలాగో, ఇరాన్‌కు హాసన్ తెహ్రానీ మొఘద్దం అలా కొనసాగాడు. ఆయన్ను ఇరాన్ ప్రజలు ‘మిస్సైల్ మ్యాన్ అని పిలుస్తారు. 1959లో జన్మించిన మొఘద్దం, 20 ఏళ్ల వయసులో ఇరాన్ ఇస్లామిక్ విప్లవం తర్వాత రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లో చేరారు. 1980లో ఇరాక్ దాడులు చేసినప్పుడు ఇరాన్ వద్ద సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులు లేవు. ఆ లోటును భర్తీ చేయడమే లక్ష్యంగా మొఘద్దం తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ ఆంక్షల వల్ల బయట దేశాల నుంచి టెక్నాలజీ రావడం కష్టమని గ్రహించిన మొఘద్దం, స్వదేశీ మంత్రాన్ని జపించారు. స్థానిక ఇంజినీర్లు, శాస్త్రవేత్తలతో ఒక బలమైన బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇరాన్ రక్షణ కవచంగా మారిన షాహాబ్ క్షిపణి శ్రేణిని ఆయన నాయకత్వంలోనే అభివృద్ధి చేశారు. సాధారణంగా ఇరాన్ వద్ద 2వేల కి.మీ పరిధి గల క్షిపణులు ఉన్నాయని ప్రపంచం భావిస్తుంది.

# నేపాల్ ప్రధానిగా బాలేన్‌షా ప్రమాణం



**ఖాట్మండు, మార్చి 27:** నేపాల్ నూతన ప్రధానిగా రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పీ) పార్లమెంటరీ పార్టీ నేత బాలెన్ షా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 76(1) ప్రకారం బాలెన్ షాను ఆ పదవిలో నియమించినట్లు నేపాల్ అధ్యక్షుడు రామ్ చంద్ర పొడెల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పీ దాదాపు మూడింట రెండొంతుల మెజారిటీతో ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. పార్లమెంటరీ పార్టీ సమావేశంలో బాలెన్ షాను తమ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆర్‌ఎస్‌పీ ఎన్నుకుంది. దీంతో ఆయన దేశ 47వ ప్రధాని అయ్యేందుకు మార్గం సుగమమైంది. కేవలం 35 ఏళ్ల వయసున్న బాలెన్, నేపాల్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కులైన ప్రధానులలో ఒకరిగా నిలిచారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అధిక శాతం చట్టసభ సభ్యులు యువతరం వారే కావడం నేపాల్ రాజకీయాల్లో తరాల మార్పునకు సంకేతంగా నిలుస్తోంది. గత ఏడాది డిసెంబర్ 28న జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించిన బాలెన్, యువతలో విపరీతమైన ఆదరణ పొందారు. మార్చి 5న జరిగిన ఎన్నికల్లో, ఆర్‌ఎస్‌పీ ఆయనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి ప్రచారం చేయగా, 275 స్థానాలున్న ప్రతినిధుల సభలో 182 సీట్లు గెలుచుకుని సంచలనం సృష్టించింది. తూర్పు నేపాల్‌లోని ఝాపా5 నియోజకవర్గంలో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీపై బాలెన్ షా భారీ మెజారిటీతో గెలు పొందారు. ఓలీకి 18, 734 ఓట్లు రాగా, షాకు 68, 348 ఓట్లు లభించాయి. 1991 తర్వాత నేపాల్ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో ఒక అభ్యర్థికి లభించిన అత్యధిక ఓట్లు ఇవే కావడం విశేషం. బాలెన్ షా 2022లో ఖాట్మండు మేయర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1990 ఏప్రిల్ 27న ఖాట్మండులో జన్మించిన ఆయన, భారత్‌లోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. తన హుషారైన ర్యాప్ గీతాలతో యువతలో పాప్యులారిటీ సంపాదించుకున్నారు. ప్రధానిమోడీ అభినందనలు.. నేపాల్ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ ర్యాప్ గాయకుడు బాలెన్ షాకు (బాలేంద్ర షా) భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల మధ్య స్నేహబంధాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఆయనతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. నేపాల్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన బాలెన్ షాకు హృదయపూర్వక అభినందనలు. మీ నాయకత్వంపై నేపాల్ ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ నియామకం నిదర్శనం. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం భారత్, నేపాల్ స్నేహాన్ని, మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఎదురుచూస్తున్నానని మోదీ పేర్కొన్నారు.

## ఇరాన్‌లో 1,900 దాటిన మృతులు

**టెహ్రాన్, మార్చి 27:** పశ్చిమసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఇప్పటివరకు 1,900 మందికిపైగా ప్రజలు మరణించినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 1,100 మందికిపైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్-అమెరికా దాడులను ఖండిస్తూ.. టెహ్రాన్‌కు సంఘీభావం తెలిపిన దేశాలకు ఇరాన్ వినూత్నంగా కృతజ్ఞతలు చెప్పింది. క్షిపణిపై ‘భారత ప్రజలకు కృతజ్ఞతలు’ అనే సందేశాన్ని రాసి ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. స్పెయిన్, జర్మనీ వంటి ఇతర దేశాలకు కూడా టెహ్రాన్ కృతజ్ఞతలు చెప్పింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు: ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని.. దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణుల దాడుల చేసినట్లు ఐఆర్‌జిసి వెల్లడించింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది. యుద్ధం మొదటి రోజు మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి అమెరికా ప్రణాళిక ప్రకారమే చేసిందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆరోపించారు. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలికి పంపిన విడియో ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనలో 160 మందికిపైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.




## సోషల్ మీడియాలో కెవైసి తప్పనిసరి చేస్తున్న కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి 27:** ఆన్‌లైన్ హాని నుంచి మహిళలు, పిల్లల్ని రక్షించే ఉద్దేశంతో, సోషల్ మీడియాకు కేవైసీ తప్పనిసరి చేయాలని కేంద్రం యోచనచేస్తోంది. మైనర్లపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ ఉన్నందున బానిసలుగా మారుతున్నవారు ఎక్కువ ఉన్నారు. అందుకే భారతదేశంలోని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వినియోగదారులకు నో యువర్ కస్టమర్ ధృవీకరణను తప్పనిసరి చేయాలని ఒక పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు చేసింది. సైబర్ భద్రతపై మహిళా సాధికారత పార్లమెంటరీ కమిటీ నివేదికలో భాగంగా హోం మంత్రిత్వ శాఖ, సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖలకు ఈ ప్రతిపాదనల్ని సమర్పించింది. సోషల్ మీడియా, డేటింగ్ యాప్, గేమింగ్ ప్లాట్‌ఫారమ్స్ లలో కేవైసీ ఆధారిత గుర్తింపు, వయసు ధ్రువీకరణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. వినియోగదారుల్ని గుర్తింపు వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. వినియోగదారులను గుర్తించగలగడం,మైనర్లను ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉంచడం ద్వారా దుర్వినియోగాన్ని అరికట్టడమే దీని లక్ష్యం. కేవైసీ తప్పనిసరి చేయడం వల్ల నకిలీ ప్రొఫైల్స్, వేధింపులు, సైబర్ స్టాకింగ్ ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. డేటింగ్, గేమింగ్ యాప్‌ల కోసం కఠినమైన లైసెన్సింగ్ నిబంధనల్ని, వయసు నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని ప్యానెల్ సూచించింది. నిబంధనలు పాటించని ప్లాట్‌ఫారమ్స్‌పై చర్యలు, భారీగా జరిమానా విధించాలని ప్రతిపాదించింది. ఈ సిఫారసుల ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే యూజర్స్ డేటా, గోప్యతను దెబ్బతీసే అవకాశం ఉందనే ఆందోళనలు ఉన్నాయి.

# నాడు కెబిసిలో రూ.50 లక్షల విజేత

### రూ.2.5కోట్ల కుంభకోణంలో అరెస్టు అయిన తహసీల్దార్!



**భోపాల్, మార్చి 27:** కౌన్‌బనేగా కరోడ్‌పతిలో రూ.50 లక్షలు గెలుచుకున్న మధ్యప్రదేశ్ మహిళా తహసీల్దార్ రూ.2.5 కోట్ల వరద సహాయ నిధుల స్కామ్‌లో అరెస్ట్ అయ్యింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. 2021లో షియోపూర్ జిల్లాలోని బరోడా తహసీల్దార్‌గా అమితా సింగ్ తోమర్ పని చేశారు. ఈ సమయంలో కొంత మంది రెవెన్యూ అధికారులతో కలిసి భారీ స్కామ్‌కు ఆమెకు పాల్పడింది. సుమారు రూ.2.5 కోట్ల వరద సహాయ నిధులను నకిలీ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసి కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారుల ఫిర్యాదుతో బరోడా సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీవోపీ) అవనీత్ శర్మ నేతృత్వంలోని బృందం ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసింది. ప్రస్తుతం విజయపూర్ తహసీల్దార్‌గా ఉన్న అమితా సింగ్ తోమర్, 22 మంది రెవెన్యూ అధికారులతో సహా మొత్తం 110 మందిపై కేసు నమోదు చేశారు. మరోవైపు కేసు నమోదు నేపథ్యంలో అమితా సింగ్ తోమర్ గత కొన్ని రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆమె పిటిషన్లను న్యాయస్థానాలు తిరస్కరించాయి. బుధవారం ఆమెపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. తహసీల్దార్ పదవి నుంచి తొలగించారు. అదృశ్యమైన అమితా సింగ్ కోసం పోలీస్ బృందాలు గాలింపు ముమ్మరంచేసాయి. మొబైల్ సిగ్నల్స్ ద్వారా గ్వాలియర్‌లోని నివాసంలో ఆమె ఉన్నట్లు తెలుసుకుని గురువారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచిన తర్వాత పొరుగున ఉన్న శివపురి జైలుకు అమితా సింగ్‌ను తరలించినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# అమెరికా సైనికులకు ఆశ్రయం ఇస్తున్న హోటళ్లపైనా దాడులుచేస్తాం

### హెచ్చరికలు జారీ చేసిన ఇరాన్

**టెహ్రాన్, మార్చి 27:** అమెరికా యుద్ధానికి విరామం ఇస్తున్నట్లు ప్రకటించి, ఇరాన్ మాత్రం తగ్గడం లేదు. పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ గట్టి అల్టిమేటం ఇచ్చింది. అమెరికా సైనికులు బస చేస్తున్న హోటళ్లను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు చేస్తామని హెచ్చరించింది. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న యూఎస్ సైనికులు తమ స్థావరాలను వదిలేసి హోటళ్లలో ఆశ్రయం తీసుకుంటున్నారని, అమెరికన్లకు ఆశ్రయం ఇచ్చే హోటళ్లను అమెరికా ఆస్తులుగానే పరిగణిస్తామని హెచ్చరించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, గల్ఫ్ దేశాల ప్రజలను అమెరికా సైనికులు మానవ కవచాలుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. యూఎస్ సైనికులకు బుకింగ్స్ ఇవ్వొద్దని యూఏఈ, బహ్రెయిన్ హోటళ్లకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. మేం చేతులు కట్టుకుని కూర్చోలేమని ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి అబోల్ఫజల్ షెకార్చి అన్నారు. మేం ఊరికే కూర్చుని, అమెరికన్లు మాపై దాడి చేయడానికి అనుమతించాలా అని ప్రశ్నించారు. అమెరికా దళాలు ఉన్న హోటళ్లను, కార్యాలయాలను టార్గెట్ చేస్తామని స్పష్టం చేశారు. సిరియా, లెబనాన్, డిజిబౌటీ దేశాలకు కూడా ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది.

# కమనీయం.. లోకాభిరాముని కల్యాణం

## వేములవాడ రాజన్న సన్నిధిలో వైభవంగా నిర్వహణ

### స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించిన

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కుమార్



**వేములవాడ, ప్రభాతవార్త:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతారామ కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ సీతారామ చంద్ర స్వామి రామాలయం నందు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణలోని శివార్చన వేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూల మండపంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీ రామనవమి సందర్భంగా ఆలయంలో శ్రీ స్వామివారికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి పంచ ఉపనిషత్తుల ద్వారా రుద్రాభిషేకం గావించారు. ఉదయం 9:35 నిమిషాలకు ప్రారంభమైన కళ్యాణ వేడుకలు మధ్యాహ్నం 1గంట వరకు జరిగాయి. ఉదయం 11గంటల 55 నిమిషాలకు అభిజిత్ లగ్నం సుముహూర్తమున శ్రీ స్వామివారి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ తరుపున చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ శేఖర్, కమిషనర్ సంపత్ కుమార్, బిజెపి తరుపున కేంద్ర మంత్రి బండి సంజయ్ పంపించిన పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణం అనంతరం అర్చకులు పూర్ణాహుతి చేశారు. సాయంత్రం అంతరాలయంలో డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమైన శ్రీ రామనవమి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. హరిహర క్షేత్రంగా భాస్కర క్షేత్రంగా పిలువబడుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివుడికి, రామునికి సమానంగా పూజలు నిర్వహించడం అనాదిగా ఆనవాయితీగా వస్తోంది. ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు లక్షలాది భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. వేములవాడ రాజన్న సన్నిధిలో మహాశివరాత్రి జాతర తర్వాత అతి పెద్ద జాతరగా శ్రీ రామనవమి ఉత్సవాలు జరుగుతాయి. కన్యా దాతలుగా విజయ్ దంపతులు వ్యవహరించారు. స్వామివారి కళ్యాణ తంతు జరిగి అక్షింతలు పడగానే వెంటనే జోగినులు శివ పార్వతులు ఒకరికొకరు తలపై తలంబ్రాలు పోసుకొని శివున్ని పెళ్లి చేసుకున్నట్లుగా భావిస్తారు. జోగినులు పార్వతులు భక్తులతో ఆలయ ప్రాంగణాలన్ని కిక్కిరిసిపోయాయి. స్వామివారి కళ్యాణానికి పట్టణ ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని సదుపాయాలు కల్పించడంతో కళ్యాణం సాఫీగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ శేఖర్ కుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు, ఆలయ ఈవో రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి మెడికల్‌లో కుంభకోణం

## ఎసిబి విచారణకు సర్కారు ఆదేశం

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** సింగరేణికి చెందిన మెడికల్ బోర్డు వ్యవహారంలో కుంభకోణం జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై రాష్ట్ర సర్కారు ఏసీబీ విచారణకు ఆదేశించడం కార్మికుల్లో తీవ్ర కలకలం రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో మెడికల్ అన్‌ఫిట్ దందాకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో వాటిపై లోతుగా విచారణ జరిపేందుకు సిద్ధపడటం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా సింగరేణిలో ప్రతి రెండు నెలలకోసారి మెడికల్ బోర్డు నిర్వహించడం ద్వారా కార్మికుల ఆరోగ్య స్థితిగతులను సంస్థ పరీక్షి ంచేది. పరీక్షల్లో తీవ్రంగా అనారోగ్యం పాలై, విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న కార్మికులను అన్‌ఫిట్ చేయడం ద్వారా డ్యూటీలో నుంచి తొలగించేంది. అంతేకాకుండా సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల కోటాలో అన్‌ఫిట్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేది. దీన్ని ఆసరాగా తీసుకున్న పలువురు మధ్య దళారులు కార్మికులకు ఎలాంటి అనారోగ్యం లేకపోయినా తమ పలుకుబడి ఉపయోగించి, మెడికల్ బోర్డు నుండి నకిలీ ధృవీ కరణ పత్రం పొందేవారు. అలా నిబంధనలకు విరుద్ధంగా అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు అక్ర మంగా ఉద్యోగాలు లభించేవి. ఈ అవినీతి, అక్రమాలు ప్రభుత్వం దృష్టికి రావడంతో దాన్ని వెలికి తీసేందుకు ఏసీబీ అధికారులకు విచారణా ధికారం అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సింగరేణి వ్యాప్తంగా 2014 నుంచి 2025 వరకు జరిగిన మెడికల్ బోర్డుపై పూర్తి విచారణ జరపాలని ఏసీబీని ఆదేశించింది. ఇక గత సంవత్సరం మెడికల్ బోర్డులో నెలకొన్న అవినీతి కారణంగా ఏసీబీ అధికారులు సంస్థ ప్రధాన కార్యాలయంలో పలువురు ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణ నిలిచిపోయాయి.

# వరంగల్ నిట్ మాజీ ప్రొఫెసర్‌కు సైబర్ నేరగాళ్ల టోకరా

## స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పేరిట కోటి రూపాయలు కొట్టేసిన కేటుగాళ్లు

**హన్మకొండ బ్యూరో, మార్చి 27, ప్రభాతవార్త:** వరంగల్ నిట్ మాజీ ప్రొఫెసర్ సుధాకర్ కు సైబర్ నేరగాళ్ల టోకరా కొట్టి కోటి కాజేసిన సంఘటన హనుమకొండ జిల్లాలో చర్చనీయాంశమైంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పేరుతో కోటి రూపాయలు కొట్టేసిన కేటుగాళ్ల నిజస్వరూపం గ్రహించే వరకు కోటి స్వాహా అయ్యింది. ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ కోసం డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. బు ల్లైన్ ట్రేడ్. కామ్..సైట్ ను సెర్చ్ చేసి సుధాకర్ నేరగాళ్లతో పరిచయం అయ్యింది. ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ లింక్ క్లిక్ చేసి వాట్సాప్ నెంబర్ ను సైబర్ నేరగాళ్లు కు ఇచ్చాడు. హెచ్..18 వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసి పూర్తిగా నేరగాళ్లు నమ్మించారు. కంపెనీ అకౌంట్స్ మేనేజర్ గా పరిచయం చేసుకున్న కిరణ్ అనే వ్యక్తిని నమ్మి ఒకకోటి ఒక వెయ్యి రూపాయలు సుధాకర్ ట్రాన్స్ఫర్ చేసినాడు. జనవరి నుండి ఇప్పటివరకు విడతల వారీగా నేరగాళ్ల ఖాతాలకు డబ్బులు పంపిడం జరిగింది. చివరకు మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ వింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 31న రామన్నపేటలో మహిళా రైతు రాష్ట్ర సదస్సు

## పోస్టర్‌ను ఆవిష్కరించిన రైతు సంఘం నేతలు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** ఈనెల 31న యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో మహిళా రైతుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ రైతు సంఘం నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కార్యదర్శి టి సాగర్, కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు వివిధ జిల్లాల నుండి మహిళా రైతులు హాజరౌతున్నారని తెలిపారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతున్నకొద్దీ పురుషుల సంఖ్య తగ్గి మహిళల సంఖ్య పెరుగుతుందని, వ్యవసాయాన్ని మహిళలే కొనసాగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. కౌలు రైతులలో కూడా మహిళలు గణనీయంగా ఉన్నారని, వారికి పెట్టుబడి కోసం జాయింట్ లయబుల్ గ్రూపులను ఏర్పాటు చేసి వాటి ద్వారా రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మరో వైపు వ్యవసాయ అనుబంధ రంగాలలో కూడా మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, పాలు, పండ్లు, కూరగాయలు, చేపల పెంపకం, కోళ్ల పెంప కంలో వారి పాత్ర కీలకంగా మారిందన్నారు. మహిళలను ప్రోత్సా హిం చేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పి జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పాల్గొన్నారు.

# లోక్‌భవన్‌లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





శుక్రవారం లోక్‌భవన్ కమ్యూనిటీహాల్ (సంస్కృతి)లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో గవర్నర్ దంపతులు శివప్రతాప్‌శుక్లా, జానకిశుక్లా; సీతారాంబాగ్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ దంపతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, వారి సతీమణి జానకి శుక్లాతో కలిసి శ్రీరామనవమి సందర్భంగా శుక్ర వారం లోక్‌భవన్ కమ్యూనిటీహాల్ (సంస్కృతి)లో నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ మహో త్సవంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వ హించారు. అనంతరం అక్కడి అధికారులకు, సిబ్బం దికి శుభాకాంక్షలు తెలిపారు. తరువాత, భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొని రథయాత్రను ప్రారం భించారు.

### సీతారాంబాగ్ ఆలయంలో..

**హైదరాబాద్ (గోషామహల్), మార్చి 27, ప్రభాతవార్త:** భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో సీతారాబాగ్ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాల్లో అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. కల్యాణోత్సవాల్లో గవర్నర్ శివపత్రాప్‌శుక్లా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్ మాట్లాడుతూ వైకుంఠ నాథుడే రాముడిగా మా నవ రూపంలో జన్మించి జీవితంలోని ఒడిదు డుకులను, కష్టాలను అధిగమించి యావత్ మాన వాళికి ఆదర్శంగా నిలిచి తేజోమూర్తిగా వెలుగొంది లోకకల్యాణం కోసం త్రేతాయుగంలో జన్మించిన అవతార పురుషుడు శ్రీరామచంద్రుని కళ్యాణ మహో త్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

### శోభయాత్ర ప్రారంభం

సీతారామ కళ్యాణోత్సవ అనంతరం శోభయాత్రను మధ్యాహ్నం 1 గంటలకు ప్రారంభమమైయింది. ఈ శోభయాత్రలో ఉజ్జయినికి చెందిన ఆచార్య స్వామి రామస్వరూప్ బ్రహ్మచారి, స్వామి అద్వితా నంద్‌గిరి మహారాజ్‌లు ప్రత్యేక గుర్రపు బండిలో శోభయాత్రలో పాల్గొన్నారు.

# హిందూ పండుగలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదు

## సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెడుతా: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** హిందూ పండుగలకు తెలంగాణ ప్రభుత్వం, పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని, కోర్టులకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని అన్నారు. నిర్మల్ ఎస్పీ హిందువులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి దమ్ముంటే గంజాయి, డ్రగ్స్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. ఎస్పీపై చర్యల కోసం అసెంబ్లీలో ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని తెలిపారు. హిందువులు ఇన్నాళ్లు శాంతియుతంగా ఉన్నారని, ఇక నుంచి సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని అన్నారు.

# గడ్డి మందుపై నిషేధం విధించాలి

## లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ ప్రమా దాలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) అనే అత్యంత ప్రమాదకర హెర్బిసైడ్‌పై తక్షణమే పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్ల మెంట్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని, దీని ప్రభావం వ్యవసాయ వ్యవస్థలపై తీవ్రమవుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పుగా మారిందని హెచ్చరించారు. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ రసాయనం గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు "మరణాయుధం"గా మారిందని ఎంపీ పేర్కొ న్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తు న్నా యని, దీనికి ఇప్పటివరకు సమర్థవంతమైన యాంటిడోట్ లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని అన్నారు. తెలంగాణలోని వరంగల్ సహా పలు జిల్లాల్లో ఇది ఆత్మహత్యలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రమాదకర సాధనంగా మారిందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, పర్యావరణం, సామాన్య ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) తయారీ, విక్రయం, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలం గాణ సహా పలువురు వైద్య నిపుణులు, ప్రజా ప్రతినిధులు కూడా ఇదే అంశంపై ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ నిషేధం కోసం ఒత్తిడి తెస్తున్నారని ఎంపీ గుర్తుచేశారు. ప్రమాదకర రసా యనాలకు బదులుగా సురక్షి త ప్రత్యామ్నా యాలను ప్రోత్సహించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేం ద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కడియం కావ్య కోరారు.

# బిసి కార్పొరేషన్‌కు రూ. 10 వేల కోట్లు కేటాయించాలి

## ముఖ్యమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు రూ. 10 వేల కోట్లు కేటాయించాలని, ప్రతి బీసీ కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. దళిత బంధు తరహాలోనే బీసీల అభివృద్ధి కోసం తక్షణమే ఖిబీసీ బంధుఖి పథకాన్ని ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. గత 13 ఏళ్లుగా తెలంగాణలో బీసీలకు ఆశించిన స్థాయిలో సబ్సిడీ రుణాలు అందలేదని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 2015 నుంచి విడతల వారీగా లక్షలాది దరఖాస్తులు తీసుకున్నప్పటికీ, వాటిని పెండింగ్‌లో పెట్టడం వల్ల బీసీలు ఆర్థికంగా దిగజారారని విమర్శించారు.

బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్ సహా 16 కుల ఫెడరేషన్ల నిధులు లేక నిర్వీర్యమయ్యాయని, జిల్లా స్థాయి కార్యాలయాలను ఎత్తివేయడం వల్ల యంత్రాంగం లోపించిందని అన్నారు. యంత్రీకరణ ధాటికి కులవృత్తులు దెబ్బతిన్నాయని, వారికి ప్రత్యామ్నాయంగా కుటీర, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు, 12 కుల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తి ప్రకారం రూ. 2 వేల కోట్లు కేటాయించాలి. ప్రస్తుతం ఉన్న 16 కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలి. కార్పొరేషన్ లేని 32 కులాలకు కొత్తగా వాటిని ఏర్పాటు చేసి, పాలకమండళ్లను నియమించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలోనే బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పునరుద్ధరించాలి.

రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 120 బీసీ గురుకులాలు, 100 కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలి. బీసీ స్టడీ సర్కిళ్లకు రూ. 200 కోట్లు కేటాయించి అన్ని పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలి. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బడ్జెట్‌ను రూ. 60 కోట్ల నుంచి రూ. 300 కోట్లకు పెంచాలి. బీసీ అడ్వకేట్ల స్టైఫండ్‌ను రూ. 10 వేలకు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాన్ని రూ. 2.50 లక్షలకు పెంచాలని కోరారు.

# ఆర్‌ఎస్‌ఎస్ గీతాలను ఆలపించిన కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్

## స్వరాలు సమకూర్చిన వందేమాతరం శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాడిన ఆర్‌ఎస్‌ఎస్ గీతాల వీడియోలు శుక్రవారం విడుదల చేశారు. గళమెత్తి పాడాలి, మాతృమూర్తి పదాల ముందర అనే రెండు పాటల వీడియోలను కరీంనగర్ విడుదల చేశారు.



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి శత వసంతాలు పూర్తయిన నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ గీతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో బండి సంజయ్ ఈ గీతాలను ఆలపించారు. బండి సంజయ్ చిన్నప్పటి నుండి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో పనిచేశారు. జాతీయవాదం, హిందుత్వ సిద్ధాంతాలను పూర్తిగా పుణికి పుచ్చుకున్న సంజయ్ చిన్ననాటి నుండి పాడేవారు. పలు అంతర్గత సమావేశాల్లో, సభల్లో సంజయ్ దేశభక్తి గీతాలు పాడేవారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ శతవసంతాలు పూర్తయిన సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను సామాన్య ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సన్నిహితుల సూచించడంతో బండి సంజయ్ ఈ గీతాలను విడుదల చేశారు. గురువారం ఈ వీడియో లకు సంబంధించి ప్రోమో విడుదలైన కొన్ని గంటల్లో సోషల్ మీడియాలో హల్ చల్ చేశాయి. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో వేలాది మంది భక్తులు, చిన్నారుల సమక్షంలో బండి సంజయ్ ఈ గీతాల వీడియోలను విడుదల చేశారు. కార్యక్రమానికి రచయిత ఆకుల నాగేశ్వర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# కరీంనగర్ కేంద్రంగా సైబర్ నెట్‌వర్క్

## 13 మంది అరెస్ట్

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** అమాయకులను నమ్మించి ప్రైవేట్ బ్యాంకులో ఖాతాలు తెరిపించి వాటి ద్వారా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడేవారు ఆ ఖాతాల్లోకి డబ్బు మళ్లించి కోట్లు కొల్లగొట్టిన ఘటన కరీంనగర్ కమిషనర్ పోలీసులు బయటపెట్టారు. శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలో సిపి గౌస్ ఆలం ఆపరేషన్ క్రాక్ డౌన్ వివరాలను వెల్లడించారు. సైబర్ నేరాలకు వినియోగించే మ్యూలు ఖాతాలు కరీంనగర్ జిల్లా కేంద్రంగా నడుస్తున్నాయని గుర్తించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు దీనిలో భాగంగా ఆర్బిఎల్ బ్యాంక్ (రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్) సిబ్బంది కొంతమంది ఏజెంట్లను పెట్టి సామాన్యులకు డబ్బు ఆశ చూపి ఖాతాలు తెరిపించి వాటిని నేరస్తులకు అప్పగించినట్లు గుర్తించారు. మ్యూ ఖాతాలను సృష్టించి వాటిని పర్యవేక్షి ంచడం, అకౌంట్లో ఉన్నవారికి సైబర్ నేరస్తులు వారి అకౌంట్ వినియోగించుకున్నందుకు ఇచ్చే డబ్బు పర్యవేక్షి ంచేందుకు ఏజెంట్లు, మధ్యవర్తులు, ఖాతాదారులు అంటూ ఒక పద్ధతి ప్రకారం నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. మ్యూన్ ఖాతాల ద్వారా 12 కోట్ల 25 లక్షల 31 వేలు లావాదేవీలు జరగగా ఆర్బిఎల్ బ్యాంక్ న్యూ లు ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా 138 కోట్లు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. ఈ నేరానికి సంబంధించి 13 మందిని అరెస్టు చేసినట్లు సిపి వెల్లడించడంతోపాటు మీడియా ముందు హాజరపరిచారు. నిందితుల్లో బిల్ బ్యాంక్ మేనేజర్ భువనగిరి కళ్యాణ్ (52), ఆయేషా బేగం (30), తో పాటు బండారి సాయిరాం (30), హనుమాన్ల రంజిత్ (36), అలిగేటి మల్లేశం (37), భోగ రాకేష్ (35), బండి ప్రణయ్ (25), విభూది రామ్ కుమార్ (37), నాతర్ల శ్రీనివాస్ (39), కర్రి రాజు (35), కల్లెడ మహేందర్ కొండ నరహరి (37), ( కల్లెడ రాజేష్ (27) లు ఉన్నారు. వీరిపై నమోదైన ఎనిమిది కేసుల్లో కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించనున్నట్లు కరీంనగర్ సిపి గౌస్ ఆలం తెలిపారు.





# సికింద్రాబాద్‌లో మెరుగైన రైల్వే మౌలిక వసతులు కల్పించాలి

## ఎంపి అనిల్‌యాదవ్

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** సికింద్రాబాద్‌లో రైల్వే మౌలిక వస తులు కల్పించి ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం చేసేం దుకు వీలు కల్పించాలని ఎంపి అనిల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సభలో ప్రధానమంత్రి సమక్షంలో తెలంగాణలోని రైల్వే ప్రయాణికుల ఇక్కట్ల ను చేపట్టాల్సి అభివృద్ధి పనులను ఆయన వివరించారు. రైల్వే ఆస్తుల పరి రక్షణలో రైల్వే శాఖ మంత్రి జవాబుదారీతనంగా వ్యవహరించాలని ఆయన బాధ్యతతో ఉంటే కింద సిబ్బంది కూడా బాధ్యతగా ఉంటారని తెలిపారు. అనేక రైల్వే ఆస్తులు సరైనరీతిలో నిర్వహణ లేక అవి నిర్లక్ష్యానికి గురై ప్రజో పయోగానికి ఉపయోగపడకుండా పోతున్నాయని ఆవేదన చెందారు. రైల్వే ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని కోరారు.

# కొత్తగూడెంలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

## రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు ఎంపిలు వద్దిరాజు, సురేష్‌రెడ్డి వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** తెలంగాణలోని కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వేస్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత, నిరంతర సేవలను దృష్టిలో పెట్టుకుని డివిజన్ ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి పర్చాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి బిఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ రైల్వే స్టేషన్ మూలాలు 1932లో బ్రిటిష్ కాలం నాటివని, వేగంగా విస్తరిస్తున్న సింగరేణి బొగ్గు క్షేత్రాలకు సేవలు అందించడానికి దీనిని 'భద్రాచలం రోడ్'గా అభివృద్ధి చేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్. సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రలు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలిపారు. వారు పార్లమెంట్ ప్రాంగణంలో శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆ కాలం నాటి చారిత్రక పత్రాలు, అరుదైన ఛాయాచిత్రాలు, రైల్వే, మైనింగ్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్టేషన్ ఒక వ్యూహాత్మక బొగ్గు రవాణా కేంద్రంగా ఎలా రూపుదాల్చిందో ఇవిస్పష్టం చేస్తాయని రవిచంద్ర, సురేష్ రెడ్డిలు మంత్రికి వివరించారు. శతాబ్ద కాలంగా కొత్తగూడెం దేశానికి విద్యుత్ సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని వారు చెప్పారు. ఇది బ్రిటిష్ కాలంలో బొగ్గు వెలికితీత, రవాణాను సాధ్యం చేసిందని తెలిపారు. ఇది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్నదని, భారతీయ రైల్వేలో సరుకు రవాణా ఆదాయానికి కీలకమైనదని తన వినతిపత్రంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఇంత గొప్ప వారసత్వం ఉన్నా కూడా భారతీయ రైల్వే చరిత్రలో కొత్తగూడెం స్టేషన్ తగిన గుర్తింపు లేని కీలకమైన ది మిగిలిపోయిందని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ రోజు కొత్తగూడెంలో అనేక ప్రధాన రైల్వే ప్రాజెక్టులు కేంద్రీకృత మవుతున్నాయని ఎంపీలు రవిచంద్ర, సురేష్ రెడ్డిలు మంత్రికి తెలిపారు. కొత్తగూడెంకిరండల్, మల్కాన్ గిరిభద్రాచలం జునాగఢ్ మల్కాన్‌గిరి భద్రాచలం కారిడార్, ప్రతిపాదిత కొత్తగూడెం సత్తుపల్లికొవ్వూరు మార్గాలు అని వినతిపత్రంలో ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. ఈ ప్రాంతం తెలం గాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే ఒక ప్రధాన రైల్వే కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని ఎంపీ రవిచంద్ర తెలిపారు. 2032లో కొత్తగూడెం రైల్వేస్టేషన్ 100 యేళ్ల మైలురాయిని చేరుకోనున్న తరుణంలో, ఈ చారి త్రాత్మక స్టేషన్‌కు తగిన గుర్తింపు లభించాలనేది ప్రజల చిరకాల ఆకాంక్ష అని ఆయన మంత్రికి వివరించారు.

# ఖమ్మం-బస్తర్ కారిడార్‌ను నాలుగు లేన్లుగా విస్తరించాలి

## కేంద్రానికి ఎంపి వద్దిరాజు విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** తెలంగాణ, మధ్య భారతానికి వ్యూహాత్మక జీవనాధారమైన ఖమ్మం బస్తర్ కారిడార్‌ను వెంటనే నాలుగు లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. తూర్పు తెలంగాణ, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో అనుసంధానం, భద్రత, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యక్షంగా ప్రభావం చూపే ఒక కీలకమైన మోలిక సదుపాయాల లోపం గురించి దృష్టి సారించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హై స్పీడ్ కారిడార్ల ద్వారా హైదరాబాద్ నుండి ఖమ్మం వరకు ఉన్న రహదారి మార్గంలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తున్నదన్నారు. అయితే, ఖమ్మం వెలుపల కొత్తగూడెంభద్రాచలం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల అనుసంధానం నిర్లక్ష్యానికి గురైందన్నారు. వ్యూహాత్మకంగా ఇది అత్యంత కీలకమైన ఒక జీవనాడి అని, దీనిని ఒడిషా వైపు కూడా అనుసంధానం చేయొచ్చని ఎంపీ రవిచంద్ర తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం ఆయన జీరో అవర్ లో మాట్లాడుతూ, ఈ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదని, ఇది తెలంగాణ ఛత్తీస్‌గఢ్ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే వ్యూహాత్మకమైనదని చెప్పారు. ఈ నెట్‌వర్క్‌కు కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఉంటుందన్నారు. సింగరేణి బొగ్గు క్షేత్రాలు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ప్రధాన పరిశ్రమలకు నిలయమైన కొత్తగూడెం పాల్వంచలు తెలంగాణ పారిశ్రామిక, ఇంధన వెన్నెముకగా ఉన్నాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్నా కూడా ఖమ్మం దాటాక ఈ ప్రాంతంలో రహదారి మోలిక సదుపాయాలు సరిగా లేవని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనాలు తరుచూ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకోవాల్సి వస్తున్నదని వివరించారు. ఖమ్మం–కొత్తగూడెం–భద్రాచలం–బస్తర్ కారిడార్‌ను వెంటనే నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నాలుగు లేన్ల కారిడార్ కొత్తగూడెంను త్రిరాష్ట్ర లాజిస్టిక్స్ కేంద్రంగా రూపుదాల్చి రాష్ట్రాల మధ్య బొగ్గు, ఖనిజాలు, అటవీ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువుల నిరాటంక రవాణాను సులభతరం చేస్తుందని వివరించారు.



# వీధికుక్కల దాడి బీభత్సం

## మూడేళ్ల బాలుడు కన్ను కోల్పోయిన దుర్ఘటన

### బాధితుని ఆస్పత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**యాదాద్రి భువనగిరి, బ్యూరో ప్రభాతవార్త:** భువనగిరి పట్టణంలో వీధి కుక్కల బెడద మరోసారి తీవ్రరూపం దాల్చింది. నిన్న జరిగిన దారుణ ఘటనలో మూడేళ్ల బాలుడు ప్రియాన్ష్‌పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ దాడిలో బాలుడు ఒక కన్ను కోల్పోవడం స్థానికంగా కలకలం రేపింది. గాయపడిన బాలుడిని వెంటనే హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించి వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, కుడి కంటి చూపు తిరిగి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని వైద్యులు స్పష్టం చేశారు. కొద్ది రోజుల తర్వాత కృత్రిమ కన్ను అమర్చనున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, ఇది అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొన్నారు. పట్టణాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో, దీనిపై ఇప్పటికే అసెంబ్లీలో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, వీధి కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ కార్యక్రమాలను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. ఇక ఈ ఘటనతో స్థానిక ప్రజల్లో భయం నెలకొంది. చిన్నారులు బయటకు వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# మంత్రి జూపల్లికి అంతర్జాతీయ శాంతి పురస్కారం

## ప్రపంచశాంతికి బౌద్ధమే శరణ్యం:

### శ్రీలంక మంత్రి హినిదుమే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** యుద్ధ వాతావరణంలో పలు దేశాలు తల్లడిల్లుతున్న నేపథ్యంలో ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమని, శ్రీలంక బుద్ధ శాసన, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆచార్య హినిదుమే సునీల్ సెనెవి అన్నారు. శుక్రవారం బుద్ధవనం, వియత్నాం బౌద్ధ సంఘం సంయుక్తంగా బేగంపేటలో ది ప్లాజా హోటల్లో నిర్వహిస్తున్న ప్రపంచ శాంతికై అంతర్జాతీయ బౌద్ధ సదస్సులో శుక్రవారం ఆయన, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బౌద్ధ వారసత్వ పరిరక్షణ,ప్రపంచ శాంతి స్థాపనలో అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిలో మంత్రి చూపుతున్న చొరవను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ ఇంటర్‌ఛేంజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ ప్రైజ్ ఫర్ కాంట్రిబ్యూషన్ టు వరల్డ్ పీస్ అవార్డును ప్రదానం చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు మూన్ యోంగ్ జో ఈ పురస్కారాన్ని అందజేస్తూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వారికి ఆసరాగా నిలుస్తూ మానవ విలువల కోసం కృషి చేస్తున్న మంత్రి సేవలను కొనియాడారు. అవార్డును స్వీకరించిన మంత్రి జూపల్లి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వేదుతున్న శాంతి,సహనం,అహింస విలువలకు లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక వలయాన్ని అభివృద్ధి చేసి, బుద్ధవనాన్ని ప్రపంచవ్యాప్త బౌద్ధుల కేంద్రంగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం చొరవ చూపిస్తుందన్నారు, బుద్ధుని బోధనలు ఆచరిస్తే శాంతి దానంతట అదే చేకూరుతుందని మంత్రి తెలిపారు. వియత్నాం బౌద్ధ సంఘ అధ్యక్షులు పూజ్యనీయ తిచ్ నాత్ తు ప్రసంగిస్తూ, శాంతి ముందుగా వ్యక్తుల మనసులో ప్రారంభమవుతుందని, సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుందన్నారు. నలంద మహా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య సిద్ధార్థ సింగ్ కీలకోపన్యాసం చేస్తూ, కుశల ఆలోచనలు, చర్యలు, మనిషిని సర్వతోన్ముఖునిగా తీర్చిదిద్ది, సమాజ హితానికి తోడ్పడుతుందని, ఆ ఉద్దేశంతో ప్రపంచ పర్యావరణ సమితి ఏర్పడిందని, బౌద్ధాన్ని ఆచరిస్తే యుద్ధాలకు తావుండదని పేర్కొన్నారు. సదస్సులో శ్రీలంక బౌద్ధ భిక్షు, ఆచార్య కసప్ప మహా థేరో, రష్యా బౌద్ధ సంఘ, అధ్యక్షులు, అండ్రే దొందుకోవెవ్, లావోస్ కేంద్ర బౌద్ధ సంఘ, అధ్యక్షులు, వంఖరి వాంగ్ సనుసిన్, మహాబోధి సొసైటీ, జనరల్ సెక్రెటరీ, ఆనందబిక్కు ప్రసంగించారు. బౌద్ధ సంస్కృతి పరిరక్షణకు చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా, శ్రీలంక మంత్రి ఆచార్య హానీ దుమీ, రాష్ట్ర పర్యాటక శాఖామాత్యులు జూపల్లి కృష్ణారావు, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, తీచ్ నాత్ తులకు అంతర్జాతీయ అవార్డులు అందజేసి మూన్ యాంగ్ జో సత్కరించారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ 22 దేశాల నుంచి 80 మంది ప్రతినిధులు సదస్సులో ప్రసంగించారని చెప్పారు.




శుక్రవారం ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ ప్రైజ్ ఫర్ కాంట్రిబ్యూషన్ టు వరల్డ్ పీస్ అవార్డును మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రదానం చేస్తున్న ఇంటర్నేషనల్ ఇంటర్‌ఛేంజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మూన్‌యోంగ్ జో

# జోజిల్లా పాస్ వద్ద ప్రమాదం

## మంచుచరియలు విరిగిపడి

## ఏడుగురు మృతి

### మరో ఐదుగురికి గాయాలు



**న్యూఢిల్లీ, మార్చి 27:** శ్రీనగర్ లేహ్ హైవేపై భారీ ఎత్తున మంచు చరియలు విరిగిపడటంతో కనీసం ఏడుగురు చనిపోగా మరో ఐదుగురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. లడక్‌వైపు ఉన్న జోజిలా పాస్‌వద్ద తీవ్రస్థాయిలో మంచుచరియలు విరిగి పడుతుండటంతో ప్రయాణీకుల వాహనాలు ఈ మంచు శకలాలలోకి చిక్కుకున్నాయి. ఈ ప్రమాదంతో హైవేను పూర్తిగా నిలిపివేశారు. ఈప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణీకులు, వాహనాలను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. లడక్ లెఫ్టినెంట్ గవర్నర్ స్వయంగా ఈపరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కార్గిల్ జిల్లా కలెక్టర్, సీనియర్ ఎస్పీలను వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి సహాయక పనులు పర్యవేక్షించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ ఏజెన్సీలు, బోర్డర్‌రోడ్ ఆర్గనైజేషన్ సిబ్బంది మొత్తం ఆ ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీచేసారు. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ ఈ దారుణ ప్రమాదంలో ఏడుగురు చనిపోయారని, ఐదు గురికి తీవ్ర గాయాలయ్యాయని ధృవీకరించారు. జోజిల్లా పాస్‌వద్ద మంచుచరియ విరిగి వాహనంపై పడటంవల్లనే ఈప్రమాదం జరిగిందన్నారు. 434 కిలోమీటర్ల నిడివి కలిగిన శ్రీనగర్ లేహ్ హైవేను ఎన్‌హెచ్‌వన్‌గా పిలుస్తారు. భారీ ఎత్తున మంచుకురుస్తుంటుంది. అంతే కాకుండా ప్రమాదకరమైన పర్వత మార్గం కావడంతో హైవేను తరచూ నిలిపివేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి జోజిల్లా పాస్‌వద్ద సొరంగ మార్గం ఏర్పాటుచేస్తున్నారు. ఆల్‌సీజన్ టన్నెల్‌గా నిర్మిస్తున్నట్లు కేంద్రంప్రకటించింది. రెండులేన్ల టన్నెల్ 14.2 కిలోమీటర్ల నిడివితో ఉంటుంది.

# 50శాతం విమానాల్లో సాంకేతిక లోపాలే ఎక్కువ!

**న్యూఢిల్లీ, మార్చి 27:** దేశంలోని 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని పౌరవిమానయానశాఖపరిధిలోని స్థాయీ సంఘం వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించినట్లు వెల్లడించింది. తరచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా 377 వాటిల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపింది.

ఆడిట్ చేసిన వాటిల్లో ఇండిగో విమానాల సంఖ్య ఎక్కువగా ఉందని, లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నట్లు కమిటీ తెలిపింది.

ఫిబ్రవరి 3వ తేదీ వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా, 148 ఫ్లైట్‌లలో లోపాలు ఉన్నాయని తెలిపింది. కొన్ని లోపాలు రిపీట్ అయినట్లు పేర్కొంది.

166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టగా, వాటిలోనూ లోపాలు వెలుగుచూశాయి. దాదాపు సగం లోపాలు ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నట్లు తెలిపింది. ఈ స్థాయిలో లోపాలు వెలుగుచూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత సంవత్సరం అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది.

# ప్రధాని మోడీ ఎక్సైజ్ సుంకం తగ్గించడం సాహసోపేత నిర్ణయం

## పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రం వ్యాట్ తగ్గించాలి:

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** ప్రధాని నరేంద్ర మోడీ శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడం ఒక సాహసోపేతమైన నిర్ణయమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభివర్ణించారు. దేశ ప్రజలకు తీపి కబురు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, జనరంజకమైన నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా సున్నా స్థాయికి తగ్గించడం పెట్రోల్‌పై కూడా రూ.10 భారాన్ని తగ్గించి కేంద్రం తన బాధ్యతను చాటుకుందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను ఎప్పుడు నెరవేరుస్తుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. ప్రస్తుతం తెలంగాణలో వ్యాట్ సుమారు 35శాతం ఉండటం వల్ల సామాన్యుడిపై పెను భారం పడుతోంది. కేంద్రం పన్నులు తగ్గిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని,ఇది ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని మండిపడ్డారు. ఖజానా కంటే ప్రజలే ముఖ్యం: గత ప్రభుత్వాలు చేసిన అప్పులు, ఆయిల్ బాండ్ల భారం ఉన్నా కేంద్రం వెనక్కి తగ్గలేదు. కానీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పన్నుల రూపంలో ప్రజల రక్తాన్ని పిండుతోంది. పెట్రోల్ ధరలో కేంద్రం వాటా కంటే రాష్ట్రం వాటాయే ఎక్కువగా ఉండటం అత్యంత దురదృష్టకరం.

రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఇప్పటికైనా మాటల గారడీలు పక్కన పెట్టి, తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలి. రాష్ట్ర ప్రభుత్వం తన పన్ను వాటాను తగ్గిస్తేనే పెట్రోల్ ధర రూ.100 లోపుకు వచ్చే అవకాశం ఉంటుంది. సామాన్యుడికి నిజమైన ఊరటనివ్వాలని నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేల క్రీడా పోటీల్లో మేము పాల్గొనం

## ప్రజాసమస్యలు పెండింగ్‌లో ఉండగా

## క్రీడా పోటీలు అవసరమా?: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్వహిస్తున్న క్రీడా పోటీలపై భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కే.టి. రామారావు (కేటీఆర్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల ప్రజలు అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదుర్కొంటున్న సమయంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలలో పాల్గొని సమయం వృథా చేయడం తగదని స్పష్టం చేశారు.మేము ఎమ్మెల్యేలుగా ఈ క్రీడా పోటీలలో పాల్గొనబోమని కేటీఆర్ వెల్లడించారు. సభను కనీసం ఇంకో 10 రోజులు కొనసాగించి ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని, అనేక కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనబెట్టి, అర్థాంతరంగా అసెంబ్లీని వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం ప్రజలు సమర్థించరని, ఇది మంచి పరిణామం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం కూడా ఈ క్రీడా పోటీలపై పునరాలోచన చేయాలని సూచించారు."మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు. క్రీడలను ప్రోత్సహించాలంటే పిల్లలకు అవకాశాలు కల్పించి, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆటలు ఆడించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

**విమెన్స్ డాక్టర్స్ క్రికెట్ లీగ్‌ను ప్రారంభించిన కెటిఆర్**

ఇదిలా ఉండగా, హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన విమెన్స్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ సీజన్4 కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ నటుడు సాయి కుమార్, బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి, మహిళా వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రికెట్ లీగ్‌ను ప్రారంభించిన కేటీఆర్, విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు.

# ఎఐ, గ్రీన్‌ఎనర్జీ, ఇన్‌ఫ్రా రంగాల్లో పెట్టుబడులకు అవకాశం

## హైదరాబాద్ ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీలకు కేంద్రం.. రానున్న మరిన్ని సంస్థలు

## హార్వర్డ్ కెన్నడీ స్కూల్ ఎఐ సింపోజియంలో వర్చువల్‌గా పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి27:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని మీ అందరినీ నేను ఆహ్వానిస్తున్నా. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ఫ్రా రంగాల్లో పెట్టుబడులకు హైదరాబాద్‌లో అవకాశం ఉంది అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ ఇప్పటికే ఫర్చ్యూన్ 500 కంపెనీలకు కేంద్రంగా ఉంది. మరిన్ని సంస్థలు త్వరలో రానున్నాయని పేర్కొన్నారు. అమెరికా బోస్టన్ సిటీలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని హార్వర్డ్ కెన్నడీ స్కూల్ ఆర్టిఫిషయ్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు-ఏఐ)పై శుక్రవారం రాత్రి నిర్వహించిన సదస్సులో సిఎం.రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నిర్వహిస్తున్న ఈ తొలి ఏఐ సింపోజియంలో ముఖ్య అతిథిగా మాట్లాడటం ఎంతో గౌరవంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ, ఈ ఏఐ సింపోజియంలో మాట్లాడే తొలి భారతీయుడిగా ఉండటం గర్వకారణంగా భావిస్తున్నాని చెప్పారు. ఈ గౌరవాన్ని తెలంగాణ ప్రజలందరి తరఫున స్వీకరిస్తున్నా... ఇటీవల హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ విద్యార్థినిగా ఉండటం వల్ల ఇది నాకు మరింత ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఈ రోజు ప్రపంచమంతా ఏఐ గురించి ఆలోచిస్తోంది. ఓపెన్ ఏఐ, చాట్ జిపిటిని ప్రారంభించిన తర్వాత జెమినీ,క్లాడ్,గ్రాక్,డీప్‌సీక్,పర్‌ప్లెక్సిటీ, కోపైలెట్, వంటి ఎల్‌ఎల్‌ఎంలు (లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్) మన దైనందిన జీవితంలో భాగమయ్యాయని చెప్పారు. ఏఐ మానవజాతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటి. కానీ ఇది రెండు వైపుల పదునున్న కత్తి లాంటిది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతికూల ప్రభావాలు ఎక్కువగా చూపుతుందని చెప్పారు. ఏఐ ఉద్యోగాలను తగ్గిస్తే, మేం సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే భారత్ ఫ్యూచర్ సిటీ అనే కొత్త నగరాన్ని నిర్మిస్తున్నాను. అందులో ఒక భాగాన్ని ఏఐ సిటీగా అభివృద్ధి చేస్తున్నాం. ఇది ఏఐ సంస్థలకు ఒకే చోట అన్ని సౌకర్యాలు కలిగించే కేంద్రంగా ఉంటుందన్నారు. నగరానికి బయట గ్రీన్ ఎనర్జీతో పనిచేసే డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. మనుషుల నైపుణ్యాలను ఉపయోగించి ఏఐ అభివృద్ధికి ప్రపంచానికి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీని మారుస్తామని చెప్పారు. ఏఐ మార్చలేని గ్లోబల్ పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో ఉద్యోగాలను యుద్ధప్రాతిపదికన పెంచుతున్నామని చెప్పారు, గ్రీన్ ఎనర్జీ ఆధారంగా తయారీ రంగాన్ని అభివృద్ధి చేసి 'చైనా+1' ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది మా లక్ష్యం, ఉద్యోగాలు కోల్పోయే వారికి పునఃశిక్షణ (రీస్కిల్లింగ్) అందించేందుకు హార్వర్డ్ వంటి ప్రపంచ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని చెప్పారు.





# ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

## డాలర్ వర్సెస్ రూపాయి 94.82

### 86 పైసలు క్షీణించిన భారత్ కరెన్సీ

**ముంబయి, మార్చి 27:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోయాయి. వారాంతంలో రూపాయి విలువలు 94.82గా పడిపోయాయి. ముడిచమురుదరలు భారీగా పెరగడంతో దిగుమతుల చెల్లింపులకు డాలర్ డిమాండ్ పెరగడంవల్లనే డాలర్ పటిష్టం అయి రూపాయీ క్షీణించింది. పశ్చిమాసియా యుద్ధవాతావరణం కూడా ఇందుకు కొంత తోడయింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐ విత్‌డ్రాలుకూడా పెరిగాయి. దీనితో ఇన్వెస్టర్లకు చెల్లింపులు డాలర్లపరిధిలోనే ఉండటం కూడా రూపాయి క్షీణతకు తోడయింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్‌లో రూపాయి 94.18వద్దప్రారంభం అయి ఒకదశలో 94.50ని బ్రేక్‌చేసింది. చివరకు 94.82వద్ద మారకం ట్రేడింగ్‌ముగిసింది. ముందురోజు కంటే 86 పైసలు క్షీణించింది. గత బుధవారంరోజుననే 20 పైసలు క్షీణించిన భారత రూపాయి డాలరుతో మారకం 93.96వద్ద కొనసాగింది. స్టాక్, ఫోరెక్స్, కమోడిటీ, బులియన్ మార్కెట్లు రామనవమి కారణంగా మూతపడ్డాయి. తిరిగిశుక్రవారం ట్రేడింగ్‌లో భారత్‌రూపాయి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. ఆరు కరెన్సీల బాస్కెట్‌పరంగాచూస్తే డాలర్ 0.11 పటిష్టం అయింది. ఇక బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 109.8 డాలర్లుగా నడిచింది. ఫ్యూచర్‌ట్రేడ్‌లో భారీ పెరుగుదలనమోదుచేసింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 1805.37 కోట్లవిలువైన షేర్లను విక్రయించడంతో ఈచెల్లింపులన్నీ డాలర్లలోనే కొనసాగాయి. దీనితో భారత్‌రూపాయి చెలామణి మరింతగా క్షీణించింది. ఈక్విటీ మార్కెట్లపరంగా సెన్సెక్స్ 1690.23 పాయింట్లు క్షీణించి 73,583.22 పాయింట్లకుచేరితే నిఫ్టీ 486.85 పాయింట్లుక్షీణించి 22,819.60 పాయింట్లకు చేరింది. దీనితో ఇన్వెస్టర్ల విత్‌డ్రాలకు డాలర్ చెల్లింపులు అనివార్యం అయ్యాయి.

# సమ్మతితో సహజీవనం నేరమేమీ కాదు!: అలహాబాద్ హైకోర్టు తీర్పు

***అలహాబాద్; మార్చి 27:*** *వయోజనురాలితో వివాహితుడు సహజీవనం చేస్తే తప్పేం కాదని అని అలహాబాద్ హైకోర్టు తేల్చి చెప్పింది. వివాహితుడైన పురుషుడు వయోజనురాలైన మహిళ మధ్య పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనం నేరమే కాదని న్యాయస్థానం పేర్కొంది. జంటను అరెస్ట్ చేయొద్దని పోలీసులను ఆదేశించింది. జంట భద్రతకు పోలీసులే బాధ్యత తీసుకోవాలని.. వారికి పూర్తి భద్రత కల్పించాలని సూచించింది. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లోని జైతీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2026 జనవరి 8న అనామిక(18) అనే యువతి తల్లి కాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేత్రపాల్ అనే వివాహితుడు తన కుమార్తెను ప్రలోభపెట్టి ఎత్తుకెళ్లిపోయాడని ఈ విషయంలో ధరంపాల్ అనే మరో వ్యక్తి సహకరించాడని ఆరోపించింది. దీంతో పోలీసులు వారిద్దరిపై బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 87 కింద కేసు నమోదు చేశారు. దీంతో జంట ఈ కేసును కొట్టేయాలని అలహాబాద్ హైకోర్టులో అప్పీల్ చేసుకున్నారు. పిటిషనర్లు అనామిక, నేత్రపాల్ దాఖలు చేసిన క్రిమినల్ రిట్ పిటిషన్‌పై జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ఇద్దరం వయోజనులమని ఇష్టపూర్వకంగానే కలిసి జీవిస్తున్నామని అనామిక, నేత్రపాల్ జంట కోర్టుకు తెలిపారు.*

*ఎఫ్ఐఆర్‌లో కూడా అనామిక వయస్సు 18 సంవత్సరాలుగా ఉందని దీనిని బట్టి అనామిక వయోజనత్వాన్ని రుజువు చేస్తోందని వెల్లడించారు. ప్రతివాది న్యాయవాది మాట్లాడుతూ నేత్రపాల్‌కు అప్పటికే వివాహమైందని అందువల్ల మరో మహిళతో కలిసి జీవించడం నేరమని వాదించారు. దీంతో ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఇష్టపూర్వకంగా కలిసి జీవిస్తున్న వయోజనులపై ఈ ప్రాతిపదికన విచారణ జరపలేమని పేర్కొంటూ ప్రతివాది వాదనను పూర్తిగా తిరస్కరించింది. ఇద్దరు ప్రతివాదుల తరఫు న్యాయవాదులకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తాను ఇష్టపూర్వకంగానే నేత్రపాల్‌తో కలిసి జీవిస్తున్నానని అనామిక ఇప్పటికే షాజహాన్‌పూర్ పోలీసులకు లిఖితపూర్వకంగా తెలియజేసింది.*

# లాక్‌డౌన్ పుకార్లపై కేంద్రమంత్రి సీరియస్

## అవన్నీ పుకార్లే.. నమ్మవద్దన్న హార్దీప్‌సింగ్‌పూరి

**న్యూఢిల్లీ, మార్చి 27:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధవాతావరణంతో పశ్చిమాసియా దేశాలు అల్లాడుతున్న సంగతి తెలిసిందే. దీనితో లాక్‌డౌన్‌నాటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నామని, అయినా అధిగమించామని ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటులో పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రధాని వ్యాఖ్యల అనంతరం లాక్ డౌన్ వంటి పరిస్థితులు వస్తాయనే పుకార్లు షికార్లు కొడుతున్నాయి. ఈ అంశంపై తాజాగా పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ పూరి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం కోవిడ్19 తరహా దేశవ్యాప్త లాక్‌డౌన్ విధించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, ఆ వదంతులు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. పుకార్లను వ్యాపింపజేయడం, భయాందోళనలను సృష్టించడం బాధ్యతారాహిత్యమన్నారు. భారతదేశంలో లాక్‌డౌన్ విధిస్తారన్న వదంతులు పూర్తిగా అవాస్తవం. ప్రపంచ పరిస్థితులు ఎప్పటి కప్పుడు మార్పునకు లోనవుతున్నాయి. ఇంధనం, సరఫరా గొలుసులు, నిత్యావసర వస్తువులకు సంబంధించి జరుగుతున్న పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మన పౌరులకు ఇంధనం, శక్తి, ఇతర కీలక వస్తువుల సరఫరా నిరంతరాయంగా అందేలా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం. ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారతదేశం నిలకడగా కొనసాగుతోందని సమయానుకూలంగా, ముందస్తుగా, సమన్వయంతో కూడిన చర్యలు అమలుచేస్తామని మంత్రి చెప్పారు. భారతదేశంలో లాక్‌డౌన్ విధిస్తారనే వార్తలు పూర్తిగా అబద్ధం. నేను దీనిని స్పష్టంగా చెపుతున్నాను, భారత ప్రభుత్వం వద్ద అటువంటి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదు.

# డిమాండ్ కంటే ఎక్కువగా ఇంధన సరఫరా

## పెట్రోల్, డీజిల్ నిల్వలపై ప్రభుత్వం నివేదిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి27:** తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27,2026 నాటి అధికారిక గణాంకాల ప్రకారం... రాష్ట్రంలో పెట్రోల్,డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే ఊరటనిచ్చే అంశం. పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే,రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే,మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా చేశారు. అంటే సాధారణ డిమాండ్ కంటే 182శాతం అధికంగా పెట్రోల్ అందుబాటులో ఉంది. రోజువారీ సగటు అవసరం 7,348కిలో లీటర్లు కాగా, ప్రభుత్వం ఏకంగా 19,580 కిలో లీటర్లును సరఫరా చేసింది.ఇది సాధారణ డిమాండ్ కంటే 167 శాతం ఎక్కువ. మొత్తంగా చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఇంధన అవసరాలు తీర్చడానికి అవసరమైన సగటు 13,231 కిలో లీటర్లు అయితే, ప్రస్తుతం సరఫరా అవుతున్న పరిమాణం 36,189 కిలో లీటర్లుగా నమోదైంది.ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని,ఇంధనం కోసం కంగారుపడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది.

# సర్కార్ రుణాల రీషెడ్యూల్.. దీర్ఘకాలిక వాయిదాలుగా మార్పు

## భారీగా తగ్గనున్న వడ్డీల భారం

## ప్రభుత్వానికి రూ.2 వేల కోట్లు ఆదా

## కార్పొరేషన్ల అప్పులు రూ.94 వేల కోట్లు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న రుణాలను రిజర్వ్ బ్యాంక్ రీషెడ్యూల్ చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ అంగీకరించింది. గత ప్రభుత్వంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ హయంలో తీసుకున్న సుమారు రూ.25 వేల కోట్ల కొత్త అప్పును కూడా తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో చెల్లించేందుకు రిజర్వు బ్యాంక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్ర సర్కార్‌కు ఏటా దాదాపు రూ.2 వేల కోట్లు ఆదా కానున్నాయని ఆర్థిక శాఖ అధికవర్గాలు వెల్లడించాయి. గత ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల పేరుతో ప్రైవేటు ఫైనాన్సింగ్ సంస్థల ద్వారా అధిక వడ్డీలకు రుణాలు తీసుకొచ్చింది. వీటన్నింటిని పదేళ్ల కాలపరిమితిలో చెల్లించే ప్రాతిపదికన రుణాలు సేకరించింది. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ ద్వారా తీసుకునే రుణాలకు 7 నుంచి 7.5 శాతం లోపే ఉంటాయి. వాటిని 25 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు చెల్లించవచ్చు. కానీ ప్రైవేటు ఫైనాన్సింగ్ సంస్థల దగ్గర చేసిన అప్పులకు 11 శాతం వడ్డీ, 10 ఏళ్లలో కచ్చితంగా చెల్లించాల్సి ఉంది. ఇది సర్కారుకు పెద్ద భారంగా మారింది. అందుకే వీటిని రీ షెడ్యూల్ చేయాలని తెలంగాణ సర్కార్ పలుసార్లు రిజర్వ్ బ్యాంక్‌కు విజ్ఞప్తి చేసింది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధ్యయనం చేసిన సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ పాత అప్పులను రీ షెడ్యూల్ చేసేందుకు అంగీకారం తెలిపింది. ఎఫ్ఆర్‌బిఎం ప్రకారం అదనంగా అప్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో రైతు బంధు, సాగు నీటి ప్రాజెక్టులతోపాటు, ఇతర అవసరాలకు అప్పులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్, హౌసింగ్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ గ్రిడ్ కార్పొరేషన్, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల కార్పొరేషన్, కాళేశ్వరం కార్పొరేషన్ తదితర కు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా రూ.94 వేల కోట్ల మేర అప్పులు సేకరించారు. ఈ కార్పొరేషన్ ద్వారా చేసిన రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ ఉంటూ అప్పులు తీసుకుంది. వాటిలో కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రూ.24 వేల కోట్లు, మిషన్ భగీరథ, వాటర్ గ్రిడ్ కార్పొరేషన్ కోసం రూ.20 వేల కోట్లు, దేవాదుల కార్పొరేషన్ నుండి రూ.20 వేల కోట్లు, హౌసింగ్ కార్పొరేషన్‌కు రూ.10 వేల కోట్లు, పాలమూరు, రంగారెడ్డి కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల కోట్ల మేర అప్పులు చేశారు. ఇప్పుడా అప్పులన్నీ దాదాపు లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా చేరినట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి రుణాలను తక్కువ వడ్డీలకు దీర్ఘ కాలిక వాయిదాలుగా మార్పులు చేస్తుండటంతో రాష్ట్ర సర్కార్ ఊపిరిపీల్చుకునేందుకు అవకాశం ఏర్పడింది.

ధనాధన్ బ్యాటింగ్

సిక్సులు, బౌండరీల మోత

# నేటి నుంచే ఐపిఎల్ జాతర

సాయంత్రం 7.30గం.

ఆర్సిబి X సన్‌రైజర్స్

*కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు నేటితో తెరలేవనుంది. చిన్నస్వామి వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే ఆరంభ మ్యాచ్‌తో ఐపీఎల్ జాతర మొదలుకానుంది. ఏప్రిల్ నెల, మే నెల మొత్తం నిండు వేసవిలో మొదలయ్యే సిక్సర్లు, బౌండరీల జడివాన కురిపించనుంది. పరుగుల వరదతో స్టేడియాలు హోరెత్తనున్నాయి. అలాగే యంగ్ టాలెంట్ టీమిండియాలోకి దూసుకెళ్లడానికి ఐపీఎల్ దగ్గరిదారిగా మారింది. దీంతో రాత్రికి రాత్రే స్టార్‌డమ్ తెచ్చిపెట్టే ఐపీఎల్‌లో సత్తా చాటేందుకు యువ ప్లేయర్లు సిద్ధమయ్యారు. పది జట్లు తలపడుతున్న 2026 ఐపీఎల్‌లో ఎవరికి విజయావకాశాలున్నాయి? జట్లలో మ్యాచ్ ఫినిషర్లు ఎవరు? అనే అంశం ఉత్కంఠ రేపుతోంది.*




(వార్త క్రీడా విభాగం)

2008 నుంచి ఐపీఎల్ హాట్ ఫేవరెట్లుగా ఒకటిగా ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్...2009, 2011, 2016లో ఫైనల్ వచ్చినా చివరి మెట్టుపై బోల్తాపడింది. ఎట్టకేలకు గత ఏడాది ఐపీఎల్ ట్రోఫీ అందుకుంది. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్‌గా రజత్ పాటీదార్ నేతృత్వంలో బరిలోకి దిగుతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఐపీఎల్ పోరును ఆరంభించనుంది. విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, విహాన్ మల్హోత్రా, ఫిల్ సాల్ట్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ వంటి మ్యాచ్ విన్నింగ్ ప్లేయర్లతో పటిష్ఠంగా ఉంది. రెండో ఏడాది ట్రోఫీ నిలబెట్టుకోవడంపై ఫోకస్ పెట్టింది.

**చెన్నై సూపర్ కింగ్స్ ఏడో ట్రోఫీ వేట**

ఐపీఎల్‌లో విజయవంతమైన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్‌ది అగ్రస్థానం. ఏకంగా అయిదు సార్లు ఛాంపియన్‌గా, మరో అయిదు సార్లు రన్నరప్‌గా నిలిచిన ఏకైక జట్టు. ఎక్కువసార్లు ప్లే ఆఫ్ ఆడిన జట్టుకూడా. గత ఏడాది సీఎస్‌కే ఫ్లాప్ షో చేసింది. 14 మ్యాచ్‌ల్లో నాలుగింటిలో మాత్రమే నెగ్గి పాయింట్ల పట్టికలోఅట్టడుగున నిలిచింది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో సారి సీఎస్‌కే భారీ ఆశలతో బరిలోకి దిగుతోంది. సంజూ శాంసన్, ధోనీ, శివమ్ దూబే, జేమీ ఓవర్టన్, మాథ్యూ షార్ట్, ఆయుష్ మాత్రే వంటి టాప్ క్లాస్ ప్లేయర్లు జట్టులో ఉన్నారు. 30న గౌహతీ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో ఐపీఎల్ పోరు ఆరంభించనుంది.

**ముంబై ఇండియన్స్‌లో సగం టీమిండియా**

చెన్నై సూపర్ కింగ్స్‌తో పాటు 5సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా ముంబై ఇండియన్స్ నిలిచింది. 2013, 2015, 2017, 2019, 2020లలో ఐపీఎల్ ట్రోఫీ అందుకుంది. మొత్తంగా ఆరుసార్లు ఫైనల్‌కు వచ్చింది. గత ఆరేళ్లుగా ఐపీఎల్ ట్రోఫీ అందుకోవడంలో విఫలమవుతోంది. 2025 లో 16 మ్యాచ్‌ల్లో 9విజయాలతో ప్లే ఆఫ్ వరకు వచ్చింది. హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని ముంబై ఇండియన్స్.. సగం టీమిండియాగా ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శార్దూల్ ఠాకూర్, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లతో నిండివుంది. 29న వాంఖడే వేదికగా కేకేఆర్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది.

**ఐపీఎల్ నైట్ రైడర్స్**

సీఎస్‌కే, ఎంఐ తర్వాత 3సార్లు ఛాంపియన్‌గా నిలిచిన జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్. 2012, 2014, 2024లో ట్రోఫీ అందుకుంది. 2021లో రన్నరప్‌గా నిలిచింది. గత ఏడాది స్థిరమైన ఆటతీరు కనబరచడంలో విఫలమైంది. ఈసారి అజింక్యా రహానే కెప్టెన్‌గా, రింకూ సింగ్ వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్న కేకేఆర్ జట్టు మనీష్ పాండే, రాహుల్ త్రిపాఠి, ఫిన్ అలెన్ , టిమ్ సీఫర్ట్, రోవ్‌మన్ పావెల్ లాంటి ప్లేయర్లతో పటిష్ఠంగా ఉంది.

**టాప్ ఆర్డర్ రైజింగ్**

సన్‌రైజర్స్ హైదరాబాద్ 2013లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సన్ రైజర్స్ హైదరాబాద్ మూడుసార్లు ఫైనల్‌కు వచ్చింది. 2016లో ఛాంపియన్‌గా నిలిచింది. 2018, 2024లో రన్నరప్‌తోనే సరిపెట్టింది. గత ఏడాది ఆరో స్థానంతో లీగ్ స్టేజ్‌లోనే వెనుదిరిగింది. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో ఈసారి హాట్ పెవరేట్‌గా బరిలోకి దిగుతోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిక్ క్లాసెన్, నితీష్ కుఆర్ రెడ్డి, లివింగ్ స్లోన్ వంటి క్లాస్ ప్లేయర్లు ఉన్నారు.

**పంజాబ్ కింగ్స్ ఫైనల్ ఫోబియా**

గత ఏడాది ఐపీఎల్ లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. లీగ్ స్టేజ్‌లో టాప్ పొజిషన్‌లో నిలిచింది. ఫైనల్ మెట్టుపై నిరాశపరుస్తూ రన్నరప్‌తో సరిపెట్టింది. 2014లోనూ ఒకసారి రన్నరప్‌గా నిలిచింది. 2008 నుంచి ఉన్న పంజాబ్ కింగ్స్‌కు... ట్రోఫీ అందని ద్రాక్షగా మారింది. శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్... ఈసారి ఆ కొరత తీర్చుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోంది. నేహాల్ వధేరా, ప్రభ్ సిమ్రాన్ సింగ్ లాంటి లోకల్ టాలెంట్ ప్లేయర్లతో పాటు మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా ఓమర్జాయ్, మార్కో జాన్సెస్, ఫార్గుసన్ లాంటి విదేశీ ప్లేయర్లతో సమతూకంగా ఉంది. 31న న్యూఛండీఘర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్ కథ మారేనా?**

ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఐపీఎల్ ట్రోఫీ కొరత వెంటాడుతోంది. 2020లో ఫైనల్‌కు వచ్చినా రన్నరప్‌తోనే సరిపెట్టింది. 2008, 2009లో సెమీఫైనల్లో ఓడింది. 2022 నుంచి వరుసగా నాలుగు ఐపీఎల్‌ల్లో లీగ్ స్టేజ్‌లోనే వెనుదిరిగి నిరాశపరిచింది. ఈసారి అక్షర్ పేట్ కెప్టెన్‌గా, కేఎల్ రాహుల్ వైఎస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతోంది. డేవిడ్ మిల్లర్, నితీస్ రాణా, పథూమ్ నిస్సాంక, పృధ్వీషా, ట్రిస్టన్ స్టబ్స్.. ఢిల్లీ జట్టులో కీలక ఆటగాళ్లు.


**గుజరాత్ టైటాన్స్ అదరహో**

2022లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చిన గుజరాత్ టైటాన్స్ తొలి ఏడాది ఛాంపియన్‌గా నిలిచి సర్‌ప్రైజ్ చేసింది. 2023లోనూ కూడా అదరగొడుతూ ఫైనల్‌కు వచ్చినా ట్రోఫీ నిలబెట్టుకోలేకపోయింది. గత ఏడాది ప్లే ఆఫ్ ఆడింది. టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఈసారి ట్రోఫీ అందుకోవడంపై ఫోకస్ పెట్టింది. తెవాటియా, సాయి సుదర్శన్, బట్లర్, హోల్డర్, గ్లేన్ ఫిలిప్స్, రషీద్ ఖాన్ లాంటి టాప్ క్లాస్ ప్లేయర్లు ఉన్నారు.

**రాయల్స్‌కు 2008 రిపీట్ అవుతుందా?**

అండర్ డాగ్స్‌గా బరిలోక దిగి తొలిసారే ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన రాజస్థాన్ రాయల్స్ మళ్లీ ట్రోఫీ అందుకోలేకపోయింది. 2022లో ఫైనల్‌కు వచ్చినా రన్నరప్‌గానే నిలిచింది. గత సీజన్‌లో ఫ్లాప్ షోతో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. రియాన్ పరాగ్ కెప్టెన్సీలో జడేజా, జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ,ధృవ్ జురెల్ లాంటి క్లాస్ ప్లేయర్లతో రాజస్థాన్ రాయల్స్ నిండి ఉంది.

**లక్నో సూపర్ జెయింట్స్:** 2024, 2025లలో లీగ్ స్టేజ్‌లోనే ఇంటిదారి పట్టింది. రిషబ్ పంత్ నేతృత్వంలో లక్నో... ఈసారి కప్‌పై దృష్టి సారించింది. మార్‌క్రమ్, జోష్ ఇంగ్లీష్, నికోలస్, పూరన్, మిచెల్ మార్ష్ లాంటి విదేశీ ఆటగాళ్ల ఆటతీరుపై భారీ ఆశలు పెట్టుకుది.



**హైదరాబాద్, మార్చి 27(వార్త క్రీడా ప్రతినిధి) :** ఐపీఎల్2026 సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. మార్చి 28న టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో చిన్నస్వామి

# ఆరంభ మ్యాచ్‌కు ఆరెంజ్ ఆర్మీ సై

స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఎస్ఆర్‌హెచ్ ఢీకొట్టనుంది. ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం ఆరెంజ్ ఆర్మీ అన్ని విధాల సిద్ధమైంది. రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఎస్ఆర్‌హెచ్ బరిలోకి దిగనుంది.

ఓపెనర్లుగా విధ్వంసకర ప్లేయర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు బరిలోకి దిగనున్నారు. వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి బ్యాటింగ్ వచ్చే అవకాశం ఉంది. కిషన్ గత సీజన్‌లో మూడోస్థానంలోనే బ్యాటింగ్‌కు వచ్చి అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఇక ఐదో స్థానంలో హెన్రిచ్ క్లాసన్ బ్యాటింగ్‌కు వచ్చే ఛాన్స్ ఉంది. అదేవిధంగా జట్టులోకి కొత్తగా వచ్చిన ఆల్‌రౌండర్ లివింగ్‌స్టోన్, అనికేత్ వర్మలు ఫినిషర్ పాత్రను పోషించనున్నారు. బౌలింగ్ విభాగానికి వస్తే ప్యాట్ కమ్మిన్స్ స్థానాన్ని ఇంగ్లీష్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్‌తో భర్తీ చేసే అవకాశం ఉంది. కార్స్ బంతితో పాటు బ్యాట్‌తో కూడా రాణించగలడు. హర్షల్ పటేల్, శివమ్ మావి, జయదేవ్ ఉనద్కత్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. అదేవిధంగా విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబే ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసే అవకాశముంది. అయితే గత సీజన్‌లో ఆకట్టుకున్న జీషాన్ అన్సారీ కూడా తుది జట్టు రేసులో ఉన్నాడు. అలాగే రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు(69) వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. దీంతో గతేడాది జరిగిన మినీ వేలంలో రూ.30 లక్షల బేస్‌ప్రైస్‌కు అతడిని ఎస్ఆర్‌హెచ్ సొంతం చేసుకుంది.

**ఎస్ఆర్‌హెచ్ జట్టు(అంచనా):** ట్రావిస్ హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్, లివింగ్‌స్టోన్, అనికేత్, వర్మ, బ్రైడన్ కార్స్, హర్ష్ దూబే,హర్షల్ పటేల్, శివమ్ మావి.

# నైషిక్‌కు సింగిల్స్ టైటిల్

**హైదరాబాద్, మార్చి 27(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్‌లో జరిగిన ఏఐటీఏ జాతీయ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణకు చెందిన నైషిక్ టైటిల్ సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో తెలంగాణకే చెందిన తీర్థ శశాంక్‌పై గెలుపొందాడు. నైషిక్ తొలి సెట్‌ను 6-4తో సులువుగా గెలుపొందగా, రెండో సెట్‌లో పుంజుకు తీర్థ శశాంక్ గట్టి పోటీ ఇచ్చాడు. రెండో సెట్‌ను శశాంక్ 7-6తో నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఫలితం తేల్చే కీలక సెట్‌లో నైషిక్ పుంజుకుని 6-2తో సెట్‌ను, మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు నైషిక్ సెమీఫైనల్లో తమిళనాడుకు చెందిన రెండో సీడ్ విక్రమ్‌పై, క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక ప్లేయర్ మనీష్ గణేష్‌పై గెలుపొందాడు. డబుల్స్ ఫైనల్లో ప్రణవ్ మహేష్, కృష్ణ తేజ జోడీ 7-6, 6-5తో నెగ్గి విజేతలుగా నిలిచారు. నైషిక్ రెడ్డి, పణ్రవ్ కొరాడే...మాజీ డేవిస్ కప్ ప్లేయర్ విష్ణువర్ధన్ శిక్షణలో రాటుదేలారు.



# 9 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




## వారాంతంలో ఈక్విటీల భారీ పతనం

## నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మార్చి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలు చవిచూసాయి. రెండు రోజుల లాభాల జోరుకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అనిశ్చితులు నెలకొనడంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దీంతో శుక్రవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ దాదాపు 1700 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ 50 ఇండెక్స్ మళ్లీ 23 వేల మార్క్ కోల్పోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ పీవీ వంటి స్టాక్స్ 5 శాతం మేర నష్టపోయాయి. ఈ క్రమంలో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 422 లక్షల కోట్లకు తగ్గింది. ఒక్కరోజే ఇన్వెస్టర్లకు దాదాపు రూ.9 లక్షల కోట్ల మేర ఆవిరైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఈరోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో సూచీలు నష్టాలతోనే ప్రారంభమయ్యాయి. ఉదయం 74,883పాయింట్లవద్ద మొదలైన సెన్సెక్స్ అంతకంతకూ దిగజారుతూ వచ్చింది. ఇంట్రాడేలో 73,534 కనిష్ఠ స్థాయిని తాకిన సూచీ చివరకు 1690.23 పాయింట్ల నష్టంతో 73,583 వద్ద ముగిసింది.

అటు నిఫ్టీ 50 సూచీ 486 పాయింట్లు పడిపోయి 22,819 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, ఇండిగో, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు 5 శాతం మేర పడిపోయాయి. కీలక రంగాల్లోని స్టాక్స్ అన్నీ నష్టాల్లోకి జారుకోవడంతో సూచీలపై తీవ్ర ప్రభావం పడింది. ఓఎన్జీసీ, టీసీఎస్, విప్రో, భారతీ ఎయిర్ టెల్, కోల్ ఇండియా వంటి సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ షేర్లు 3 శాతం మేర పతనమయ్యాయి. యుద్ధం నేపథ్యంలో గ్లోబల్ మార్కెట్లో చమురు ధరలు మళ్లీ భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ కు 107 డాలర్లు పలుకుతోంది. అంతర్జాతీయ ఈక్విటీల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. శుక్రవారం ట్రేడింగ్ లో డాలరుతో పోలిస్తే భారత కరెన్సీ రూపాయి మారకం విలువ 86 పైసలు పడిపోయి 94.82 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని నమోదు చేసింది. కొంత కాలంగా వరుసగా నష్టాల్లో ఉన్న స్టాక్ మార్కెట్లు గత రెండు సెషన్లలో లాభపడిన సంగతి తెలిసిందే. చివరి రోజు ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం మార్కెట్ల పతనానికి మూల కారణంగా మారింది. బీఎస్ఇలోకేవలం 822 కంపెనీల షేర్లుమాత్రమే పెరిగితే 3544 షేర్లు భారీగా క్షీణించాయి. 145 షేర్లుమాత్రమే నిలకడగా కొనసాగాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ 2.18శాతం, స్మాల్‌క్యాప్ 250 సూచీ 1.82శాతం చొప్పున క్షీణించాయి.

ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌రెండునాటి సెటిల్‌మెంట్లు 1.64శాతంపెరిగి రూ.1,41,813గా కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు 2.15 డాలర్లుపెరిగి 110.16 డాలర్లుగా కొనసాగింది. గ్లోబల్‌మార్కెట్లలో డౌజోన్స్ ఫ్యూచర్స్‌కూడా 144 పాయింట్లు దిగజారింది. యూరోపియన్‌షేర్లుకూడా వారాంతంలో నష్టాలే చవిచూసాయి. ఆసియా సూచీలుమాత్రం మిశ్రమంగా ముగిసాయి. వాల్‌స్ట్రీట్‌లో ఎస్అండ్‌పి 500 క్షీణించింది. నాస్‌డాక్ కాంపోజిట్ 2.38శాతం పతనం అయింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు కూడా 469.38 పాయింట్లు క్షీణించింది.




## ఏప్రిల్1 నుంచి వస్తున్న

# మార్పులివే

**ముంబయి, మార్చి 27:** ఆర్థికసంవత్సరం మారుతోంది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి కొత్త ఆర్థికసంవత్సరం ప్రారంభం కాబోతోంది. ఈతరుణంలో కొన్ని మార్పులు, సవరణలు అనివార్యంగా అమలవుతాయి. అలాగే ప్రతి నెలా ముగిసే సమయంలో కొత్త నిబంధనలు కూడా వస్తుంటాయి. వచ్చే ఏప్రిల్ ఒకటినుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమలుతో, పన్ను మరియు జీతానికి సంబంధించిన మార్పులు రాబోతున్నాయి. పాన్ కార్డుకు సంబంధించిన నిబంధనలు కూడా మారుతున్నాయి. ప్రతి నెలా మొదటి తేదీలాగే, 2026 ఏప్రిల్ 1వ తేదీ ప్రారంభం కూడా ఎల్‌పీజీ సిలిండర్ల ధరలలో మార్పుతో కనిపించవచ్చు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం ప్రారంభమైన తర్వాత, తీవ్రమైన ఎల్‌పీజీ కొరత మధ్య, చమురు కంపెనీలు ఇప్పటికే ధరలను పెంచి షాక్ ఇచ్చాయి. చమురు సంక్షోభం మధ్య, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఏటీఎఫ్, సీఎన్‌జీపీఎన్‌జీ రేట్లలో మార్పును చూడవచ్చు. 1961 నుండి అమల్లో ఉన్న ప్రస్తుత చట్టం స్థానంలో 2025 ఆదాయపు పన్ను చట్టం రానుంది. ప్రభుత్వం ప్రకారం, పన్ను చెల్లింపుదారులపై నిబంధనల పాటింపు భారాన్ని తగ్గించడానికి చట్టాన్ని ఆధునికంగా, సులభంగా చేయడానికి అనేక మార్పులు చేయబడ్డాయి. పన్నుకు సంబంధించిన కొన్ని మార్పుల గురించి చెప్పాలంటే, ఏప్రిల్ 1 నుండి, ఐటీఆర్ దాఖలు చేయడానికి అవసరమైన ఫారం 16 మీకు ఇకపై లభించదు. దానికి బదులుగా, దాని స్థానంలో మరొక ఫారం ఇవ్వబడుతుంది. కస్టమర్లు ఆ ఫారాన్ని ఆదాయపత్రంగా ఉపయోగించుకోవచ్చు. ఫారం 16ను టీడీఎస్ సర్టిఫికెట్‌గా పరిగణిస్తారు. ఇది జీతభత్యాల ఆదాయానికి సంబంధించిన టీడీఎస్ సర్టిఫికెట్ కూడా. ఫారం 16ఎ అనేది అద్దె, వడ్డీ, వ్యాపార, కన్సల్టెన్సీ ఫీజుల వంటి జీతమేతర ఆదాయాల కోసం ఉద్దేశించిన టీడీఎస్ సర్టిఫికెట్. ఏప్రిల్ 1 నుండి దీని పేరును కూడా ఫారం 131గా మార్చనున్నారు. ఏప్రిల్ 1 నుండి మీకు కూడా ఎటిఎం నిబంధనలు మారబోతున్నాయి. ప్రధాన మార్పులను పరిశీలిస్తే, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఇప్పుడు ఉచిత ఎటిఎంవిత్‌డ్రాయల్స్‌లో యుపిఐ విత్‌డ్రాయల్స్‌ను కూడా లెక్కిస్తుంది. ప్రతి లావాదేవీకి విత్‌డ్రాయల్స్‌పై రూ. 23 రుసుముతో ఈ బ్యాంక్ నెలకు ఎటిఎం నుండి 5 ఉచిత విత్‌డ్రాయల్స్ సౌకర్యాన్ని అందిస్తోంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో పాటు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా తన కొన్ని డెబిట్ కార్డుల రోజువారీ లావాదేవీల పరిమితులలో మార్పులను ప్రకటించింది. వినియోగదారులు ఇప్పుడు తమ కార్డ్ కేటగిరీని బట్టి రోజుకు రూ.50,000 నుండి రూ.75,000 వరకు విత్‌డ్రా చేసుకోగలరు. గతంలో రోజువారీ పరిమితి రూ.1 లక్ష వరకు ఉన్న కార్డ్ హోల్డర్లకు ఈ పరిమితి ఇప్పుడు తక్కువగా ఉంది.

ఏప్రిల్ 1, 2026 నుండి అమలులోకి రానున్న ప్రధాన మార్పులలో పాన్ కార్డులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. పాన్ దరఖాస్తుల కోసం కేవలం ఆధార్ కార్డులు మాత్రమే ఇకపై సరిపోవు, దరఖాస్తుదారులు ఇతర పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు అమల్లోకి రాకముందే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. రైల్వే టిక్కెట్లను రద్దు చేయడం ఖరీదైనదిగా ఉంటుంది. ఏప్రిల్ 1వ తేదీ నుండి వర్తించే నిబంధనల ప్రకారం, ఇప్పుడు ధృవీకరించబడిన రైల్వే టిక్కెట్లను రద్దు చేయడానికి ప్రయాణికులు ఎక్కువ డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు రైలు బయలుదేరడానికి 8 గంటల ముందు వరకు ఎలాంటి రీఫండ్ ఇవ్వబడదు. 8 నుండి 24 గంటల ముందు రద్దు చేసిన టిక్కెట్లపై 50 శాతం రీఫండ్, 24 నుండి 72 గంటల ముందు రద్దు చేసిన టిక్కెట్లపై 25 శాతం తగ్గింపు ఇవ్వబడుతుంది 72 గంటల ముందు రద్దు చేసిన టిక్కెట్లపై గరిష్ట రీఫండ్ ఇవ్వబడుతుంది.



## భారత్ విదేశీ కరెన్సీ ఖజానాకు


## 11.413 బిలియన్ డాలర్లు లోటు

**ముంబయి,మార్చి 27:** భారత్ విదేశీ కరెన్సీ రిజర్వులు 20వ తేదీతో ముగిసిన వారంలో రూ.11.413 బిలియన్ డాలర్లు క్షీణించాయి. మొత్తం కరెన్సీ నిల్వలు 698. 346బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు రిజర్వుబ్యాంకు ప్రకటించింది. పసిడి నిల్వల్లోనే భారీ తగ్గుదల నమోదు చేసినట్లు బ్యాంకు తెలిపింది. మొత్తం రిజర్వులు అంతకుముందు వారంలో కూడా 7.052 బిలియన్ డాలర్లు క్షీణించి 709.759 బిలియన్ డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. గతనెల 27వ తేదీతో ముగిసిన వారంలో 728.494 బిలియన్ డాలర్లు మేర గరిష్టస్థాయికి చేరినసంగతి తెలిసిందే.

ఇక మార్చి 20వ తేదీతోముగిసిన వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 2.127 బిలియన్ డాలర్లుపెరిగి 557.695 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ డేటా సూచిస్తోంది. విదేశీ కరెన్సీ ఆస్తులపరిధిలోకి యూరో, పౌండ్; యెన్ వంటి కరెన్సీల హెచ్చుతగ్గులు కూడా నమోదవుతాయి. పసిడి నిల్వలు 13.495 బిలియన్ డాలర్లమేర క్షీణించి 117.186 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 65 మిఇయన్ డాలర్లు దిగజారాయి. 18.632 బిలియన్ డాలరకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద భారత్ రిజర్వుస్థాయి 19 మిలియన్ డాలర్లుపెరిగి 4.833 బిలియన్ డాలర్లుగా ఉందని రిజర్వుబ్యాంకు వెల్లడించింది.

# భవిష్యత్తు వృద్ధికి ఎఐ

**న్యూఢిల్లీ, మార్చి 27:** కృత్రిమమేథ కార్యాచరణతో మేజర్ కంపెనీలన్నీ లే ఆఫ్‌లు ప్రకటిస్తుంటే ఈ ప్రభావం కొందరు సిఇఒలపైనా చూపిస్తోంది. కృత్రిమ మేధ వినియోగం పెరగడం కారణంగానే తాము పనిచేసే సంస్థలను వీడాలని భావించినట్లు ఇద్దరు సిఇఒలు చెపుతున్నారు. కోకోకోలా, వాల్‌మార్ట్ సిఇఒలు ఇదే విషయం స్పష్టంచేసారు. పనితీరులో కొత్తపరివర్తనం చోటుచేసుకుందని, భవిష్యత్తు వృద్ధి అంతా ఎఐ మీదనే ఆధారపడి ఉంటున్నదని, అంతేకాకుండా కొత్త నాయకత్వం కూడా యాజమాన్యంకోరుకుంటున్నందున మార్పులు అనివార్యం అవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్లనే కొన్ని కంపెనీల్లో ఉన్నతస్థాయి ఎగ్జిక్యూటివ్‌లు భావితరం సాంకేతిక మార్పులు కూడా అలవరుచుకోవాల్సిన అవసరం ఉందని వారన్నారు. కోకోకోలా సిఇఒ జేమ్స్ క్విన్సీ మాట్లాడుతూ సంస్థాగతంగా వచ్చిన మార్పులే తాను వైదొలిగేందుకు కారణం అవుతున్నాయన్నారు. భావితరం మార్పులతో ముందుకు దూసుకునివెళ్లే టీమ్ అవసరం అవుతున్నదని, భవిష్యత్తు వృద్ధికోసం టెక్ ఆధారిత ఎఐ నైపుణ్యాలున్న వ్యక్తి అవసరం అవుతున్నందున తాను వైదొలగాలని భావించినట్లు చెప్పారు. సంస్థలో సిఇఒగా ఉన్న హెన్రిక్ బ్రాన్ ఈనెల 31నుంచి సిఇఒ బాధ్యతలుచేపట్టనున్నారు. కృత్రిమమేథకు ముందు, జెన్ ఎఐమోడ్‌కు ముందు ఎంతో ప్రగతిని సాధించామని, అయితే ఇపుడు కొత్తమార్పులు అనివార్యం అవుతున్నాయన్నారు. వాల్‌మార్ట్ సిఇఒ మెక్ మిల్లన్ మాట్లాడుతూ శరవేగంతో దూసుకుపోయే వ్యక్తికి ఛాన్స్ ఇవ్వాలనే తాను తప్పుకున్నట్లు తెలిపారు.




గతనెల ఒకటవ తేదీనుంచే జాన్ ఫర్నర్ వాల్‌మార్ట్ సిఇఒగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది క్రితం భావితరం ఏజెంటిక్ కామర్స్ ఎలా ఉంటుందో, ఎఐ షాపింగ్ విజన్ ఎలా ఉంటుందో చూడొచ్చని భావించామని రానున్న కొన్నేళ్లలో జరగాల్సిన అన్ని అంశాలపైనా ఆలోచించానని మెక్‌మిలన్ పేర్కొన్నారు. మెక్‌మిలన్ హయాంలోనే వాల్‌మార్ట్‌ను నాస్‌డాక్‌లో లిస్టింగ్‌చేయాలన్న లక్ష్యంతో పనిచేసారు.

# మార్కెట్లకు వస్తున్న నాలుగు ఐపిఒలు

**న్యూఢిల్లీ, మార్చి 27:** మార్కెట్ల నియంత్రణ పర్యవేక్షణ సంస్థ సెబీ సింబయోటిక్ ఫార్మాలాబ్, విశ్వరాజ్ ఎన్విరాన్‌మెంట్, ఎస్ఎఇఎల్ ఇండస్ట్రీస్ సంస్థలకు సంబంధించిన ఐపిఒలకు పరిశీలన లేఖలు జారీచేసింది. అంటే సెబీ తుది ఆమోదం పొందేవరకూ ఈ అబ్జర్వేషన్ లేఖ నిబంధనలు కొనసాగుతాయి. ఈనెల 27వ తేదీవరకూ ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపింది. ఇదిలా ఉంటే జిందాల్ సుప్రీం ఇండియా తన ఐపిఒ ప్లాన్‌ను ఉపసంహరించుకుంది. షా ఇన్వెస్టర్స్ హోం, ప్రాసోల్ కెమికల్స్, నోపేపర్ ఫామ్స్ సొల్యూషన్స్ ఐపిఒలకు మాత్రం సెబీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సెబీ వద్ద 26 ముసాయిదా ఐపిఒల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఎస్‌బిఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్, దీపా జ్యూయెలర్స్, మనీవ్యూ సంస్థల దరఖాస్తులు కూడా ఉన్నాయి. ఇక సింబయోటెక్ ఫార్మాలాబ్ రూ.2180 కోట్ల నిధులు మీకరణకోసం ఐపిఒకు దరఖాస్తుచేసింది. తాజా ఇష్యూ




150కోట్లవరకూ ఉంటుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌కింద 2030 కోట్లు నిధులసమీకరణ ఉంటుంది. అంటే ప్రమోటర్లు, ప్రుత ఇన్వెస్టర్లు వాటాలను విక్రయిస్తారు. ఈ మొత్తాలను రుణాల తిరిగిచెల్లింపు కోసం కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు. ఇక విశ్వరాజ్ ఎన్విరో జలవనరుల వినియోగం, నీటియాజమాన్య ప్రాజెక్టుల నిర్వహణ సంస్థ రూ.2250 కోట్ల నిధుల సమీకరణకు ఐపిఒకు వస్తోంది. కంపెనీ ఐపిఒ తాజాగా రూ.1250 కోట్ల వరకూ ఉంది. ఆఫర్‌ఫర్‌సేల్‌కింద మరో 1000కోట్లు సమీకరిస్తుంది. ఈ నిధులను అనుబంధ సంస్థల రుణాల చెల్లింపులకు రూ.545 కోట్లు వ్యయంచేస్తుంది. మరో మూడు ప్రాజెక్టులకు మూలధన వ్యయంగా కూడా వాడుకుంటుంది. యుఎఫ్ ఆర్ టెక్నాలజీ ఆధారిత నీటిశుద్ధి ప్లాంట్‌కు ఈ నిధులు వినియోగిస్తుంది. వ్యవసాయ వృధానుంచి స్వచ్ఛ విద్యుత్ తయారీ సంస్థ ఎస్ఎఇఎల్ ఇండస్ట్రీస్ రూ.4575 కోట్లు సమీకరించేందుకు ఐపిఒకు వస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.